1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 7
సంచిక : 7
పుటలు : 52
రూ. 25 లు
ISSN NO:
2582-8738

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక https://ugccare.unipune.ac.in https://www.ugc.ac.in




**కోవిడ్-19 నీలినీడల్లో నాటకరంగం:** పన్నెండు రోజుల ఆన్‌లైన్ 'జాతీయ నాటకరంగం పండుగ'లో ప్రదర్శించిన బారిస్టర్ పార్వతీశం నాటకంలోని సన్నివేశాలు. పైచిత్రం: పార్వతీశం ఇంగ్లాండ్‌లో ఉన్నప్పుడు తనతండ్రి నుంచి వచ్చిన ఉత్తరాన్ని చదువుతున్న సన్నివేశం. డిజిటల్ సాంకేతికత ద్వారా గడియారాన్ని చూపి సమయ వ్యవధిని కళ్లకు కట్టినట్టు చూపారు. కింది చిత్రం: పార్వతీశం ఎడిన్‌బర్గ్‌లో అద్దెకు ఇల్లు వెతికే సన్నివేశం. డిజిటల్ పద్ధతిలో స్థలకాలాన్ని చూపే ప్రయత్నం. డిజిటల్‌గా త్రీడీలో చూపారు.





మన శ్రీనివాసరెడ్డికి ఫొటోగ్రాఫర్‌గా ప్రపంచంలోనే అత్యున్నత పురస్కారం వచ్చింది. రాయల్ ఫొటోగ్రాఫిక్ సొసైటీ (లండన్) ఫెలోషిప్‌తో గౌరవించింది. ముప్పయ్యేళ్ల క్రితం ఒక ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌గా వెలుగుచూసిన ఈ రైతుబిడ్డ- క్రమశిక్షణతో నిరంతర కృషితో ఎదిగాడు. అందరి మన్ననలను పొందుతూ ఎదురైన ప్రతీ అవార్డును గెలుచుకొంటూ, ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఆశించిన లక్ష్యాన్ని చేరుకొన్నాడు! యువతకేకాదు, అందరికీ ఆదర్శంగా నిలిచాడు!!

## పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలి

# ఆహ్వానము



అగ్నేయాసియా దేశాలలోని
తెలుగు అడుగుజాడలను పరిశోధించి
తన రచనలతో వెలికితెచ్చిన
సీనియర్ జర్నలిస్టు, పరిశోధకురాలు

## శ్రీమతి డి.పి.అనురాధ కు
## తాపీ ధర్మారావు పురస్కారం

**జగమునేలిన తెలుగు**
గోదావరి నుండి జావా దాకా
పుస్తక ఆవిష్కరణ



| | |
|---|---|
| తేదీ, సమయం | : 12, డిసెంబరు 2021 ఉ॥ గం.10.00 లకు |
| వేదిక | : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి, టెలిఫోన్‌భవన్ పక్కన, బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా, సెక్రటేరియట్ రోడ్డు, ఖైరతాబాదు, హైదరాబాదు. |
| సభాధ్యక్షులు | : ఆచార్య జయధీర్ తిరుమలరావు రచయిత, పరిశోధకుడు |
| ముఖ్య అతిథి | : డా॥ జస్టిస్ జి. రాధారాణి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి |
| పుస్తకావిష్కరణ | : జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు ఉమ్మడి ఆం.ప్ర. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి |
| విశిష్ట అతిథి | : డా॥ కె.శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకుడు |
| ఆత్మీయ అతిథులు | : ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు భారతీయభాషల సంఘ జాతీయఅధ్యక్షుడు |
| | ఆచార్య గూడూరు మనోజ విశ్రాంత ప్రొఫెసర్, రచయిత |
| | శ్రీ స.వెం. రమేశ్ రచయిత, పరిశోధకుడు |

**తాపీ ధర్మారావు వేదిక**
సమావేశకర్త : డాక్టర్ సామల రమేష్‌బాబు 98480 16136

**జగమునేలిన తెలుగు**
గోదావరి నుండి జావా దాకా
రచయిత డి. పి. అనురాధ

శ్రీలంక, మయన్మార్, థాయిలాండ్, మలేషియా, వియత్నాం, ఇండోనేషియా, నేపాల్, టిబెట్ లలో పర్యటించి జగమునేలిన తెలుగు- గోదావరి నుండి జావాదాకా పుస్తకాన్ని రచించారు. 'చరిత్రపై తెలుగు సంతకం' శీర్షికన పత్రికలలోను, జనమాధ్యమాలలోను వ్యాసాలు వ్రాస్తున్నారు. తెలుగువారి గత వైభవం వెలుగులోకి రావాలని ఆ గుర్తింపుతో తెలుగు ఆనవాళ్లను పరిరక్షించుకోవాలని, ప్రభుత్వం ఈ అవసరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రచయిత్రి ఆకాంక్ష.

## ఇంతవరకు తాపీ ధర్మారావు పురస్కారాన్ని పొందినవారు


డా॥ఎన్.వేణుగోపాల్-2009


డా॥కె.శ్రీనివాస్-2011


శ్రీ టంకశాల అశోక్-2013


శ్రీ జి.శ్రీరామమూర్తి-2014


శ్రీ ఎ.కృష్ణారావు-2015


శ్రీ ఆర్ఎం.ఉమామహేశ్వరరావు-2016


శ్రీసతీష్ చందర్-2017


డా॥ ఏటుకూరి ప్రసాద్
జీవనసాఫల్య పురస్కారం-2018


శ్రీ వై.ముకుందరామారావు-2020

తెలుగుజాతి (ట్రస్టు)
వేలు నెలవులు పలుకు ఒక్కటే

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




డిసెంబరు 2021

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

**4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సామాజిక మాధ్యమాల్లో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.**

**5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను,వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.**

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదక హృదయం:** | పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలి | | **07** |
| **దేశీయ భాషల వాడుక:** | పనిస్థలాల్లో దేశీయ భాషల వాడుక–2 | **జె.డి.ప్రభాకర్** | **09** |
| **అమ్మనుడులు:** | అమ్మనుడుల రక్షణకు ఒక కొత్త... | **పి. ప్రకాష్, జి.ప్రవీణ్** | **13** |
| **చదవవలసిన పుస్తకం:** | సంచారులు,రాజులు,వ్యాపారులు.. | **కాళిదాసు పురుషోత్తం** | **16** |
| **కొత్తమాట:** | కొత్తమాటల పుట్టింపు | **స.వెం.రమేశ్** | **19** |
| **డా॥ లోహియా:** | సిద్ధాంత చర్చ తెలుగుసేత: | **రావెల సాంబశివరావు** | **20** |
| **మన చదువుల కథలు:** | చదువుకొన్న కోతి | **సి.వి.క్రిష్ణయ్య** | **23** |
| **వారసత్వ సంపద:** | 'మాలపల్లి'–ముందూ వెనుకా... | **పి.శివరామకృష్ణ'శక్తి'** | **26** |
| **కథ:** | ఇంటికొక్కరు | **యలవర్తి అనూరాధ** | **31** |
| **ముఖచిత్ర కథనం:** | కోవిడ్–19 నీలినీడల్లో నాటకరంగం | **వెంకటనరేష్ బుర్ల** | **33** |
| **పుస్తక పరిచయం :** | జాషువా హృదయ దర్పణం | **కొండపల్లి సుదర్శనరాజు** | **36** |
| **పుస్తక పరిచయం:** | తెలుగుతేజం సాంఘికోద్యమ... | **దుగ్గరాజు శ్రీనివాస్** | **37** |
| **తెలుగులిపి:** | లేఖనం ఒక సంప్రదాయం | **అల్లంసెట్టి చంద్రశేఖరరావు** | **38** |
| **గ్రంథాలయం** | | | **50** |
| **ఆత్మకథ:** | కొయ్యబొమ్మ..చంద్రప్పసోబటి/రంగనాథరామచంద్రరావు | | **40** |
| **నవల:** | మా ఊరు | **అగరం వసంత్** | **45** |
| **ధారావాహిక:** | అడుగుజాడలూ ఆనవాళ్లు–13 | **ఈమని శివనాగిరెడ్డి** | **28** |
| **కవిత:** | అంబేద్కర్ చూపుడువేలే జీవనగీత | **కత్తి పద్మారావు** | **44** |



| కార్టూన్లు | రేఖాచిత్రాలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి** | **చిదంబరేశ్వరరావు** | **బండారు రఘురాం** |


ammanudi.org వలగూటిలో అమ్మనుడి పాత సంచికలను చదవగలరు

రచనలను, వార్తలను, వాట్సాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com


రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు మాసపత్రిక

చందా వివరాలు: జీవిత చందా: రూ.5000

4 సం॥: రూ.1000, 1 సం॥ :రూ.300

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

గూగుల్ పే/ ఫోన్ పే ద్వారా **'అమ్మనుడి'** పత్రిక చందా పంపవచ్చు

**నెం. '94929 80244'తో**

బిజినెస్ అప్షన్‌లోకి వెళ్ళి

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

ఎంట్రీ చేసి పంపవచ్చు

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు. **94404 48244** లేదా **94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**



## 'అమ్మనుడి' బృందంలో ఒకరైన ప్రముఖ ఫొటోగ్రాఫర్
# తమ్మా శ్రీనివాసరెడ్డికి
## ప్రపంచ స్థాయి అత్యున్నత గుర్తింపు
## రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ(లండన్) ఫెలోషిప్

**ఫో**టోగ్రఫీ రంగంలో నోబెల్ బహుమతిగా పరిగణింపబడే FRPS (ఫెలో, రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ) గౌరవాన్ని తెలుగువాడైన భారతీయ ఫొటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డికి ప్రకటించారు. 1853వ సంవత్సరంలో లండన్ కేంద్రంగా ప్రారంభమైన రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ ఫోటోగ్రఫీ రంగంలో విశేష కృషిచేసిన ఛాయాచిత్రకారులకు వివిధ అవార్డులను బహూకరిస్తూ వస్తోంది. వీటిలో అత్యున్నతమైనది 'ఫెలోషిప్'. దీనికి ఈ సంవత్సరం ప్రపంచస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనపరచిన ప్రముఖ భారతీయ ఫొటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి, బ్రిటిష్ ఫొటోగ్రాఫర్ డేవ్‌వ్రాగ్ ఇరువురు ఎంపికయ్యారు. గత 170 ఏళ్లుగా కేవలం 18 మంది భారతీయులు మాత్రమే ఈ అవార్డును (ఫెలోషిప్) పొందారు. అందులో నేడు శ్రీనివాసరెడ్డి ఒకరుగా కలిశారు. కోవిడ్ మహమ్మారిని జయించే క్రమంలో భారత ప్రభుత్వం, ఇతర రాష్ట్రప్రభుత్వాలు, కోవిడ్ వారియర్స్ ప్రదర్శించిన అత్యున్నత సేవలను శ్రీనివాసరెడ్డి తన ఛాయాచిత్రాల ద్వారా చిత్రీకరించి, వాటిని రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీకి పంపారు. ప్రపంచంలోని అనేకమంది ఫొటోగ్రాఫర్లు ఇదే అంశంపై తమ చిత్రాలను పంపినా శ్రీనివాసరెడ్డి సమర్పించినవే అత్యున్నతంగా వున్నాయని, మనస్సులను, మనుషులను ఏకకాలంలో కదిలించాయని న్యాయనిర్ణేతలు ముక్తకంఠంతో ప్రకటించారు. శ్రీనివాసరెడ్డి సమర్పించిన 21 చిత్రాలను చిత్రమాలిక అత్యద్భుతమని ప్రకటించి, ఫెలోషిప్ అవార్డుకు శ్రీనివాసరెడ్డి నిస్సందేహంగా అర్హుడని ఏకగ్రీవంగా నిర్ణయించారు. కోవిడ్ మహమ్మారిపై ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన కృషిని శ్రీనివాసరెడ్డి తన చిత్రాలలో ఆవిష్కరించారు.

తన ప్రాణాలకు తెగించి శ్రీనివాసరెడ్డి చూపిన చొరవను రాయల్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ ప్రత్యేకంగా అభినందించింది. కోవిడ్–19 మహమ్మారి బారినపడిన సామాన్యులను రక్షించడానికి భారతదేశంలో వివిధ ప్రభుత్వాలు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకులు పడిన పాట్లను కళ్ళకు కట్టినట్లుగా శ్రీనివాసరెడ్డి చిత్రీకరించారు. ఐసియు వార్డుల్లో, వీధులలో, స్మశానవాటికల్లో వివిధ మారుమూల ప్రదేశాల్లో ఆవిష్కృతమైన హృదయవిదారక సన్నివేశాలను, అక్కడ సేవలందిస్తున్న కోవిడ్ వారియర్స్‌ను ఆయన తన ఛాయాచిత్రాలలో ప్రపంచం ముందుంచాడు.

శ్రీనివాసరెడ్డి ప్రదర్శించిన ఈ తెగువకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. ఇది కేవలం ఆయన ప్రతిభకు మాత్రమే పురస్కారంకాదు. ఈ శతాబ్దిలో సంభవించిన మహమ్మారిపై విజయానికి, జయించుటకు ప్రజాస్వామిక ప్రభుత్వాల కృషికి ఇది గుర్తింపు. తమ కుటుంబాలను సైతం విస్మరించి వ్యాధిపై పోరాడిన కోవిడ్ వారియర్స్‌కు ఈ అరుదైన బహుమానం ఒక ఆత్మీయ పలకరింపు. జర్నలిజంలో భారతీయులు ప్రపంచస్థాయికి తీసిపోరని ఋజువుచెయ్యడానికి ఈ అవార్డు ఒక గుర్తింపు.

దాదాపు గత 40 సంవత్సరాలుగా శ్రీనివాసరెడ్డి ఫొటోగ్రఫీ రంగంలో, జర్నలిజంలో అనేకమందికి చిరపరిచితుడు. ఆయన పలు ప్రఖ్యాత దినపత్రికలు ఇండియాటుడేలకు చాలా కాలంపాటు సేవలందించారు. ఆయన కెమెరా పనితనం త్వరితంగా విశ్వవ్యాప్తమైంది. ప్రపంచంలోని వివిధ దేశాల సంస్థలు శ్రీనివాసరెడి పలు పురస్కారాలను అందుకున్నారు. భారతదేశంలో వివిధ ప్రభుత్వాలు, సంస్థలు ఆయన్ను సత్కరించి, గౌరవించాయి. గత 32 సంవత్సరాలుగా అంతర్జాతీయఫొటోగ్రఫి పోటీలలో పాల్గొని 183 బంగారుపతకాలు, 494 అవార్డులు, 890 ప్రశంసాపత్రాలుతో పాటు వీరు తీసిన 5847 ఛాయాచిత్రాలు ఎంపికై వివిధ అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శింపబడ్డాయి. గడచిన 20 సంవత్సరాలుగా ప్రపంచస్థాయిలో తొలిపదిమందిలో ఒకరుగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. అనేక సంస్థలనుండి గౌరవ పురస్కారాలను పొంది, ఎవ్వరికీ అందనంత ఎత్తులో నిలిచారు. ఫొటోజర్నలిజంలో 2007లో రామ్‌నాథ్‌గోయంకా మెమోరియల్ అవార్డును, ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం 2012కి ఫొటోజర్నలిజంలో జీవితసాఫల్యపురస్కారంతో సత్కరించింది. 2015 సంవత్సరంలో అమెరికాలోని ప్రముఖ అంతర్జాతీయ ఫొటోగ్రఫి సంస్థ అయిన ఇమేజ్ కొలీగ్ సొసైటీ ఒకే ఏడాది 7 అంతర్జాతీయ పురస్కారాలు సాధించినందులకుగాను గ్రాండ్‌మాస్టర్ అవార్డుతో సత్కరించింది.

నడుస్తున్న చరిత్ర, అమ్మనుడి పత్రికల్లో శ్రీనివాసరెడ్డి కెమెరా నుండి వెలువడిన ఎన్నో ఫోటోలు ప్రచురించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డికి ఆత్మీయ అభినందనలు

–సంపాదకుడు


బుద్ధిమంతుడివి నాయనా!
ఇంగ్లీషు జీవో కూడా వెనక్కి
తీసుకో!
సరసి


అమ్మ భాష కాదు 'అన్న భాషా పథకం'
అని పెడదాం సార్! 'బ్రదర్ టంగ్'
వెరైటీగా వుంటుంది!!
సరసి

సంపుటి : 7 సంచిక : 7
**అమ్మనుడి**
డిసెంబరు 2021

సంపాదకీయం

# పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కోవాలి

**2012** డిసెంబరులో ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో జరిపింది నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. తెలుగు భావోద్వేగాలను ఎంతో కొంత రగిలించి, తెలుగుజాతి సమైక్యత అనే నినాదాన్ని ప్రయోగించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చి రాజకీయలబ్ధి పొందాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వెంపర్లాడింది గాని, అందులో ఏమాత్రం సఫలం కాలేకపోయింది. నేతల భావదారిద్ర్యం వల్ల తామనుకొన్నదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లలేక చతికిలబడింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లను నీరుగార్చాలని ప్రయత్నించిన ప్రభుత్వం, చివరకు మెట్టుదిగి సభల తొలిరోజునే కొన్ని వాగ్దానాలను ప్రకటించింది. అయితే అందులోనూ చిత్తశుద్ధిలేనందువల్ల, నాటి పాలకపార్టీ ఏమాత్రం లాభం పొందలేకపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగా మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబుగారి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అనుసరించిన మోసపూరిత విధానాల వల్ల పాలనలో, చదువులో తెలుగు వినియోగం అట్టడుగుకు తొక్కివేయబడింది.

పట్టనితనంతో కాంగ్రెసు ప్రభుత్వాలు వ్యవహరిస్తే చంద్రబాబు తెలుగుదేశం ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరించాయి. సమైక్య రాష్ట్రంలో చంద్రబాబు పాలనలోనే విధ్వంసం మొదలైంది. నిరసనగా అప్పుడే తెలుగుభాషోద్యమాలు పుట్టుకొచ్చాయన్న సంగతిని మనం మరువకూడదు. తెలుగు భాషోద్యమ సమాఖ్య ఏర్పడి ప్రత్యక్ష చర్యలను మొదలుపెట్టింది అప్పుడే. చంద్రబాబు తొలినుండీ చేపట్టిన తిరోగమన విధానాలతోనే ఎన్టీరామారావు రాజకీయ, సాంస్కృతిక వికాసం కోసం చేపట్టిన చర్యలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఆయన బొమ్మనుపెట్టుకొని చంద్రబాబు సాగించిన పాలన– అభివృద్ధి పేరుతో రియల్ఎస్టేట్, ఐటి వంటి రంగాల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా చెప్పుకొనే దుస్థితికి చేరింది. మొత్తంగా రాష్ట్రప్రగతి మేడిపండులా మిగిలింది. జనసమూహాల్లో ఆయనపై నమ్మకం నశించడమేగాక, కొత్తగా వచ్చిన రాజకీయ పార్టీకి అవకాశాలు సమకూర్చినట్లయింది. మతం, కులం, వర్గం వంటి సున్నిత అంశాలన్నీ వైఎస్ఆర్ కాంగ్రెస్ యువనేతకు అందివచ్చాయి. నాణెం తిరగబడినా పాత విధానాలే మరోరూపంలో, కక్షతో, కసితో తాండవమాడు తున్నాయి. ఫలితాలు మరింత భయంకరంగా అనుభవంలో కొస్తున్నాయి.

అయితే చంద్రబాబు పోకడకు భిన్నంగా జగన్ ధోరణి స్పష్టంగా తెలుస్తున్నది. తెలుగులో పాలన, బోధనకు సంబంధించి ఆయన కుండబద్దలు కొట్టినట్లు తన విధానాలను ప్రకటించేశారు. ఇంగ్లీషే దైవం, ఇంగ్లీషే మార్గం, ఇంగ్లీషే భవిష్యత్తు అని అయనా, అయన ప్రభుత్వమూ స్పష్టం చేస్తున్నారు. అందుకు తగ్గట్లుగా తమ పాలనా విధానాలను తీర్చిదిద్దుతున్నారు. తరతరాలుగా మోసపోయిన తెలుగు ప్రజలకు తానే విముక్తి ప్రదాతనని ఆయన నమ్మబలుకుతున్నారు. చంద్రబాబు ఏనాడూ ఇట్లా నోటితో చెప్పలేదు. ఇంగ్లీష్ మీడియంను ప్రోత్సహించి ఉద్యోగాలకై యువత విదేశాలకు వెళ్లేందుకు బాటలు వేసింది తానేనని నిండు సభలో, అదీ తెలుగుభాషాదినోత్సవం నాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రకటించుకున్నాడు. 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తొలి ముఖ్యమంత్రిగా తన హయాంలో విద్యావ్యాపారస్తులకు మంత్రి పదవులు యిచ్చి వారి చేతుల్లో విద్యారంగాన్ని అప్పచెప్పిన ఘనత ఆయనదే! ప్రాథమిక స్థాయిలో కూడా తెలుగుకు ఉద్వాసన చెప్పే జీవోను ప్రాథమిక విద్యాశాఖ మంత్రి జారీ చేసినప్పుడు, ఎంఎల్‌సీలు దాన్ని ప్రశ్నించారు. ఉద్యమాలు నడిచాయి. తనకు తెలియకుండా జి.ఒ. వచ్చినట్లు అమాయకత్వాన్ని నటించి, ఆ జి.ఒ ను రద్దు చేస్తున్నానని ప్రకటించిన పెద్దమనిషి, తర్వాత ఆ సంగతినే మరచిపోయాడు. తెలుగు భాషాభివృద్ధి సంస్థను ఏర్పరుస్తాననీ, దానికి జి.ఒ. యిస్తే విలువ ఉండదు గనుక

సంపాదకీయం

దాన్నొక చట్టంగానే తెస్తానని బీరాలు పలికి, చివరకు ఒక జిఒతోనే సరిపెట్టాడు. తర్వాత ఎన్నికల్లో ప్రభుత్వమే మారడంతో అదంతా తుస్సుమంది. అన్నివిషయాల్లో అయనది ఇదే శైలి. ఆయన తన అజెండాను తాను అమలు పరుచుకుంటూ ముందుకు సాగిపోయాడు. కనుకనే అన్ని విధాలా ఆయన అపజయాల పాలవుతున్నాడు. నమ్మకాన్ని పోగొట్టుకొంటున్నాడు. మిత్రులను శత్రువులుగా చేసుకొంటున్నాడు. అల్లరి పాలవుతున్నాడు. ఆయన చిత్తశుద్ధిపై ఎవ్వరికీ నమ్మకం లేని స్థితి ఏర్పడుతోంది. ఐనా ఆయన మారతాడన్న ఆశ ఏమీ కన్పించడంలేదు.

మరి, ఇప్పుడున్న ప్రభుత్వం తన విధానాలను స్పష్టంగా ప్రకటించిన పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల భాషగా తెలుగును కాపాడుకోవడం ఎలా? పాలనలో అడుగంటిపోయి, పాఠశాల విద్యలో సోదిలోకి కూడా లేకుండా పోతున్న మన అమ్మనుడిని కాపాడుకోవడం ఎలా? మన భాషతో మనం ఎదగడం అనే ప్రజాస్వామ్య విధానాన్ని, భాషారాష్ట్రాల లక్ష్యాన్ని సాధించడం ఎలా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక భాషగా తెలుగును ఉంచింది కదా అని పదవుల కోసం దాసోహం అన్న పెద్దలు కొందరు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. అదంతా కల్లబొల్లి వ్యవహారం. ఆంధ్రప్రదేశ్ సంగతే కాదు, తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి కూడా ఏమీ బాగోలేదు. కాకపోతే వారు ఈ అంశంపై అంతగా స్పష్టత ఇవ్వరు. తెలంగాణ భాషా సంస్కృతుల రక్షణ పేరిట అధికారంలోకొచ్చాక భాషవిషయంలో వారు స్పష్టమైన చర్యలు ఏమీ తీసుకోలేదు. తెలంగాణ సంస్కృతి పేరిట చేతనైనంత చేస్తున్నామంటున్నారు గాని, భాషను కోల్పోయిన జాతి తన సంస్కృతిని కాపాడుకోలేదన్న వాస్తవాన్ని వారు గుర్తించరు!

అధికారంలోకి వచ్చిన ఏడాదికే తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహించింది. గొప్పగా ప్రచారం చేసుకొని అంత గొప్పగానూ సభలను జరిపింది. భాషవిషయంలో అందరికీ ఆదర్శంగా నిలబడతానని, తెలుగును కన్ననేల తెలంగాణలో అద్భుతాలు చేయబోతున్నామని ప్రకటించింది. ఆ తర్వాత వెంటనే మౌనం వహించింది. సద్దుచెయ్యకుండా ఇతర భాషాధిపత్యవర్గాలు ముందుకు సాగిపోతున్నాయి!

సమైక్య రాష్ట్రంగా ఉన్నప్పుడే పీవీ నరసింహారావు గారు తన పాలనలో తెలుగుకోసం పటిష్టమైన, శాస్త్రీయమైన పద్ధతిలో పునాదులు వేశాడు. ఎన్టీరామారావు గారు తెలుగుజాతి అంతటికీ ప్రపంచంలోనూ దేశంలోనూ ఒక గుర్తింపు తెచ్చాడు. ఆ తర్వాత వచ్చిన పాలకులకు ఆ అవగాహనగానీ, ఆలోచనగానీ లేకపోగా, కళ్లు మూసుకొని రాజకీయ స్వార్థాలను పెంచిపోషించారు తప్ప, భాషారాష్ట్రాల లక్ష్యాలను గానీ తెలుగుజాతి శ్రేయస్సును గానీ పట్టించుకోలేదు.

అటు కేంద్ర ప్రభుత్వం మాతృభాషల్ని కాపాడతానంటూనే దేశంలో హిందీ, ఆంగ్లం విస్తరించడానికి దారులను విశాలం చేస్తూ ఉంటే తమ భాషల్ని కాపాడుకునేందుకు హిందీయేతర భాషారాష్ట్రాలు కృషి చేయవద్దా అనేది ప్రజలముందున్న పెద్ద ప్రశ్న.

అమ్మనుడుల ప్రాధాన్యతనూ భాషావైవిధ్యాన్నీ కాపాడుకోవాలన్న యునెస్కో పిలుపును పరిగణనలోకి తీసుకోక పోవడం తెలివి అవుతుందా? ఈ అంశాలపైన ప్రపంచంలో జరుగుతున్న చర్చను, ఉద్యమాలను పట్టించుకోవద్దా? దేశం వెలుపల నుంచీ, దేశం లోపలినుంచీ బలంగా తోసుకువస్తున్న ఆధిపత్య భావజాలాలు– ప్రజల మనుగడకు, గుర్తింపుకు ఆధారమైన భాషాసంస్కృతులకూ స్వతంత్ర అభివృద్ధికీ ముప్పుగా పరిణమిస్తున్న దశలో కూడా కళ్లు మూసుకొని వ్యవహరిస్తున్న పాలకవర్గాల దుర్మార్గాన్ని ఎదుర్కొనేందుకు ఏం చెయ్యాలి? మేధావులమనుకొనే ఆసంఖ్యాక పాండురాజుల కళ్లనూ, నోళ్లనూ తెరిపించడం ఎలా? సమాజ శ్రేయస్సును పట్టించుకొనే వారంతా ఆలోచించాలి.

అమ్మనుడులను రక్షించుకోవడమనే అవసరాన్ని రచయితలకో పండితులకో ఉపాధ్యాయులకో వదిలివేద్దామనే ధోరణికి కాలం చెల్లింది. ప్రజల్లో కదలిక వచ్చిందని అర్థమైతేనే రాజకీయ పార్టీలు కళ్లు తెరుస్తాయి. తమ విధానాల్లో ప్రాధాన్యతలను తిరుగరాసుకొంటాయి.

తేదీ : 30-11-2021

సామల రమేష్‌బాబు

జె.డి. ప్రభాకర్
8500227185

# పనిస్థలాల్లో దేశీయ భాషల వాడుక-దేశ ఆర్థికాభివృద్ధి ②

సమాజంలో ఎందుకు కొన్ని భాషలు ఎక్కువ విలువైనవిగా ఎంచబడతాయి? ఎందుకు మిగిలిన భాషలు తక్కువ విలువైనవిగా ఎంచబడతాయి? భాషకు గల గొప్ప చరిత్రా, బలమైన వ్యాకరణమూ, పదజాలమూ, సాహిత్యం కారణంగా గొప్ప భాషలుగా పిలువబడతాయా? కాదు! భాషల విలువ భాషల వాడుకపై ఆధారపడి ఉంటుంది. మన శరీరంలోని అన్ని భాగాల్లోకి రక్త ప్రసరణ జరిగితే ఎంత ఆరోగ్యకరంగా శరీరం ఉంటుందో సమాజంలోని అన్ని రంగాలలో అమ్మనుడిని ఉపయోగిస్తే సమాజం కూడా అంతే ఆరోగ్యంగా ఉంటుంది. ఒక సమాజంలో, ఏ రంగంలో అయితే అమ్మనుడి వాడుక తగ్గుతుందో అక్కడ నుండే సమాజం నడక కుంటుపడుతుంది. మరీ ముఖ్యంగా పనిచేసే స్థలాలలో అమ్మనుడి వాడుక సమాజానికి ముఖ్యమైనది. మనిషి జీవితమంతా సంపద సృష్టి తోడే ముడిపడి ఉంది. సంపద సృష్టికి మూలం జ్ఞానం. జ్ఞానానికి మూలం భాష! భాషకీ సంపదసృష్టికీ గల సంబంధాన్ని అంచనా వేయడమే ఈ పరిశోధనా వ్యాసం ఉద్దేశం. మన సమాజంలో, మనదైన ప్రజా స్వామ్యంలో, భాషా ప్రణాళికలను అమలు చేసే ప్రభుత్వాలు మన దైనందిన జీవితంలో ఇంగ్లీషూ, మన అమ్మనుడీ, తదితర దేశీయ భాషల 'ఆర్థికవిలువల' పట్ల మనకు ఉన్న నమ్మకాలూ, మనం మోస్తున్న అవాస్తవిక అంచనాలు వాటి విశ్లేషణలూ 'చర్చకు రాని అసమగ్ర అంశాలు'గానే ఉంటున్నాయి. 'విలువ' అనే పదం అర్థశాస్త్రానికి సంబంధించినది. భాష యొక్క 'ఉపయోగపు విలువను' సూక్ష్మ-అర్థశాస్త్ర కోణంలో చూడాలి. నిత్యం మనం సాధారణ అవసరాలు తీర్చుకోవడానికి భాషని ఉపయోగించినా పని చేసే సందర్భాలలో ఉపయోగించేటప్పుడు భాషని వస్తూత్పత్తి చేయడానికో, సేవా పరంగా ఉపయోగించడానికో వాడుతాము. కాబట్టి పనికి భాష ఒక ఉపకరణంగా, ఒక వాహికగా ఉపయోగపడుతోంది. పనిచేసే చోట్లల్లో శ్రామికులు అందరూ సమిష్టిగా ఉత్పత్తి చేసిన ఉత్పాదనల ఆదాయానికీ వారు ఉపయోగించే భాషలకూ ఎటువంటి సంబంధాన్ని కలిగి ఉంటుందో అనుభవంలోకి వచ్చిన ఆధారాలతో శాస్త్రీయ పద్ధతిలో తెలియజేయటమే దీని ముఖ్య ప్రయోజనం.

**క్షేత్ర పర్యటన:**

పనిస్థలాల్లో వివిధ సందర్భాలలో వివిధ రూపాలలో ఏ భాషను ఏ విధంగా వాడుకలో ఉందో తెలుసుకోవడానికి క్షేత్ర పర్యటన ఎంతో దోహదపడుతుంది. శ్రామికులు అందరూ కలిసి సమిష్టిగా పని చేసే సందర్భాలలో వారందరూ ఒక లక్ష్యంతో, నిర్దేశించిన పనులలో పని చేయడానికి వారందరినీ సమన్వయపరిచేందుకు భాష కీలక పాత్ర పోషిస్తోంది. ఉత్పత్తిలో భాష పాత్రను క్షేత్ర స్థాయిలో తెలుసుకోవడానికి తెలంగాణ రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో సింగరేణి బొగ్గు గనుల పరిశ్రమను ఎన్నుకోవడం జరిగింది. సి.ఐ.ఏ. ఫ్యాక్‌బుక్ గణాంకాల ప్రకారం భారత దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (GDP) వ్యవసాయ రంగం 15.4 శాతం, సేవా రంగం 61.5 శాతం కాగా 23 శాతంతో పరిశ్రమ రంగం 560.97 బిలియన్ల డాలర్లు (41,64,221 కోట్ల రూపాయలు) పంచుకుంటూ ప్రపంచంలో ఆరవ స్థానంలో నిలిచింది. అటువంటి పరిశ్రమ రంగంలో ముఖ్య పాత్ర వహిస్తున్న సింగరేణి బొగ్గు గనులు 46,021 మంది కార్మిక శక్తితో 640.44 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో భారతదేశానికి 9.2% జాతీయ స్థూల జాతీయ ఉత్పత్తి (%స్థజఉ%) అందిస్తుంది. దేశానికి ఇంతటి ఆదాయాని అందిస్తున్న ఇటువంటి పరిశ్రమలో నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో శ్రామికుల మధ్య సంభాషణలూ, పరిశ్రమలో ఉపయోగించే భాష, శిక్షణా మాధ్యమంపై పరిశోధన చేయడం జరిగింది.

**సమాచార సేకరణ పద్ధతి:**

సింగరేణి బొగ్గు గనుల పరిశ్రమ 51% తెలంగాణ రాష్ట్ర పరిధిలో 49% కేంద్ర పరిధిలో ఉంటుంది. కాబట్టీ, కార్మికులు అత్యధికులు స్థానికులే ఉన్నా తెలుగేతర కార్మికులు కూడా ఇందులో పని చేస్తారు. వారినుంచి పనిచేసే చోట భాష ఎంపిక సమాచారాన్ని తెలుసుకునేందుకు ఒక ప్రశ్న పత్రాన్ని రూపొందించాం. కొత్తగూడెం సమీపంలోని బొగ్గు గనుల్లో పనిచేసే మొత్తం కార్మికులు 4,400 మంది కాగా వారిలో 10% మాదిరిగా సమాచారం సేకరించాం. ఈ సమాచారాన్ని ఒక శాస్త్రీయ పద్ధతిలో స్తరీకృత యాదృచ్ఛిక నమూనా (స్ట్రాటిఫైడ్ రాండమ్ స్యాంప్లింగ్) ద్వారా సేకరించాం. పనిస్థలంలో శ్రామికులు పై స్థాయి నుండి కింది స్థాయి వరకు సుమారు 20కి పైగా వివిధ వృత్తుల్లో పనిచేసేవారు ఉంటారు. ప్రతి వృత్తి నుండి 10 శాతం పనివారిని సమాచారానికి యాదృచ్ఛికంగా ఎంచుకున్నాం.

20 ప్రశ్నలు ఉన్న ప్రశ్నపత్రాన్ని తెలుగు కార్మికులకూ తెలుగేతర కార్మికులకూ వీలుగా ఉండేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు మూడు భాషల్లో తయారుచేశాం. చదవరాని కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడుతూ సమాచారాన్ని సేకరించాం. పనిస్థలంలో అమ్మనుడి వాడుకకు గల ప్రాముఖ్యతనూ, అవసరాలకు సంబంధించి వారు వెలిబుచ్చిన అభిప్రాయాలను కూడా పోగుచేశాం. మునుపు చర్చించిన పనికి సంబంధించిన శిక్షణా మాధ్యమాన్నీ, పుస్తకాలనూ, భద్రతా సూచనలనూ కూడా పరిగణలోకి తీసుకున్నాం. ఇలా పోగు చేసిన సమాచారాన్ని ఎస్. పి. ఎస్. ఎస్. (సామాజిక శాస్త్రాల గణాంక

విశ్లేషణ కూర్పు) ద్వారా విశ్లేషించాం.

**సమాచారం - విశ్లేషణ:**

**శ్రామికుల విభజన:** సింగరేణి బొగ్గు గనుల పరిశ్రమలో పని చేసేవారు ఎక్కువగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించినవారు. అయితే వీరిలో అత్యధికులు 90% తెలంగాణ రాష్ట్రంవారే. తీసుకోబడిన 400 మంది శ్రామికుల నమూనాలో పురుషులు 389 మంది ఉండగా కేవలం 11 మంది మాత్రమే స్త్రీలు ఉన్నారు. దీనికి కారణం బొగ్గు గనులలో చేసే పని పూర్తిగా శారీరకశ్రమ కావడం. నమూనాలో తీసుకోబడిన స్త్రీలు ఆ పరిశ్రమకు సంబంధించిన కార్యాలయంలో పనిచేసేవారు. ఈ పరిశ్రమలో సంక్షేమ, ఇంజనీరింగ్, సర్వే, ఉత్పత్తి, భద్రత వంటి విభాగాలుగా పని చేసేవారిని విభజించినప్పటికీ ఈ పరిశోధనలో పరిశ్రమలో పనిచేసేవారందరినీ వారి పని ఆధారంగా స్థూలంగా ఉన్నత స్థాయి, మధ్యమ స్థాయి, కింది స్థాయి శ్రామికులుగా విభజించాం.

**పట్టిక 1 : శ్రామికుల స్థాయి-భాషల వాడుక**

| క్ర. సం | వాడకంలో భాషలు | పనివారి స్థాయిలు % | | |
|---|---|---|---|---|
| | | ఉన్నత% | మద్య% | కింది% |
| 1. | తెలుగు | 69.7 | 76.70 | 80.70 |
| 2. | హిందీ | 1.00 | 0.80 | 0.50 |
| 3. | ఇంగ్లీషు | 2.50 | 0.30 | 0.80 |
| 4. | ఉర్దు | 0.30 | 0.30 | 0.30 |
| 5. | తెలుగు- ఇంగ్లీషు | 9.80 | 6.50 | 4.50 |
| 6. | తెలుగు-హిందీ | 9.80 | 10.80 | 10.50 |
| 7. | హిందీ-ఇంగ్లీషు | 0.50 | 0.30 | 0.30 |
| 8. | తెలుగు-హిందీ-ఇంగ్లీషు | 6.00 | 3.80 | 2.30 |
| 9. | తెలుగు-హిందీ-లంబాడి | 0.60 | 0.60 | 0.30 |
| మొత్తం | | 100 | 100 | 100 |

పట్టిక-1లో చూపిన విధంగా ఉన్నత స్థాయి ఉద్యోగస్తులు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. పరిశ్రమకు సంబంధించిన పనికి దిశానిర్దేశాలు చేయడం, విధివిధానాలను రూపొందించడం వీరి పని. మధ్యమ స్థాయి పనివారు ఉన్నత స్థాయి అధికారులు ఆదేశించిన పనులను రూపకల్పన చేయడానికి పని చేస్తారు. వారు




పటం-1: శ్రామికుల స్థాయి - భాషల వాడుక

కిందిస్థాయి శ్రామికులతో బొగ్గు గనుల్లో పని చేయిస్తూ పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. కింది స్థాయి ఉద్యోగులు వివిధ విభాగాలలో ప్రత్యక్షంగా బొగ్గు ఉత్పత్తికై గనుల్లో పని చేస్తారు.

పట్టిక-1లో చూపిన విధంగా ఉన్నత స్థాయి ఉద్యోగస్తులు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. పరిశ్రమకు సంబంధించిన పనికి దిశానిర్దేశాలు చేయడం, విధివిధానాలను రూపొందించడం వీరి పని. మధ్యమ స్థాయి పనివారు ఉన్నత స్థాయి అధికారులు ఆదేశించిన పనులను రూపకల్పన చేయడానికి పని చేస్తారు. వారు కిందిస్థాయి శ్రామికులతో బొగ్గు గనుల్లో పని చేయిస్తూ పర్యవేక్షణ అధికారులుగా ఉంటారు. కింది స్థాయి ఉద్యోగులు వివిధ విభాగాలలో ప్రత్యక్షంగా బొగ్గు ఉత్పత్తికై గనుల్లో పని చేస్తారు.

**భాషల వాడుక:** పైన పేర్కొన్న వివిధ స్థాయి శ్రామికుల మధ్య జరిగే చర్చా, సంభాషణలూ వాటికై ఎంపికచేసుకొని వాడే భాషా చర్చించదగిన అంశాలు. బొగ్గుగనుల్లో ఉత్పత్తికి సంబంధించిన పనులు ఎక్కువ మట్టుకు సూచనల మీదే ఆధారపడి ఉంటాయి. శ్రామికులు ఏ ఒక్క సూచన మరచినా, ఉత్పత్తిలో నష్టం వాటిల్లడమే కాకుండా శ్రామికుల ప్రాణం పోయే ప్రమాదం కూడా ఎంతో ఉంది. ఉదాహరణకు, బొగ్గుగనిలో పేలుడు పదార్థంతో బొగ్గును తీసేందుకు వాడే క్రమంలో ఆ గుంపులో పని చేసేవారందరూ వారికి సంబంధించిన పని మరియు భద్రతా సూచనలు అత్యవసరం. అందులో ఏఒక్కరు పనీ మరియు భద్రతా సూచనలు మరిచినా ఉత్పత్తి నష్టమూ ప్రాణ నష్టమూ జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి అటువంటి పనిచేసే సందర్భాలలో వారు వాడే మాట గానీ, శబ్దాలు గానీ, సైగలు గానీ, భాషల సూచనలు గానీ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. కాబట్టి పై అధికారులు క్రింది స్థాయి శ్రామికులతో చేసే భద్రతా సూచనలకు ఉపయోగించే భాష మాతృభాష అయి ఉంటుంది. ఎందుకంటే వారు సమాచార స్పష్టత ప్రతి కింది స్థాయి శ్రామికుడికి ఎటువంటి లోపం లేకుండా అందాలని ఆకాంక్షిస్తారు.

**ఉన్నత స్థాయి పనివారి భాష :** సింగరేణి బొగ్గు గని పరిశ్రమ తెలంగాణ రాష్ట్రం మరియు కేంద్ర ఆధీనంలో ఉంటుంది కాబట్టి ఉన్నత స్థాయి పనివారి మధ్య జరిగే సంభాషణలలో భాషా వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. కొన్నికొన్ని సందర్భాలలో కేంద్రం నుండి వచ్చే వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో అధికారులతో సంభాషించేటప్పుడు ఎక్కువగా ఇంగ్లీషును వాడుతారు. సమావేశాలలో ఇంగ్లీషు భాషనే ప్రాధాన్యంగా ఉపయోగిస్తారు. ఉత్పత్తికి సంబంధించిన అధికారిక ప్రకటనలూ, ఆ గనుల శాఖకు అందించే నివేదికలకూ, అంతర్జాలంలో ఉపయోగించే సమాచారానికి అంతటా ఇంగ్లీషు భాషనే వాడతారు. ఈ ఉన్నత స్థాయి ఉద్యోగస్తులు పరిశ్రమలోని స్థానికుల శాతంలో ఒక శాతం కంటే తక్కువగానే ఉన్నారు. వీరు తీసుకున్న నిర్ణయాలూ, ఉత్పత్తి ప్రతిపాదనలూ, సాంకేతిక సమాచారాలూ, సంక్షేమ సమాచారాలూ మొదలగునవి తమ కింది స్థాయి అధికారులతో అనగా మధ్యమ స్థాయి పనివారితో అమ్మనుడి

అయిన తెలుగులోనో, తెలుగేతరులతో ఇంగ్లీషులోనో లేదా హిందీలోనో చర్చిస్తారు.

మధ్యమ స్థాయి పనివారి భాష: పరిశ్రమకు సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో, పనుల రూపకల్పనలో, భద్రతా సూచనలు అందించడంలో, పనుల పర్యవేక్షణలో వీరు ఉపయోగించే భాష ఉత్పత్తికి ఎంతగానో సహకరిస్తుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంగ్లీషులో ఉన్నప్పటికీ వాటిని స్థానిక భాషలోకి అనువదించి క్రింది స్థాయి శ్రామిక వర్గాలకు అందే విధంగా చేయడం వీరు చేస్తున్న కృషి అని చెప్పొచ్చు. పనితోపాటు అమ్మనుడి ప్రాముఖ్యతకు వీరు ఎంతో విలువను ఇస్తారు కాబట్టి కింది స్థాయి ఉద్యోగస్తులతో పని గురించి చర్చించేటప్పుడు గుంపు సమావేశాలలోనూ వీరు అమ్మనుడి అయిన తెలుగుభాషలోనే పనిగురించిన సమాచారాన్నీ భద్రతా సూచనలనూ అందిస్తారు. క్రింది స్థాయివారితో పాటు ఉంటూ బొగ్గు గనుల్లో ఉత్పత్తి పనుల్లో సమయానికి తగిన సూచనలు ఇవ్వడం ఉత్పత్తిలో కీలక ప్రక్రియ. వీటిలో ఎటువంటి అవగాహనా లోపం జరిగినా ఉత్పత్తికీ కార్మికుల ప్రాణాలకీ నష్టమే. కావున సమాచారాన్ని అందించేటప్పుడు వారికి సహజ ప్రక్రియలో పని అర్థమయ్యే భాష అయిన అమ్మనుడిలోనే సూచనలు తెలుపుతారు. అమ్మనుడిని వాడడంతో ఉత్పత్తి పనులు సజావుగా సాగుతాయి. మధ్యమ స్థాయి ఉద్యోగస్తులు వారి సహోద్యోగులతో చర్చలో మాట్లాడేటప్పుడు కూడా అమ్మనుడినే ఉపయోగిస్తారు. చాలా తక్కువ సందర్భాలలో కేవలం తెలుగేతర వారితోనే ఇంగ్లీషులోనో లేదా హిందీలోనో సంభాషిస్తారు.

కింది స్థాయి పనివారి భాష: పరిశ్రమలో కిందిస్థాయి శ్రామికుల సంఖ్య అత్యధికం. పై స్థాయీ ఉన్నత స్థాయీ శ్రామికుల నుండి తీసుకునే పని సూచనలతో ఉత్పత్తిని ఒక రూపంలోకి తీసుకురావడానికి వీరి కృషి ప్రధానమైనది అని చెప్పవచ్చు. ఎక్కువ సంఖ్యలో ఉన్న ఈ శ్రామికులందరి మధ్య పనిచేసే సందర్భంలో సమన్వయం కుదరడం ఉత్పత్తికి ప్రధానమైనది. ఈ పని అక్కడి స్థానిక భాష అయిన తెలుగుద్వారానే జరుగుతుంది. ఉన్నత స్థాయి అధికారులు పని సూచనలు చేసేటప్పుడు వినే భాషా, శిక్షణ తరగతిలో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వీరు నేర్చుకునే భాషా మాధ్యమం పనిచేసే సందర్భంలో ఎప్పటికీ ఉపయోగపడుతూనే ఉంటాయి. వివిధ పనులకు వివిధ గుంపులుగా పనిచేసే సందర్భాలలో ప్రతి గుంపులో వారి సహోద్యోగులతో పని సంబంధిత సంభాషణలు ఆ పనిని పరిపూర్ణ స్థాయిలో విజయవంతం చేసేందుకు సహకరిస్తాయి. సహోద్యోగులతో మాట్లాడేటప్పుడు అక్కడివారు ఎక్కువమంది స్థానికులే కాబట్టి వారి స్థానిక భాష తెలుగులోనే సంభాషిస్తారు. ఏదైనా ఒక పని చేయడానికి దానికి సంబంధించిన విధాన రూపకల్పన అవసరమవుతాయి. వీటిని సంపూర్ణంగా అమలు చేసేందుకు వారు ఉపయోగించే భాష కీలకపాత్ర పోషిస్తుంది. సంభాషణలు ఎంతో సహజంగా అర్థవంతంగా ఉంటేనే ఉత్పత్తి కూడా వారు రూపొందించిన విధంగానే వస్తుంది. కాబట్టి పై స్థాయి ఉద్యోగస్తులు ఇచ్చిన సూచనలు క్రింది స్థాయి వరకు వినియోగించి, అనుకున్నంత ఉత్పత్తి జరగడం కేవలం స్థానిక భాష వాడుకతోనే సాధ్యపడుతోంది.

**పరిశ్రమలో అక్షరాస్యత మరియు భాషల వాడుక:**

భాష వాడుక పరిశ్రమలో పని చేస్తున్న శ్రామికుల అక్షరాస్యతతో కూడా ముడిపడి ఉంది. పరిశ్రమల్లో పనిచేసే వారందరి అక్షరాస్యతను ఆధారంగా నిరక్షరాస్యులు, ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, ఇంటరు లేదా డిప్లమో గ్రాడ్యుయేట్లు పోస్ట్ గ్రాడ్యుయేట్లుగా విభజించడం జరిగింది.

| వ్యవహారం | వాడుక భాషలు | నిరక్షరాస్యులు | విద్యార్హతలు | | | | భాషల వాడకం |
|---|---|---|---|---|---|---|---|
| | | | i - x | ix-xii | గ్రాడ్యు యేట్లు | పీ.జీ | |
| ఉన్నత స్థాయి పనివారితో | తెలుగు | 5.3% | 40.6% | 7.8% | 14.0% | 2.3% | 70.0% |
| | హిందీ | 0.3% | 0.8% | - | - | - | 1.0% |
| | ఇంగ్లీషు | - | 0.5% | 1.0% | 0.8% | 0.3% | 2.5% |
| | ఉర్దు | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-ఇ | - | 2.3% | 1.3% | 4.5% | 1.5% | 9.5% |
| | తె-హి | 0.5% | 6.5% | 1.8% | 0.8% | 0.3% | 9.8% |
| | హి-ఇ | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-హి-ఇ | - | 2.5% | 0.5% | 3.0% | - | 6.0% |
| | తె-హి-ల | - | 0.3% | - | - | - | 0.3% |
| సహ పనివారితో | తెలుగు | 5.6% | 42.1% | 9.5% | 16.8% | 3.0% | 77.0% |
| | హిందీ | - | 0.5% | - | 0.3% | - | 0.8% |
| | ఇంగ్లీషు | - | - | - | 0.3% | - | 0.3% |
| | ఉర్దు | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-ఇ | - | 2.3% | 1.0% | 2.0% | 1.0% | 6.2% |
| | తె-హి | 0.5% | 6.5% | 1.3% | 2.6% | 0.3% | 11.4% |
| | హి-ఇ | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-ల | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-హి-ల | - | 1.5% | 0.8% | 1.5% | - | 3.8% |
| | తె-హి-ల | - | 0.3% | - | - | - | 0.3% |
| కింది స్థాయి పనివారితో | తెలుగు | 5.5% | 44.1% | 10.0% | 17.5% | 3.5% | 80.7% |
| | హిందీ | - | 0.5% | - | - | - | 0.5% |
| | ఇంగ్లీషు | - | 0.3% | 0.3% | 0.3% | - | 0.9% |
| | ఉర్దు | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-ఇ | - | 0.3% | 1.3% | 1.8% | 0.5% | 4.5% |
| | తె-హి | 0.3% | 6.5% | 1.3% | 2.5% | - | 10.5% |
| | హి-ఇ | - | 0.3% | - | - | - | 0.3% |
| | తె-హి-ఇ | - | 0.3% | 0.3% | 1.3% | 0.3% | 2.0% |
| | తె-హి-ల | - | 0.6% | - | - | - | 0.6% |
| | మొత్తం | 6.0% | 53.9% | 12.5% | 23.3% | 4.3% | 100.0% |

తె=తెలుగు, హి=హిందీ, ఇ=ఇంగ్లీషు, ల=లంబాడీలు, పీ.జీ=పోస్టుగ్రాడ్యుయేట్లు

ఉన్నత స్థాయి పనివారిలో ఎక్కువమంది పోస్టుగ్రాడ్యుయేట్లూ, గ్రాడ్యుయేట్లూ. మధ్యమ స్థాయి పనివారిలో ఎక్కువమంది గ్రాడ్యుయేట్లు. కిందిస్థాయి పనివారిలో ఎక్కువగా నిరక్షరాస్యులూ, ప్రాథమిక, మాధ్యమిక విద్యను అభ్యసించినవారు, ఇంటరు లేదా డిప్లమో చేసినవారు, కొద్దిమంది మాత్రమే గ్రాడ్యుయేట్లు ఉన్నారు. నిరక్షరాస్యులు తోటి ఉద్యోగస్తులతో మాట్లాడేటప్పుడు వారి

మాతృభాష అయిన తెలుగు, ఉర్దూ, హిందీ, లంబాడి భాషలు మాట్లాడతారు. నిరక్షరాస్యులు ఒకే భాష తెలిసినవారు అమ్మనుడిలోనే వ్యవహరిస్తారు. సామాజిక వర్గాన్నిబట్టి కొందరు లంబాడితో పాటు తెలుగునూ, హిందీ లేదా ఉర్దూతోపాటు తెలుగునూ పరిశ్రమలలో ఉపయోగిస్తారు. మాధ్యమిక విద్య, ఇంటరు లేదా డిప్లమో అభ్యసించినవారు తెలుగులోనే సంభాషణలు జరుపుతారు. కేవలం కొన్ని సందర్భాలలో మాత్రమే వారి సామాజిక వర్గంవారు పరిశ్రమలో ఎదురైనప్పుడు లేదా తోటి సహచరులుగా పనిచేసేటప్పుడు లంబాడి హిందీ లేదా ఉర్దూ మాట్లాడతారు. తెలుగేతర సిబ్బందితో హిందీలో వ్యవహరిస్తారు. ఇది చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే జరుగుతుంది. మధ్యమ స్థాయి శ్రామికులలో కొందరు ఇంగ్లీషు మాధ్యమంలో చదివి ఇంగ్లీషులో మాట్లాడడం రాయడం కొంత వచ్చినవారేగానీ అతి తక్కువ సందర్భాలలో ఉన్నత స్థాయి ఉద్యోగస్తులతో మాట్లాడేటప్పుడు ఇంగ్లీషులో వ్యవహరిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారులు తెలుగువారైతే అనధికారిక చర్చలూ సంభాషణలలో తెలుగును ఉపయోగిస్తున్నారు. అధికారిక చర్చలూ సంభాషణలలో ఇంగ్లీషును వాడుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు తోటి ఉద్యోగులు తెలుగువారు అయితే అనధికారిక చర్చలలో సంభాషణలో తెలుగులోనే వ్యవహరిస్తారు. సామూహికంగా జరిగే చర్చాకార్యక్రమాలలో ఇంగ్లీషును ఉపయోగిస్తారు. ఈ ఉన్నత స్థాయి

| క్ర. సం | భాషల ఎంపిక | విజ్ఞప్తులు | సెలవు చీటీలు | మెయిల్స్ | ఆజ్ఞలు | సిఫార్సు లేఖలు | ఫిర్యా-దులు |
|---|---|---|---|---|---|---|---|
| 1. | తెలుగు | 70.4 | 45.6 | 31.6 | 42.4 | 46.4 | 49.1 |
| 2 | హిందీ | 0.3 | 0.5 | 0.8 | 0.5 | 0.8 | 0.3 |
| 3 | ఇంగ్లీషు | 10.3 | 33.6 | 51.6 | 33.8 | 31.1 | 27.8 |
| 4 | ఉర్దూ | 0.3 | 0.3 | 0.3 | 0.3 | 0.3 | 0.3 |
| 5 | తెలుగు-ఇంగ్లీషు | 11.5 | 13.8 | 10.0 | 15.5 | 11.5 | 15.5 |
| 6 | తెలుగు-హిందీ | 4.8 | 1.8 | 1.5 | 1.5 | 1.8 | 2.0 |
| 7 | తెలుగు-ఇతరాలు | 0.3 | 0.5 | 0.3 | 0.5 | 0.5 | 0.5 |
| 8 | హిందీ-ఇంగ్లీషు | 0.3 | 0.3 | 0.8 | 0.5 | 0.3 | 0.3 |
| 9 | ఇంగ్లీషు-ఇతరాలు | 1.8 | 0.8 | 0.3 | 0.3 | 0.3 | 1.0 |
| 10 | తె-హి-ఇ | 0.3 | 1.5 | 0.5 | 1.3 | 1.5 | 1.0 |
| 11 | ఇతరములు | | 0.3 | 2.5 | 1.0 | 1.0 | 97.7 |
| 12 | హి-ఇ-ము | | 1.3 | 0 | 0 | | |
| 13 | తప్పిపోయినవి | | | | 2.5 | 4.8 | 2.3 |
| | మొత్తం | 100 | 100 | 100 | 100 | 100 | 100 |

అధికారులు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినవారు. కాబట్టి అధికారిక సమాచారం ఇవ్వడం, స్వీకరించడం ఇంగ్లీషులోనే జరుపుతారు.

**పరిశ్రమలో రాతలో భాషల వాడుక:**

పరిశ్రమలలో ఉపయోగించే భద్రతా సూచనలు, శిక్షణా పాఠ్యాంశాలలో అధిక భాగం తెలుగులోనూ, స్వల్పంగా ఇంగ్లీషూ హిందీలో లిఖిత రూపంలో జరిగే వ్యవహారాన్ని కూడా పరిగణలోకి తీసుకోవడం జరిగింది.

మౌఖికంగా జరిగే సంభాషణలూ చర్చలలో ఉపయోగించే భాష ఉత్పత్తిలో ప్రత్యక్ష పాత్ర వహించినప్పటికీ, పరిశ్రమకూ కార్మికులకూ మధ్య జరిగే కొన్ని అధికారిక వ్యవహారాలు జరపడానికి రాతనే ఉపయోగిస్తారు. వీటిలో ఎక్కువగా సెలవు చీటీలు, ఫిర్యాదులు, ఆజ్ఞలూ విజ్ఞప్తులూ, సమీక్షా పత్రాలు, ఈమెయిళ్లూ, అధికారిక నోటీసుల ఉంటాయి. వీటిని కూడా భాషల వాడుక లెక్కలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాథమిక, మాధ్యమిక, ఇంటరు లేదా డిప్లమో విద్య చదివిన కిందిస్థాయి ఉద్యోగస్తులు తమ సెలవూ, విజ్ఞప్తి పత్రాలను తెలుగులోనే రాస్తారు. మధ్యమ స్థాయి ఉద్యోగస్తులు కొంత ఇంగ్లీషు భాష నేర్చుకోవడం మూలాన వారి సెలవు చీటీలూ, ఈమెయిళ్లూ, విజ్ఞప్తులూ, సమీక్షలూ, అధికారిక నోటీసులూ ఇంగ్లీషులో ఉంటాయి. ఉన్నత స్థాయి ఉద్యోగస్తులు సహోద్యోగులతో, మధ్యమ స్థాయి ఉద్యోగస్తులతో వ్యవహారాలు జరిపేందుకు వ్రాసే అధికారిక ఈమెయిళ్లూ ఉత్తరాలూ పని సంబంధిత పత్రాలూ సమీక్షా పత్రాలూ మొదలగునవి ఇంగ్లీష్‌లోనే ఉంటాయి.

రాతలో వాడే భాషల వాడుక అధికారిక వ్యవహారాల కోసం ఉపయోగించిన మౌఖికంగా ఉపయోగించే భాష ఉత్పత్తిలో ఎక్కువగా ఉపయోగంలో ఉంటుంది. పరిశ్రమలో కొందరు శ్రామికులు తెలుగేతరులు అయినప్పటికీ కొంతమంది తెలుగు నేర్చుకుని వాడడం జరుగుతోంది. వారి భాష ఎంపిక కూడా ఉత్పాదనకు వీలుగా ఉండాలని ఎంచుకుంటారు. కాబట్టి స్థానికులు పరిశ్రమలో ఉపయోగించే అమ్మనుడి వాడుక, తెలుగేతరుల దేశీయ భాషలూ ఇంగ్లీష్‌తో పోలిస్తే అత్యధికంగా వాడుకలో ఉన్నాయి. ఉత్పత్తిలో ఉపయోగించే దేశీయ భాషలు దేశ ఆర్థిక వ్యవస్థకే పట్టుగొమ్మలు.




పటం-2:

ఈ పరిశ్రమ నుండి దేశానికి వచ్చే స్థూల జాతీయ ఉత్పత్తిలో తెలుగు 83% పాలుపంచుకోగా తదితర దేశ భాషల తోడ్పాటు కేవలం 9% మాత్రమే. అంటే ఇంగ్లీషు ద్వారా సమకూడేది కేవలం 8 శాతం మాత్రమే. అంటే మన మాతృభాషల ద్వారా 92 శాతం సంపద సృష్టి జరుగుతోంది. ఇది ఒక ప్రత్యేక పరిశ్రమలో నమూనాగా నిర్వహించిన ఈ అధ్యయనం అమ్మనుడులే మన సంపద సృష్టికీ మన సమాజాభివృద్ధికీ మూల స్తంభాలుగా ఉన్నాయని మనం గ్రహించాలి.

ఈ వ్యాసరచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం.

పి. ప్రకాశ్
జి. ప్రవీణ్

# అమ్మనుడుల రక్షణకు ఒక కొత్త సిద్ధాంతం

**అ**మ్మనుడి మనుగడకు ఏది సహజమో, ఏది అసహజమో వాటి విలువలను సరిగా అర్థం చేసుకోవడంలో మానవ సమాజాలు ఎన్నోసార్లు తప్పటడుగులు వేయడం వాటిని సరిదిద్దుకోవడం జరుగుతూనేవుంది. అయితే కొన్ని తప్పటడుగులు సరిదిద్దుకోడానికి అందిరావు. తప్పు దిద్దుకొనేలోపే జరగరానిది జరిగిపోతోంది. మనకు ప్రకృతి నుంచి లభించే ఎన్నో సహజ వనరులలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి గాలీ, నీరూ, నింగీ, నేలా, చెట్టూచేమా మొదలైనవి. ఈ వనరులన్నీ మనం బ్రతకడానికి ఎంతో ముఖ్యమైనవి అని మనందరికి తెలిసినదే. గాలీ నీరూ లేకపోతే ఏ జీవరాశి కూడా ఈ నేల మీద మనుగడ సాగించలేదు. అవి నేల నుంచి మాయమైపోతే లేదా మొత్తానికే కలుషితమైతే, జీవరాసి మనుగడకే ప్రమాదం. ఇలాంటి సహజ వనరులు మనకు విరివిగా, ఉచితంగా లభిస్తాయి కావున మనం వాటిని విచ్చలవిడిగా వాడటంతోపాటుగా వాటిని కలుషితం చేసి వాటికి హాని కలిగిస్తున్నాం. అవి చిట్టచివరి దశకు చేరుకొనే వరకు మనకు వాటి విలువ అర్థం కాదు, తెలుసుకొనేందుకు ప్రయత్నించం కూడా.

మనిషికి గాలీ, నీరూ చెట్టూచేమా లాంటిదే అమ్మనుడి కూడా. ప్రస్తుతం మన అమ్మనుడి పరిస్థితి కూడా అలాగే ఉంది. భాష కూడా సహజ సంపదే. దానిని నేర్చుకొనేందుకు మనం దానికి ఎలాంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. ఒక తరగతి గదిలో లేదా ప్రత్యేక అవసరంకోసం నేర్చుకొనే భాష తప్ప, మనకు తెలియకుండానే మనం పెరుగుతున్న వాతావరణంలో ఉండే ఇంటిభాషను నేర్చుకుంటాం. భాష మన జీవితంలో ఎంతో ప్రధాన పాత్రను పోషిస్తోంది. సాధారణ పరిస్థితుల్లో తప్ప ఎవరూ కూడా మాతృభాష లేకుండా జీవితాన్ని ఊహించుకోలేరు. ప్రతి వ్యక్తికీ, ప్రతి సమాజానికీ సొంత భాష అంటూ ఒకటి సహజంగా ఉంటుంది. అది అమ్మనుడే అయివుంటుంది. కొన్ని **అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే అంటే అయినవాళ్లు లేనప్పుడో, కానివాళ్లు ఆక్రమించినప్పుడు బందీలుగా బతకవలసివచ్చినప్పుడో అమ్మనుడికి దూరమవుతాం. అప్పుడే ఆ సమాజం, అందులోని జీవచ్ఛవాలు మాత్రమే వాళ్ల అమ్మనుడిని వదులుకొని పరభాషపట్ల మోజు పెంచుకొంటారు.**

మానవ సమాజాలకు అమ్మనుడులు సహజవనరులలాంటివే. మనం దైనందిన అవసరాలకేకాకుండా, విషయాల పట్ల అవగాహనకూ, తెలియని విషయాలను తెలుసుకొనేందుకూ కొత్త విషయాలగురించి ఆలోచించుకొనేందుకూ ఒక భాష కావాలి. ఆ భాష అమ్మనుడి కావటం సహజం. కానీ మనం వాటిగురించి పట్టించుకోవడం మానేశాం. మన సహజ వనరులు అంతరిస్తున్నట్లే మన ప్రపంచంలోని ఎన్నో భాషలు ప్రమాదంలో పడుతున్నాయి. వీటి రెండింటి మధ్యగల పోలిక ఏమిటంటే, సహజ వనరులను మనం విచ్చలవిడిగా వాడటం వలన అవి మాయమైపోతుంటే, మనం మన మాతృభాషలను వాడకపోవడం వలన, వాటిని నిర్లక్ష్యం చేయడం వలన అవి అంతరించి పోతున్నాయి. ఈ రెండింటికీ మనమే కారణం. మనం వాడుకునే విధానాలే కారణం. ఏది ఎక్కడ ఎలా వాడుకోవాలో మనకు తెలిసినట్లు లేదు.

భాష, మానవ జీవన నిర్మాణంలోనూ ఇంకా సమ సమాజ నిర్మాణంలోనూ ఎంతో ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది. మన మాతృభాషలు వేలయేండ్ల తాతముత్తాతల వారసత్వంతోపాటు సహజంగా మనకు సంక్రమించినై. మనలో అత్యధిక శాతంమంది మన భాష మీద ఎంతగా ఆధారపడి ఉన్నారో ఎప్పుడూ కూడా అలోచించి ఉండరు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. అది ఏమిటంటే, మాతృభాషలే మన దేశ స్థూలజాతీయోత్పత్తిలో 85 శాతంపైగా ఆదాయాన్ని సమకూరుస్తున్నై (చూ. ఉమామహేశ్వరరావు, 2017: తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం). అందుకే మనం మన సొంత భాష అంటూ ఒకటి లేకుండా మన జీవనాన్ని సాగించగలమా అంటే అది అసాధ్యం అనే చెప్పాలి.

కానీ అదే భాష ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఈ ప్రపంచంలో కొన్ని చిన్న చిన్న జాతుల భాషలు దురాక్రమణలతో అంతరించి పోతుంటే ఉన్న మిగతా భాషలు ప్రపంచ భాషల పోటీకి తట్టుకోలేక కునారిల్లుతూ ఉంటే, మరికొన్ని తెలుగూ తదితర భాషలు ప్రభుత్వ నిర్లక్ష్యం వలన, సరైన ప్రణాళికలు లేక మన సమాజాల ఆదరణ లేక అవి సతమతమవుతున్నాయి. ఈరోజు కొన్ని భాషల పరిస్థితి ఎలా ఉందంటే, ముందు చూస్తే నుయ్యీ వెనక చూస్తే గొయ్యిలా ఉంది. ఎందుకంటే మాతృభాషలో చదువుకుంటే మాకు ఉద్యోగాలు వస్తాయా అని అడిగితే దానికి సమాధానం చెప్పలేకపోతున్నాం. ఒకవేళ మనకెందుకులే, పోనిలే అని అలా వదిలేస్తే వాటి మనుగడకే ప్రమాదం వచ్చే విధంగా కనిపిస్తోంది. కానీ ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం అనేది తప్పకుండా ఉంటుందనే నమ్మకం ఉన్నప్పుడు, ఆ సమస్య గురించి లోతుగా అధ్యయనం చేస్తే ఆ సమస్యను మనం పరిష్కరించగలం. ఇదే సూత్రాన్ని మన మాతృభాషకు కూడా వర్తింపజేయవచ్చు.

ప్రపంచీకరణతో ఎన్నో భాషలు ప్రమాదంలో పడ్డాయి. మనం వాటిని కాపాడుకోవడం మనకు ఒక పెద్ద సవాలు లాంటిదే. అలాంటప్పుడు మన పరిష్కార విధానాలూ ఆలోచనలూ కూడా శాస్త్రీయంగా ఉండాలి. అప్పుడే అ సమస్యకు సరైన సమాధానం లభిస్తుంది. కానీ, కేవలం మన భాష పైన ఉన్న ప్రేమతోనో, ఆవేశంతోనో, కోపంతోనో సరైన పరిష్కారాన్ని కనుగొనలేము. కానీ పరిష్కారంకోసం తప్పనిసరిగా శాస్త్రీయతతో, తార్కికతతో ఆలోచించితే తప్ప మనం మన మాతృభాష ఎదుర్కుంటున్న

సమస్యలను పరిష్కరించలేం. ఇదేమీ కొత్త కాదు. ఇంతకు ముందు కూడా మాతృభాష అభివృద్ధి కోసం ఎందరో మహానుభావులు కృషి చేశారు. అందరికీ తెలిసిన వ్యావహారిక భాషకోసం, కొందరికే తెలిసిన గ్రాంథిక భాషకు వ్యతిరేకంగా గిడుగు రామ్మూర్తి, గురజాడ, కందుకూరి వీరేశలింగం లాంటివారు ఎందరో మహానుభావులు కృషి చేసారు. ఇంకా వివిధ వ్యక్తులూ, భాషా సంఘాలూ మాతృభాష కోసం పోరాడుతూనే ఉన్నాయి. కానీ మొట్టమొదటి సారిగా మన మాతృభాషలు, అంటే తెలుగూ తదితర భాషలు మనదేశ ఆర్థిక–అభివృద్ధిలో ఎంత ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయో అదంతా గణాంకాల ఆధారంతో సహా ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు (2017) "తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం" అనే పుస్తకంలో వివరించారు. ఇది కేవలం తెలుగుకు మాత్రమేకాదు మిగిలిన అన్ని భారతీయ భాషలకూ వర్తిస్తుంది.

**మాతృభాషను ఎందుకు కాపాడుకోవాలి?**

ఒక భాష అంతరించి పోవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. అదే విధంగా, ఒక భాషను మనం ఎందుకు కాపాడుకోవాలి అనే దానికి కూడా అనేక ముఖ్యమైన కారణాలు చెప్పవచ్చు. దానికంటే ముందుగా మనం 'భాష' అంటే ఏమిటో తెలుసుకోవాలి. భాష అంటే కేవలం ఒక సమాచార మాధ్యమం మాత్రమే కాదు, **భాష అంటే ఒక సంస్కృతి, ఒక సమాజపు చరిత్ర, ఒక జీవన విధానం. ఇంకా ఆత్మగౌరవంతో పాటుగా ఒక మంచి సమాజాన్నీ, మరో సమాజంపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఎవరి కాళ్లపై వాళ్లు నిలబడగలిగేటట్లుగా సమాజాలను తయారుచేసే ఒక సాధనం.** ప్రపంచంలో ఉన్న ఎన్నో వేల భాషలలో ఇప్పటికే కొన్ని వందల భాషలు అంతరించిపోయాయి. ఇంకా మరికొన్ని భాషలు అతి వేగంగా ఇదే స్థితికి చేరుకుంటున్నాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే మన భాషలు కొన్ని వందల, వేల సంవత్సరాల నుంచి ఉన్నా, కేవలం అవి గత యాభై లేదా వంద సంవత్సరాలలో జరిగిన ప్రపంచీకరణ నేపథ్యంలో ఆనేక మార్పులవలన అవి విధ్వంసానికి గురవుతున్నాయి. ఈ జాబితాలో రేపు మన అమ్మనుడి, తెలుగు కూడా లేకుండా పోదేమో అనే సందేహం రాక మానదు. అందుకే మనం మన చేతులు కాలకముందే అప్రమత్తం కావాలి. లేకపోతే మనం ఒకసారి మన భాషను కోల్పోతే దానిని తిరిగి పొందడం అనేది సాధ్యం కాని పని.

నేడు మన మాతృభాషను కాపాడుకోవాలి అంటే మనం అనేక సవాళ్ళను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా ప్రపంచీకరణ అంటే ఆంగ్ల–ప్రపంచీకరణగా మారిన నేపథ్యంలో మాతృభాష గురించి మాట్లాడం అంటే ఒక కత్తి మీద సాము లాంటిదే అని చెప్పుకోవాలి. దీనికి కారణం, ఈ విషయంలో మనతో నడిచేవారితోపాటు ఈ విషయం పట్ల విముఖత ప్రదర్శించేవారినీ చూడవచ్చు. కానీ ఒక సిద్ధాంతం ప్రామాణికతను నిర్ణయించడంలో ఆ సిద్ధాంతాన్ని అనుసరించేవారు ఎందరు, వ్యతిరేకించేవారు ఎందరు అనేదాని కంటే అది మన సమాజానికి ఎంత ఉపయోగకరమో అనేదాన్ని గమనించాలి. మన చరిత్రను చూసుకుంటే అనేక సిద్ధాంతాలు మొదటగా వాటిని ప్రతిపాదించినప్పుడు అవి చాలా వరకు వ్యతిరేకించినవే. కానీ రాను రాను అవే అనివార్యమైన ప్రామాణిక సిద్ధాంతాలుగా స్వీకరించబడ్డాయి. అలాగే ఆచార్య ఉమామహేశ్వరరావు గారు ప్రతిపాదించిన "అమ్మనుడులే సమాజాల ఆర్థిక అభివృద్ధికి పెద్ద కొరముట్లు" అనే సిద్ధాంతం కూడా ఈ రోజు చాలా మందికి ఒక కొత్తగా అనిపించవచ్చు. కానీ మన దేశభాషలను రక్షించుకోవాలన్నా, వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నా ఈ సిద్ధాంతం ఉపయోగపడినట్టుగా మరి ఏ సిద్ధాంతమూ ఉపయోగపడకపోవచ్చు.

**మన దేశంలో ఆంగ్లంలో బోధనా వ్యాపకం:**

ప్రపంచ వ్యాప్తంగా, మానవ సమూహాలపై జరిపిన అనేక రాజకీయ, చారిత్రక దాడుల కారణంగా ఆంగ్లం ఒక అంతర్జాతీయ భాషగా ప్రపంచ పటంపై స్థానం సంపాదించుకుంది. ఆంగ్లానికి ఇది ఇలా సాధ్యమవడానికి, ఆంగ్లేయులు దాదాపుగా మూడు వందల సంవత్సరాలకు పైగా ప్రపంచాన్ని రాజకీయ దమన నీతితో జరిపిన విధ్వంసం నీడలో ఏలడం ద్వారానే సాధ్యం అయ్యింది అని చెప్పవచ్చు. ఎందుకంటే, ఆంగ్లేయులు ముఖ్యంగా రాజకీయంగా బలంగా ఉండటం వలన, వాళ్ల సంస్కృతినీ, భాషనూ ఇతర దేశాలకు బలవంతంగా అలవాటు చేశారు అని చెప్పవచ్చు. దీనితోపాటు ఇంకొక ముఖ్య కారణం ఇంగ్లీషు ఒక వాణిజ్య–వ్యాపార భాషగా పాత్రను పోషించడం వలన, అంటే వలసదేశాలలో అనేక బలవంతపు ఆర్థిక లావాదేవీలు జరపడం వలన, ఆంగ్లం ప్రపంచం అంతటా నాటుకు పోయింది. వీటితో పాటుగా వారు ఆంగ్ల భాషను వ్యాపింపచేయడానికి అనేక మార్గాలు అనుసరించారు.

**ప్రపంచీకరణలో భాషల ఆర్థిక సిద్ధాంతం ఆవశ్యకత:**

ఒక భాష వేరే భాషలపైన పెత్తనం చలాయించడం ప్రజాస్వామ్య దేశంలో ఎలా ఒప్పుకుంటాం. ఎందుకంటే, రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంకేతిక అభివృద్ధి ప్రక్రియలు ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంటాయి. అంత మాత్రం చేత ప్రజల భాషలను పక్కనపెట్టలేరు. అయితే, అంతర్జాతీయ పరంగానే కాకుండా, ఒకే దేశంలో కొన్ని భాషలు మాత్రమే ఏదో ఒక కారణంచేత ప్రత్యేక భాషలుగా గుర్తించబడుతున్నాయి. వాటివలన ఎన్నో చిన్న చిన్న భాషలు నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. ఇంకాస్త లోతుగా పరిశీలిస్తే, ఒక భాషకు చెందిన వేరువేరు ప్రాంతాల మాండలికాలపైన కూడా ఒక రకమైన చిన్న చూపు అనేది కనిపిస్తుంది. దీనికి అనేక కారణాలతోపాటు, ఇతరుల లేదా మన ధోరణి తమవి కాని వేరే భాషలపైన ఎలా ఉంటుందో అనే దానికి ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. ఇలాంటివాటివలన భాషల మధ్య వివక్షత కనిపిస్తుంది. ఇలాంటి అనేక కారణాల వలన, వేరే భాషలకు వ్యతిరేకంగానే కాకుండా వారి సొంత భాషకు కూడా వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు జరిగాయి. అందులో ముఖ్యమైనవి 'గ్రాంథిక భాష వద్దు వ్యవహారిక భాషే ముద్దు' అనే నినాదంతో గిడుగు వెంకట రామమూర్తి తీసుకువచ్చిన వ్యావహారిక భాషోద్యమం అని గట్టిగా చెప్పవచ్చు.

ఇంకా మనం ప్రపంచ వ్యాప్తంగా ఇల్లాంటి ఎన్నో భాషా ఉద్యమాల చరిత్రను చూసుకుంటే, అవి ఇతర భాషల పెత్తనానికి వ్యతిరేకంగా, అధికారిక భాషలకూ వ్యతిరేకంగానో, తమ మాతృభాషలను కూడా అధికారిక భాషలుగా గుర్తించాలని అనేక ఉద్యమాలు జరిగాయి. దీనికి మంచి ఉదాహరణే బెంగాలీ భాషా

ఉద్యమం అని చెప్పుకోవచ్చు. ఇంకా ప్రపంచ వ్యాప్తంగా ఇతర భాషా ఉద్యమాలను గురించి ప్రస్తావించుకుంటే, ఆఫ్రికన్ భాషా ఉద్యమం, దీనిని మొట్టమొదటి భాషా ఉద్యమంగా పిలుస్తారు. దీని ముఖ్య ఉద్దేశం ఏమిటంటే ఆఫ్రికన్ భాషలను ఉనికిలో తీసుకొని రావడం. రెండవది బెంగాలీ భాషా ఉద్యమం. ఈ ఉద్యమం అయితే ఏకంగా ఒక ప్రత్యేక దేశాన్ని ఏర్పడడానికి కారణం అయ్యింది. ఇలా చెప్పుకుంటూ పోతే, నేపాలీ భాషను విద్య, వైద్య, వ్యాపార ఇంకా ప్రభుత్వ రంగాల్లో అమలు కోసం జరిగిన నేపాలీ భాషా ఉద్యమం కావచ్చు, పంజాబీ భాషా ఉద్యమం కావచ్చు, ఇంకా నిన్న మొన్నటి వరకు జరిగిన తెలంగాణా ఉద్యమంలో తెలంగాణ భాష కూడా పోషించిన పాత్రను మనం నిర్లక్ష్యం చెయ్యలేము. ఇలా చెప్పుకుంటే పోతే అనేక ఉద్యమాలను మనం ఉదాహరణలుగా చెప్పవచ్చు.

మనం ఇప్పటి వరకు పైన పేర్కొన్న భాషా ఉద్యమాలను గమనించినట్లయితే, వాటి వాటి లక్ష్యాలు సమయానుగుణంగా సందర్భానుసారంగా వేర్వేరు అని చెప్పవచ్చు. కానీ మొట్టమొదటి సారిగా మన మాతృభాష (ఇది అన్ని భారతీయ భాషలకు వర్తిస్తుంది అని చెప్పాలి) దేశ ఆర్థిక వృద్ధిలో, లేదా దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో పోషిస్తున్న పాత్రను వివరించేది ఈ సిద్ధాంతమే. అదే భాషల ఆర్థిక సిద్ధాంతం.

ఈ భాషల ఆర్థిక సిద్ధాంతాన్ని ఒక కొత్త సిద్ధాంతం అనడానికి గల కారణాలను గమనించితే, మాకు అవగాహన ఉన్నంత వరకూ లేదా మాకు తెలిసినంత వరకు ఇప్పటివరకు నిర్వహించిన అనేక ఉద్యమాలు ఒక ఎత్తు అయితే, భాషల ఆర్థిక సిద్ధాంతం మరొఒక ఎత్తు అని దృఢంగా చెప్పగలం. అలా ఇంతకు ముందు జరిగిన ఉద్యమాలను గానీ ప్రత్యేకించి ఇప్పటి వరకు మాతృభాష రక్షణ కోసం వచ్చిన సిద్ధాంతాలను మేము ఇక్కడ ఏదో విధంగా తక్కువ చేసి చూపిస్తున్నాం అని కాదు. సమయానుగుణంగా సందర్భానుసారంగా వాటి వాటి ప్రాముఖ్యతను అవి కలిగిఉంటాయి. కానీ ఈ భాషల ఆర్థిక సిద్ధాంతం అనేది ఒక మాతృభాష రక్షణకు ఒక కొత్త మార్గాన్ని చూపిస్తుంది అని చెప్పగలం. ఎందుకంటే, మన ప్రభుత్వాల నిర్వాకంతో తెలుగు భాష (ఇది అన్ని భాషలకు వర్తిస్తుంది) అంతరించిపోయే దశకు చేరుతోంది కాబట్టి దీనిని ఎట్టి పరిస్థితులలోనైనా ఏది ఏమైనా మన అమ్మనుడిని కాపాడుకోవాలి అనే ధోరణిలో ఏదో ఆవేశంతో వాదించే సిద్ధాంతం కాదు ఇది. ఇతర భాషల పెత్తనం పెరుగుతుంది కాబట్టి దాన్ని ఆపాలి అని ఉద్దేశంతో వాదించడం లేదు. మన మాతృభాష చుట్టూ ఒక రాజకీయం, ప్రాంతీయ వలయాన్ని ఏర్పాటు చేయడానికో ప్రయత్నించడం లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఇది మాతృభాష చుట్టూ ప్రాంతీయ వాదాన్ని గానీ మతాన్ని గానీ జోడించామని చెప్పడం లేదు. కానీ మొట్టమొదట సారిగా భారతీయ నేలపై మన మాతృభాష మన దేశ మరియు రాష్ట్రాల ఆర్థిక అభివృద్ధిలో పోషిస్తున్న పాత్రను ఒక శాస్త్రీయ పద్ధతిలో గణాంకాలతోపాటు నిరూపిస్తుంది.

చరిత్రను ఒక సారి తిరిగేసి చూస్తే, అమ్మనుడి చుట్టూ జరుగుతున్న అనేక రాజకీయాలను మనం చూడవచ్చు. కానీ అటువంటి ఉద్యమాలు గానీ, అలాంటి రాజకీయాలు గాని ఎక్కువ రోజులు నిలవవు అని చెప్పవచ్చు. ఎందుకంటే, నేటి ప్రపంచీకరణ యుగంలో శాస్త్ర సాంకేతిక కాలంలో అలాంటి సిద్ధాంతాలు గానీ, అలాంటి ఉద్యమాలకుగానీ ఎలాంటి తావు ఉండదని చెప్పవచ్చు. అందుకే, మన మాతృభాష ఆవశ్యకతను కాని, మన విద్యా మాధ్యమం మాతృభాషలోనే ఎందుకు ఉండాలి అనీ, కేవలం మాతృభాష పైన ప్రేమతోనో లేదా ఆవేశంతోనో కాకుండా ఒక శాస్త్రీయ పద్ధతిలో మన మాతృభాష మన జాతీయ అర్థిక నిర్మాణంలో పాలు పంచుకుంటున్న విధానాన్న%జీ%, ఒక శాస్త్రీయ కోణంలో విశ్లేషించడమే ఈ భాషల ఆర్థిక సిద్ధాంతం ముఖ్య ఉద్దేశ్యం.

**ముగింపు:**

భాష కేవలం ఒక సమాచార మధ్యమంగా మాత్రమే కాకుండా అది ఒక మౌలిక, సాంస్కృతిక, సామాజిక అంశాలతో పాటుగా ఒక ఆర్థిక ఉత్పాదనకు దోహదపడే సాధనం కూడా అని మనం గుర్తుపెట్టుకోవాలి. కానీ కేవలం మన భాషపై ఉన్న అభిమానంతోనో ఆదరణవలనో లేక వేరే భాషపై ఉన్న ద్వేషం వలనో మనం మన అమ్మనుడే గొప్పది అని చెప్పినంత మాత్రాన ఈ సాంకేతిక యుగంలో తట్టుకొని నిలబడగలమని అని చెప్పలేము. కానీ మనం అమ్మనుడి గురించి లేనిది ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా చెప్పినంత మాత్రాన కూడా మన అమ్మనుడికి ఒరిగేది ఏమి ఉండదు. ఎందుకంటే భాష అనేది ఒక సంక్లిష్ట విషయమే కాకుండా అది ఇప్పుడు ఒక సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది కాబట్టి, మనం ఈ ప్రపంచీకరణలో మన మాతృభాషను నిలబెట్టుకోవాలన్న కోరికతో మన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక నిర్మాణంలో పోషిస్తున్న పాత్రను అర్థంచేసుకోవాలనుకుంటే మనకు ఒక శాస్త్రీయ అధ్యయనం ఎంతో అవసరం. ఇలాంటి సిద్ధాంతమే భాషల ఆర్థిక సిద్ధాంతం, ఎందుకంటే మొట్టమొదటి సారిగా మన అమ్మనుడి మన దేశ ఆర్థిక ఉత్పత్తిలో ఎంత ముఖ్యమైన పాత్రను పోషిస్తుందో ఒక శాస్త్రీయమైన పద్ధతిలో గణాంకాలతో సహా నిరూపించిన అధ్యయనం అని చెప్పగలం. ఈ అధ్యయనం ద్వారా మనం తెలుసుకున్న సత్యం ఏమిటంటే మన అమ్మనుడులే మన దేశ స్థూలజాతీయోత్పత్తిలో 85 శాతంపైగా ఆదాయాన్ని సమకూరుస్తున్నాయని నిరూపించటం. ఇలాంటి శాస్త్రీయమైన, హేతుబద్ధమైన, తార్కిక, పరిశోధనాత్మక ఆర్థిక భాషా సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని తెలుగు రాష్ట్రాల్లో భాషాప్రణాళికలను రూపొందించాలి. ఇది కేవలం ఒక తెలుగుకు మాత్రమే సంబంధించినది కాదు, మరింత అధ్యయనం చేస్తే ఇది అన్ని భారతీయ భాషలకూ వర్తిస్తుంది అని చెప్పగలం. ఇలాంటి అధ్యయనాలను ఆధారంగా చేసుకొని రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా అమ్మభాషలో బోధన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం. జాతీయ నూతన విద్యా విధానం-2020 కూడా ఇదే విషయాన్ని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కూడా మనమంతా స్వాగతిద్దాం.

ఈ వ్యాసరచయితలు
పి. ప్రకాశ్ హైదరాబాదు విశ్వవిద్యాలయం
జి. ప్రవీణ్ కాశీహిందూ విశ్వవిద్యాలయం

డా॥ కాళిదాసు పురుషోత్తం
9000642079

# సంచారులు, రాజులు, వ్యాపారులు: నుడుల వెలుగులో భారత్ కథ – పెగ్గీ మోహన్

## WANDERERS, KINGS, MERCHANTS The Story of India through its Languages - Peggy Mohan

**ఆచార్య** శ్రీమతి పెగ్గీ మోహన్ కెనడాలో జన్మించి, మిచిగాన్ విశ్వవిద్యాలయంలో లింగ్విస్టిక్సులో పిహెచ్‌డి చేసి, భారతదేశంలోని అనేక విశ్వవిద్యాలయాల్లో లింగ్విస్టిక్స్, మాస్ కమ్యూనికేషన్ బోధించారు. ఆమె లింగ్విస్టిక్సు శాస్త్రాన్ని అన్వయించి భారతదేశ భాషల స్థితిగతుల మీద 'వాండరర్స్, కింగ్స్, మర్చంట్స్- ది స్టోరీ ఆఫ్ ఇండియా త్రూ ఇట్స్ లాంగ్వేజెస్' ఆసక్తికరమైన గ్రంథాన్ని రచించారు. ఇంగ్లీషు భాష దురాక్రమణలో త్వరలోనే అనేక భారతీయ భాషలు కనుమరుగయ్యే ప్రమాదం వుందని ఆమె ఈ గ్రంథంలో నిరూపించారు.






చరిత్ర, సమాజశాస్త్రం, లింగ్విస్టిక్సు కలగలిపిన Historical social linguistics దృష్టికోణం నుంచి పెగ్గీ మోహన్ భారతదేశ చరిత్ర, వేదకాలంనాటి సంస్కృత భాషపై ద్రావిడ భాషల ఉచ్చారణ ధ్వనుల ప్రభావం, పార్సీ, ఉర్దూభాషల ఉత్థాన పతనాలు వంటి అంశాలను విశ్లేషించారు.

మానవుల వలసలు భాషల మీద ప్రభావం చూపుతాయని, ఆహారాన్వేషణలో ఒక సమూహం మరొక భాష వాడుకలో ఉన్న జనసమూహాల ప్రాంతాలకు వెళ్లినపుడు, వలస వెళ్లినవారి భాషలో, వలసవెళ్లి స్థిరపడిన ప్రదేశాల్లో వాడుకలో ఉన్న భాషల్లో కలిగే మార్పులను రచయిత్రి ఈ పుస్తకంలో విశ్లేషించారు. భాషల సంకరం వలసలతో మొదలవుతుందంటారు ఆమె. కొత్త వాళ్లతో వివాహబంధాలు నెలకొల్పుకోడం వల్ల కలిగిన సంతానం భాషల్లో ఇరు వైపుల భాషల్లో మార్పులు కలుగుతాయి. మన భాషలు అంతకు ముందు వ్యవహారంలో ఉండి నిశించిపోయిన భాషల ఆనవాళ్లు, మెల్లమెల్లగా ఆదనంగా తెచ్చుకున్న పదాలు ఒక భాషలో కరిగిపోయి కలిసిపోతాయి. చిన్న చిన్న సమూహాలు కొత్త భాష వ్యవహారంలో ఉన్న ప్రాంతానికి వెళ్లినపుడు తమ భాషలో మాట్లాడడం మాని, కొత్త భాషను అలవాటు చేసుకొంటారు. ఈ విధమైన మార్పులు భాషల్లో నిరంతరం జరుగుతూనే ఉంటాయి.

చరిత్ర పూర్వ యుగంలో ఆస్ట్రోయేషియాటిక్, ముండా వంటి భాషలు వాయువ్య ఆసియాలోని మానవ సమూహాల్లో వాడుకలో ఉండివుండవచ్చు. క్రీ.పూ 1700 సంవత్సరాల ప్రాంతంలో రుగ్వేదార్యులు వాయువ్య ఆసియా ప్రాంతాల నుంచి అలలు అలలుగా భారత దేశంలోకి ప్రవేశించి ఉంటారు. మానవ వలసలలో–: ఏజాతివారైనా అధికంగా పురుషులే ఉంటారని చరిత్ర అంగీకరించిన సత్యం. అట్లా ప్రవేశించినవారు స్థానిక స్త్రీలతో సహజీవనం చేసి వంశాభివృద్ధి చేసుకొంటారు. ఆర్యులది పితృస్వామ్య వ్యవస్థ. భర్తలు ఆర్యులు, భార్యలు స్థానికులు, వారి సంతానం ముందు తల్లిభాషను, తర్వాత తండ్రి భాష సంస్కృతాన్ని అభ్యసించి ఉంటారు. ఈ సంతతి ద్విభాషా వ్యవహర్తలైనందున diglossia కు దారితీసివుంటుంది. ఈ పరిస్థితుల్లో శిశువులు మొదట ఇంటివద్ద ఒక భాష మాట్లాడడం నేర్చుకొని తర్వాత, వ్యవహారంలో ఉన్న మరొక భాషను నేర్చుకొని వుంటారు. evolutionary Biology కూడా దీన్నే సమర్థిస్తోంది. కాంస్య యుగంలో మధ్య ఆసియా నుంచి ఈ దేశంలోకి వలస వచ్చిన అధిక సంఖ్యాకులు పురుషులని అత్యాధునిక జన్యుశాస్త్ర పరిశోధనలు నిరూపించాయి కూడా!

క్రీ.పూ, 4700–3000 సంవత్సరాల మధ్య కాలంలో ఇరాన్‌దేశపు మధ్య భాగం నుంచి వ్యవసాయంచేసుకొని జీవించే సమూహాలు సింధులోయలో ప్రవేశించి, అక్కడ వేటాడుతూ, ఆహార సేకరణ దశలో ఉన్న స్థానికులతో కలిసిపోయి వుంటారని, వీరే హరప్ప సంస్కృతి విలసిల్లిన ప్రదేశాల చుట్టుపట్ల నివసించిన ప్రజలని, మనం ద్రావిడులని వ్యవహరిస్తున్న ప్రజలు వీరేకావచ్చని, తర్వాత వీరు ఆర్యులతో సంబంధాలు నెరపివుంటారని పెగ్గీమోహన్ భావించారు.

వైదిక ప్రజలు (Vedic People) స్థానిక భాషలు నేర్చుకొని ద్విభాషా వ్యవహర్తలుగా మారివుండరు. స్థానికులే వైదిక ప్రజల సంస్కృతం నేర్చుకొని ద్విభాషావ్యవహర్తలుగా మారి వుంటారు. ఆచార్య ఎమినోది కూడా ఇదే అభిప్రాయం. వీరి ఉచ్చారణద్వారానే సంస్కృత భాషలోకి రిట్రోఫ్లెక్షన్ ప్రవేశించి వుంటుందని ఎమినో అంటారు.

క్రమంగా రాజాస్థానాల్లో సంస్కృతం, పాకృతం, కింది వర్ణాల ప్రజలు లిపిలేని తమ తమ మాండలికాలలో వ్యవహరించి ఉంటారు. ఆరంభంలో మాండలికాలుగా ఉన్న హిందీ, మరాఠి క్రమంగా వివిధ భాషలు మాట్లాడేవారి మధ్య భావవినిమయ సాధనాలుగా

ఎదిగాయి. వీటిని లింగ్విస్టులు కియ్నా(koine) అని వ్యవహరిస్తారు. కియ్నా ఏదో కృత్రిమంగా ఏర్పడిందికాదు. ప్రతి క్రోసు దూరానికి మన దేశంలో ఒక మాండలిక భాష వాడుకలో ఉంటుందనేది పాతకాలం నాటిమాట. ఇప్పుడు అమృతసరి, పంజాబి, పాటియాలా యాసలన్నీ మాసిపోయి, పత్రికలు, ఇతర మీడియా వాడుకలోకి తెచ్చిన ఒకరకం మూస యాస, భాష క్రమంగా బలపడుతోంది.

ఆరంభంలో హిందీ ఒక కియ్నా భాష. వ్రజ, అవధి హిందీ కన్న ముందు నుంచి వున్నది. ఆ భాషల్లో ముఖ్యమైన సాహిత్యంవుంది. బ్రిటిష్ పాలనలో హిందీ సాహిత్య భాషగా ఎదిగి, ఆ ప్రాంతాల్లో వుండే మాండలిక భాషలన్నీ, హిందీకి విధేయతను ప్రకటించాయి. హిందీ పాఠశాలల్లో బోధన భాషగా, సాహిత్య సృజన భాషగా పరివర్తనం చెందగా, దానికన్న ప్రాచీన భాషలు స్థానిక భాషలుగా మారి హిందీ యొక్క మాండలికాలుగా పరిగణించబడుతున్నాయి.

యూరప్‌లోనూ ఇదేకథ. రోమన్ సామ్రాజ్య కాలంలో ఆ తర్వాతగూడా, చాలాకాలం విద్యావంతులు, మతబోధకులు లాటిన్‌లో వ్యవహారాలు కొనసాగించేవారు. సామాన్య ప్రజలు ఆయా ప్రాంతీయ మాండలికాల్లో మాట్లాడేవారు. ఇటాలియన్, స్పానిష్, పోర్చుగీసు, కేటలాన్, ఫ్రెంచి, రుమేనియా భాషలను రొమాన్సు(Romance) భాషలని వ్యవహరించేవారు. ఇండోయూరోపియన్ భాషల చరిత్రే ఇక్కడా కొనసాగింది. స్థానికులు రోమన్ సైనికులతో వ్యవహారాలు నిర్వహించ వలసివచ్చినపుడు, రకరకాల మాండలికాలు ఉద్భవించాయి, పరస్పరం చాలా తేడాలతో దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు, రాజాస్థానాల్లో స్థానం సంపాదించుకోవాలని ఆశించేవాళ్లు, పైవర్గాల ప్రజలు మాత్రం లాటిన్‌లో వ్యవహరించేవాళ్ళు. 10-12 శతాబ్దాల తర్వాత లాటిన్ భాష ప్రాభవం క్రమంగా క్షీణించి ఆధునిక యూరోపియన్ భాషల్లో వ్యవహరించడం, రాతకోతలు జరపడం వాడుకలోకి వచ్చింది. ఈ కథ భారతదేశానికి అవసరమైనదే!

**సంస్కృతంలో ఉన్న మహాప్రాణాలు భారత ఉపఖండానికి వాయువ్యంగా వున్న దేశాల్లో వాడుకలో వున్న ఇండోయూరోపియన్ భాషల్లో కనిపించవు Aspiration (kh, gh, ch, jh, Th, Dh,) ఖ,ఘ,ఛ,ఝ,ఠ,ఢ లు ఆ భాషావ్యవహర్తల ఉచ్చారణలో లేవు. భారత ఉపఖండం వెలుపల Aspirated sounds వాడుక గమనించం. ఆ ధ్వనులున్న పదాలు ఏ ద్రావిడ భాషలోనూ లేవు, సంస్కృతం నుండి స్వీకరించిన లోన్‌వర్డ్స్‌లో తప్ప.**

స్థానిక భాషలు వలస వెళ్లే ప్రజాసమూహాల వెంట వెళతాయి, అది విస్తరించే క్రమంలో మార్పులకు లోనవుతాయి. మొదట్లో సంస్కృత భాషలో మహాప్రాణాలు లేవని అందరూ అంగీకరిస్తారు. మనదేశంలో వ్యవహారంలోవున్న ప్రతీభాషలో, మహాప్రాణాలున్నాయి. అస్సామి భాష (మగధ భాషా కుటుంబంలోది) లేవు.

ఇప్పుడు మనకు పరిచయమై విస్తృతంగా వాడుకలో ఉన్నట్లు కాకుండా, హిందీ, మరాఠీ, ఇతర ఇండో ఆర్యన్ భాషలు చిన్న చిన్న మాండలిక భాషలు ప్రాకృత భాషల్లోంచి పదజాలాన్ని సమకూర్చుకొంటూ ఏర్పడ్డాయి. అందువల్లే ఈ భాషల్లోని ప్రాచీన వ్యాకరణాంశాలు కాపాడబడివుండడం జరిగింది. స్థానిక భాషల్లో చేరిపోయిన ఇటువంటి పదాలను తొలగించి వాటి స్థానంలో నూతన పదాలను ప్రవేశపెట్టే క్రమాన్నే రచయిత్రి ఆచార్య పెగ్గీమోహన్ 'సంస్కృతీరకణ' అన్నారు. ఆహారాన్వేషణలో (food chain) జనం కదిలిపోతున్నపుడు పాత పదాల స్థానంలో కొత్త పదాలను వాడుక చేస్తారు. ఇండో ఆర్యన్ భాషల్లో కేవలం నామవాచక పదాలేకాక, అన్ని రకాల పదాల స్థానంలో కొత్త పదాలు వచ్చాయి. ఈ మహామథనంలో ఆయా భాషల వ్యాకరణాలు మాత్రం స్థానభ్రంశం చెందలేదు.

**క్రియోల్ భాషలు**

సామాన్య ప్రజలు తమ మాండలికాలను తమతమ యాసలలో మాట్లాడుతారు. ఒక భాషావాడుకదారుల పరభాషాపదాలను వాడుక చెయ్యడం మొదలుపెట్టినపుడు, అదీ అధికార భాషలో పదాలను వాడుక చేయడం మొదలు పెట్టినపుడు, ఏర్పడే సమూలమైన మార్పును, రేడికల్ మిక్చర్‌ను క్రియోల్ భాషంటారు. ఇది ఒక కలగాపులగం, ఒక పదాల, సమ్మేళనం- ఈ ప్రక్రియలో ముందు వ్యవహారంలో ఉన్న పదాల ఆ పదాల ముగింపులోని ధ్వనుల స్థానంలో కొత్త భాషాపదాలు చేర్చి వ్యవహరించే భాషను క్రియోల్‌భాషని చెప్పొచ్చు. ఇండో యూరోపియన్ భాషల్లో ఈ విధమైన మార్పులు ఎప్పుడు సంబంధించినవో నిక్కచ్చిగా చెప్పలేదు. సామాన్య ప్రజల్లో కొందరు పైవర్గాలలోకి ఎగబాకుతున్న సందర్భాల్లో ఈ మార్పులు సంభవించివుంటాయి. పిజిన్ పదాలు- అంటే ఉచ్చారణలో పూర్తిగా గుర్తించలేనంత మార్పుచెందిన పదాలు క్రియోల్ భాషలో తప్పనిసరిగా భాగంకాకపోవచ్చు.

సూయజ్ కాలువ తవ్వడం పూర్తయిన తర్వాత, బ్రిటీష్ వనితలు వరులను (భర్తలను) అన్వేషిస్తూ నౌకమీద తండోప తండాలుగా భారతదేశానికి రాబట్టి సరిపోయింది గాని, లేకపోతే ఇంగ్లీషువాళ్లు స్థానికులను పెళ్లాడక తప్పేది కాదని, దాంతో కొత్త కొత్త క్రియోల్ భాషలు వాడుకలోకి వచ్చివుండేవని రచయిత్రి పెగ్గీమోహన్ అంటారు. 'స్వచ్ఛమైనజాతి' భావన వర్ణవివక్షను పాటించేందుకు పెట్టుకున్న నియమమంటారు. అందుకోసం కనిపెట్టబడినదీ సిద్ధాంతం అని కూడా పరిహాసంగా అంటారు!

"బాగా వృద్ధికి వచ్చి పరిణతులైన మనవంటివారం స్వచ్ఛమైన భాషలో మాట్లాడుతున్నామా అని" అని రచయిత్రి ప్రశ్నవేసుకొని సమాధానం చెప్పారు. పరిణామ సిద్ధాంతాన్ని విశ్వసించేట్లయితే, మనం దేన్నయినా స్వీకరించగలగాలి. భాషలు జడపదార్థాలు కావు, అవి జీవద్భాషలు. భాషలు వివిధ వాతావరణాల్లో, విధానాల్లో సజీవంగా ఉంటాయి. పరిసరాల్లో వచ్చే మార్పులకు భాషలు తీవ్రంగా స్పందిస్తాయి. భాషలు సజీవంగా వుండడానికి వాటి మనుగడకు పోరాటం సాగుతూనే ఉంటుంది. పరిసరభాషల్లో, కొత్తగా వచ్చే ప్రమాదాలతో అవి పోరాడుతూనే ఉంటాయి. కొత్త పరిస్థితులకు అనుగుణంగా మార్పుచెందని, బహిరంగంగా వ్యవహారంలో లేకుండా చీకటి మరుగున వుండే భాషలు నశించిపోవచ్చు. ఒక

భాషావ్యవహర్తలు తమ నిత్య వ్యవహారానికి వేరొక భాషను ఎంచుకొంటే కొత్తగా ప్రవేశించిన భాషలు వీటి స్థానాన్ని ఆక్రమిస్తాయి.

టర్కిభాష ఇండోయూరోపియన్ భాషాకుటుంబానికి చెందినదికాదు, అది అల్టాయిక్ కుటుంబానికి చెందినది. ఆశ్వికులు మధ్య ఆసియా నుంచి మనదేశానికి వచ్చినపుడు ఉర్దూభాషలో టర్కిభాషాపదాలు చేరాయి. పార్సి పదాలు ఇస్తాంబుల్ నగరవాసుల భాషలోకి ఎట్లా వెళ్లాయి? ఇరాన్ దేశ సాంస్కృతిక ప్రభావాలు మనదేశం మీదనే కాక, టర్కి, మధ్య ఆసియా దేశాల మీద కూడా ఉన్నాయి. ఇరాన్ ఆదేశాలపై దండయాత్రలేమీ చేయలేదు. రంజాన్, నమాజ్ వంటి పార్సిపదాలు ఆదేశ భాషల్లో చేరిపోయాయి. 'ordu' ఇది టర్కిభాషా పదమట! అంటే సైన్యమని అర్థమట! కమాల్‌పాషా పరిపాలనలో అనేక భాషల్లోంచి టర్కి భాషలోకి పదాలకు తెచ్చుకొన్నారట. ఉర్దు అన్న మాటను భాషాపరంగా మొట్టమొదట ఢిల్లీ కి చెందిన కవి క్రీ.శ 1780లో వాడుక చేశాడు. ఢిల్లీ సుల్తానుల ద్వారా మన దేశంలోకి టర్కి భాషా సంస్కృతులు ప్రవేశించాయి. బాబరు మాతృభాష ఉజ్బెక్. ఇన్ని విషయాలు చెప్పిన పెగ్గిమోహన్ హిందీమాత్రం భారతీయ భాషే అని నొక్కి వివరించారు.

Predator Pray సిద్ధాంతం సోషియో లింగ్విస్టిక్ శాస్త్రానికి చెందినది. సాధికారికత సాధించిన శక్తివంతమైన భాషలు మరొక భాష వాడుకలో ఉన్న ప్రాంతాలలో ప్రవేశించే విధానాన్ని, ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఈ పద్ధతిలో హిందీ భాషలోకి ఇంగ్లీషు జొరబడి 'హింగ్లీషు' అయిందని రచయిత్రి వ్యాఖ్యానించారు.

ఒక భాష వాడుకలోంచి తొలగిపోయిన సందర్భాన్ని రచయిత్రి ఒక దృశ్యంతో పోల్చి చెప్పారు. తిరునాళ్లు ముగిసిన తర్వాత, నిర్మానుష్యంగా ఉన్న అంగళ్లు, నిశ్చలంగా ఉన్న రంగులరాట్నాల మధ్య అంతా శూన్యంగా అనిపిస్తుంది కదా! ఇప్పుడు మన దేశంలో ఇంగ్లీషు భాషను తలచుకొంటే– పైపర్ వాయిద్యగాడు వాయించుకొంటూ సాగుతుంటే పిల్లలందరూ అతని వెనకపడి పరుగులు తీస్తున్న దృశ్యాన్ని గుర్తు చేస్తారు!

**ఇంగ్లీషు కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోంది**

**ఉర్దూ మాతృభాష అయిన చిన్నారులు కొంచెం కొంచెం ఉర్దూలో మాట్లాడినా ఉర్దూ చదవలేరు, రాయలేరు. పాపం, వాళ్లకు ఇంగ్లీషూ అంతే! భవిష్యత్తులో హిందీ కథకూడా ఇట్లాగే ఉండబోతుంది. ప్రస్తుతానికి హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో ఆ భాష పరిస్థితి పర్వా లేదు. హిందీకి కూడా సమయం కొంచమే మిగిలివుంది.**

ఇండియన్ ఇంగ్లీషు దురాక్రమణ చేసే తెగకు చెందినది. అందుకే గాంధీజీ ఇంగ్లీషు మాధ్యమాన్ని వ్యతిరేకించారు. డిగ్లోషియా అంటే భాష మెల్లమెల్లగా మరణించడం. అతి సమీప భవిష్యత్తులో ఈ భూగోళంలో అత్యధిక సంఖ్యాకులు ఇంగ్లీషులో మాట్లాడబోయే 'పుణ్యభూమి'గా మారబోతోంది.

గ్రంథం ఆరంభంలోనే భారతదేశంలోని భాషల ప్రస్థానానికి తిరామిసు ఎలుగుబంటును ఒక ప్రతీకగా రచయిత్రి తరచు చెప్పుతూ వచ్చారు. కెనడా దేశ అరణ్య ప్రాంతాల్లోని ఆడ ఎలుగులు వాతావరణంలో వచ్చిన మార్పులవల్లనో, ఇతర కారణాలవల్లనో ధ్రువ ప్రాంతానికి వలసపోయి, ధ్రువపుఎలుగులతో జతకట్టి తిరామిసు (tiramisu) పిల్లల్ని, పెట్టాయి. వీపుల మీద ధ్రువ ప్రాంతపు ఎలుగుల చారలు వీటి వీపులమీద విలక్షణంగా వుంటాయిట!

భిన్న భాషల వ్యవహర్తలు కలిసిన సందర్భంలో ఒకరి భావాలు మరొకరికి తెలియడానికి కొత్తభాష అవసరం అవుతుంది. ఈ క్రమంలోనే ఆఫ్రికా భాషలు మాట్లాడేవారు కొత్త కొత్త క్రియోల్ వాడుకలోకి తెచ్చారు. వెస్టుయిండీస్‌లో క్రియోల్ భాషలు ఈ పద్ధతిలోనే వాడుకలోకి వచ్చాయి. రెండు మూడు ఆఫ్రికా దేశాలనుంచి శ్వేతజాతీయులు వెస్టిండీస్‌కు బానిసలను దిగుమతి చేసుకున్నారు. ఈ బానిసలకు ఒకరి భాష ఒకరికి తెలియదు. యజమానుల భాషలనుంచి, తమ సొంత భాషల నుంచి పదాలను వాడుకొంటూ క్రియోల్ భాషలను సృష్టించుకొన్నారు. క్రియోల్ భాషలు ఒక తరం కాలంలోనే వాడుకలోకి వచ్చేస్తాయని రచయిత్రి అంటారు.

**భారతదేశంలో బాలలు ఇంగ్లీషులో ప్రావీణ్యం సంపాదించుకోవచ్చు గానీ, మాతృభాష వారికి నేర్పడంలేదు. పిల్లలు మాతృభాషల మీద ఆసక్తి కోల్పోతున్నారు. ఇంగ్లీషు అమ్మభాష స్థానాన్ని ఆక్రమిస్తోంది. అదే జీవితంలో వాడుకకు పనికొచ్చే సాధనమయింది. చివరకు దేశభాషలన్నీ గ్రామీణ ప్రజలకు పరిమితం కావచ్చు. ఒకరకంగా ఇంగ్లీషు వివక్షకు సాధనంగా మారింది అంటూ ప్రొఫెసర్ పెగ్గీ మోహన్ ఎంతో ఆర్తితో, తార్కికంగా ప్రస్తుతం మన దేశభాషల పరిస్థితిని వివరించారు – ఈ పుస్తకం ద్వారా.**

## పంజాబీ అధికార భాషాచట్టానికి మరింత పదును

నవంబరు 11, 2021 న పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం పంజాబీ అధికార భాషా చట్టానికి సవరణలు చేస్తూ 1–10 వ తరగతి చదివే విద్యార్థులకు పంజాబీ భాషను తప్పనిసరి బోధనా విషయం చేసింది. ఈ చట్టాన్ని అమలు చేయకుండా పంజాబీ భాష అధ్యయనాన్ని అమలు చేయని పాఠశాలలపై 2 లక్షల రూపాయల అపరాధ రుసుమును వసూలు చేయాలని చట్టంలో చేర్చారు. మొదటిసారి అమలు చేయకుండా పట్టుబడితే రూ. 50,000 రెండవ సారి అపరాధం చేస్తే రూ. 1 లక్ష, ఒక నెల దాటినా అమలు చేయని పక్షంలో మూడవసారి ఆపై అతిక్రమణకు రూ. 2 లక్షలు జరిమానా విధించాలని ఈ చట్టంలో నాయకులు పొందుపరిచారు. విద్య సంబంధిత ఈ చట్టంతో పాటుగా పంజాబ్ శాసనసభ మరో ముసాయిదాను చట్టం చేసుకుంది. ఆ చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు, ఆ సంస్థల్లోని ఉద్యోగులకు వ్యవహారాల్లో పంజాబీ భాషను తప్పనిసరి చేసింది. అతిక్రమించిన వారికి మొదటిసారి 500, రెండవ సారి ఒక వెయ్యి రూపాయలు, మూడవ సారి ఆపై అతిక్రమిస్తే 2000 రూపాయలు జరిమానా విధించాలని ఈ చట్టం చెబుతోంది. రెండు చట్టాల అమలుకు సరిపోయే సిబ్బందిని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నియమించనుంది. రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో, గ్రామ స్థాయిలో పంజాబీ అమలును సుసంపన్నం చేసేందుకు ప్రతి స్థాయిలో బోర్డులను లేదా కమిటీలను నియమించనున్నారు.

కొత్తమాట

స.వెం.రమేశ్

# కొత్తమాటల పుట్టింపు

## 9

తెన్నాట(ఇప్పటి తమిళనాట) మా పెద్దలనోళ్లలో ఒక తెలుగుమాట ఉంటుంది. "ఎసిదెరిగిన వాండు ఇట్ట మాటాడుతుడా" "పసుదులు ఉండి అయినా ఎసుదులు చదవవాల" అంటుంటారు వాళ్లు. ఎసిది అంటే శాస్త్రం, ఎసుదులు అంటే శాస్త్రాలు, పసుదులు అంటే పస్తులు. తమిళంలో ఎసిదిని 'ఇయల్' అంటారు. శాస్త్రం అంటే దారిచూపేది, అనుసరించ తగినది అనే కదా. తెలుగులో కూడా పాతతరి పెద్దలు 'ఏయిదు' అనే పనిపలుకును వాడి ఉన్నారు. ఈమాటకు 'అనుసరించు' అని తెల్లము. తెలుగు నుడిగంటులలోకి ఈ మాట ఎక్కి ఉంది కూడా. కాబట్టి 'ఎసిది' అనే తెన్నాటి తెలుగుమాట వాడరానిదేమీ కాదు. ఈ ఎసిదిని చేర్పుగా వాడుకొంటే చాలినన్ని ఆనిమి(సాంకేతిక) మాటల్ని పుట్టించవచ్చు. మచ్చుకు కొన్ని.

| | | | |
|---|---|---|---|
| 1. | ఉసురు+ఎసిది | ఉసురెసిది | జీవశాస్త్రం |
| 2. | మనుము+ఎసిది | మనుమెసిది | జంతుశాస్త్రం |
| 3. | ఏడు+ఎసిది | ఏడెసిది | వృక్షశాస్త్రం |
| 4. | వేదు+ఎసిది | వేదెసిది | రసాయనశాస్త్రం |
| 5. | పొరుడు+ఎసిది | పొరుడెసిది | భౌతికశాస్త్రం |
| 6. | నెలవు+ఎసిది | నెలవెసిది | భూగోళశాస్త్రం |
| 7. | లెక్కింపు+ఎసిది | లెక్కింపెసిది | గణాంకశాస్త్రం |
| 8. | మనిసి+ఎసిది | మనిసెసిది | ఆంత్రోపాలజీ |
| 9. | తొల్లి+ఎసిది | తొల్లెసిది | పురావస్తుశాస్త్రం |
| 10. | నుడి+ఎసిది | నుడెసిది | భాషాశాస్త్రం |
| 11. | కూటువ+ఎసిది | కూటువెసిది | సామాజికశాస్త్రం |
| 12. | ఒడమి+ఎసిది | ఒడమెసిది | ఆర్థికశాస్త్రం |
| 13. | మర+ఎసిది | మరెసిది | ఇంజినీరింగ్ |
| 14. | పుడమి+ఎసిది | పుడమెసిది | జియోలజీ |
| 15. | ఎద+ఎసిది | ఎదెసిది | కార్డియాలజీ |
| 16. | విడమరపు+ఎసిది | విడమరపెసిది | ఎటిమాలజీ |
| 17. | పురుగు+ఎసిది | పురుగెసిది | ఎంటమాలజీ |
| 18. | పులుగు+ఎసిది | పులుగెసిది | ఆర్నితాలజీ |
| 19. | గద్దె+ఎసిది | గద్దెసిది | జ్యోతిషశాస్త్రం |
| 20. | విరుగు+ఎసిది | విరుగెసిది | వైద్యశాస్త్రం |

ఇట్లాంటివి ఎన్ని మాటలనైనా కొత్తగా 'ఎసిది'తో పుట్టించవచ్చు

## 10

'ఇక' అనే చేర్పు గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. ఒక పనిపలుకుకు 'ఇక'ను చేర్చితే అది పేరుపలుకు అవుతుంది. చేరు+ఇక=చేరిక; కదలు+ఇక= కదలిక వంటివి. ఎందుకనో తెలుగుపెద్దలు ఆనిమిమాటల పుట్టింపులో ఇంత తేలికయిన, అందరూ వాడుతున్న చేర్పును కూడా పట్టించుకోలేదు, వాడలేదు. మనం వాడి చూద్దాం.

| | | | |
|---|---|---|---|
| 1. | అగలు+ఇక | అగలిక | క్షీణత |
| 2. | అచ్చు+ఇక | అచ్చిక | జామీను |
| 3. | అణగు+ఇక | అణగిక | అంతర్గతం |
| 4. | అదపు+ఇక | అదపిక | నియంత్రణ/కంట్రోల్ |
| 5. | అదరు+ఇక | అదరిక | ప్రసారం/టెలికాస్ట్ |
| 6. | అదలు+ఇక | అదలిక | శోకం |
| 7. | అడ్డు+ఇక | అడ్డిక | నిరోధకం |
| 8. | నొగులు+అడ్డు+ఇక | నొగులడ్డిక | వ్యాధినిరోధకం/ ఇమ్యూనిటీ |
| 9. | అంటు+ఇక | అంటిక | ఆశ్రయం |
| 10. | అత్తు+ఇక | అత్తిక | ఏకీభావం |
| 11. | అదరు+ఇక | అదరిక | కంపనం |
| 12. | అందు+ఇక | అందిక | సమానం |
| 13. | అను+ఇక | అనిక | వాచకం/వచనం |
| 14. | అరుగు+ఇక | అరుగిక | ప్రయాణం |
| 15. | అరుము+ఇక | అరుమిక | ప్రతిఘటన |
| 16. | అలదు+ఇక | అలదిక | చిత్రలేఖనం |
| 17. | అలము+ఇక | అలమిక | ఆక్రమణం |
| 18. | అలయు+ఇక | అలయిక | శ్రమ |
| 19. | అలరు+ఇక | అలరిక | వికాసం |
| 20. | ఆము+ఇక | ఆమిక | ఆవరణం |

ఇట్లాంటివి వేనవేల మాటలను పొందించవచ్చు. పైన చెప్పిన మాటలన్నీ పనిపలుకులకు 'ఇక'ను చేర్చి చెప్పినవి. పేరుపలుకులకు 'ఇక'ను చేర్చవచ్చా, అని అడిగితే, తెలుగులో చేర్చకూడదు, సంసుక్రుతంలో అయితే చేర్చవచ్చు అంటారు మన పెద్దలు. 'అక్కటి' అనేది తెలుగుమాట. ఇది పేరుపలుకు. దీనికి 'ఇక'ను చేర్చి 'అక్కటిక' అనే ఇంకొక పేరుపలుకును పొందించి ఉన్నారు మన పాతతరి పెద్దలు. ఒక్క మచ్చు చాలదా మనం అల్లుకుపోవడానికి.

| | | | |
|---|---|---|---|
| 1. | ఆకు+ఇక | ఆకిక | పత్రిక |
| 2. | చుట్ట+ఇక | చుట్టిక | సిగరెట్ |

మరలా వేలమాటలను పుట్టించవచ్చు. తెలుగు చేవలేనిది కాదు. తెలుగుదారిన నడుద్దామనే తలపు మనకు కలగాలంతే.

### చదువరులకు విన్నపం

అమ్మనుడి చదువరులకు దండాలు. ఇదివరకు ఎన్నోసారులు చెప్పినదానినే మరలా మరొక్కసారి గురుతు చేస్తున్నాను. ఇంట్లో పిల్లలచేత అమ్మానాన్నా అని పిలిపించుకోవడం, అంగళ్లమీద పేర్లను తెలుగులో రాయించడం, తెలుగును ఎందుకు వాడడం లేదంటూ

తరువాయి 22వ పుటలో....

తెలుగుసేత: రావెల సాంబశివరావు
99590 89630

## సైద్ధాంతిక రాజకీయాలను చర్చించేందుకు దారిదీపం
# కొన్ని రామమనోహర్‌లోహియా ప్రసంగాల, పత్రాల మాలిక




స్వాతంత్ర్యోద్యమ కాలంలోనూ ఆ తర్వాతా భారత రాజకీయాలపైనా జాతి నిర్మాణం పైనా ఎంతో ప్రభావం చూపిన ఉన్నతస్థాయి నేతల్లో రామ్ మనోహర్ లోహియా ఒకరు. తొలితరం సోషలిస్టు నాయకుడిగా డా॥ లోహియా– భాషాసమస్య, కులసమస్య వంటి అన్ని మౌలిక సమస్యలపైనా అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి దారి చూపిన నిజమైన దేశ భక్తుడు. ఆయన ప్రసంగాల నుండి ఎంపిక చేసిన కొన్నిటిని రావెల సాంబశివరావు తెలుగు చేశారు. వాటినొక పుస్తకంగా ఎబికె ప్రసాద్, అవధానం రఘుకుమార్, మోతే గంగారెడ్డిల ముందుమాటలను చేర్చి ప్రచురించింది 'ఎమెస్కో' బుక్స్ సంస్థ. లోహియా ప్రసంగాల్లో 'సిద్ధాంత చర్చ' శీర్షికన ప్రచురించిన వ్యాసాన్ని 'అమ్మనుడి' చదువరులకోసం ఇక్కడ ఇస్తున్నాం. సామాజిక, రాజకీయ రంగాల్లో పనిచేస్తున్న ప్రతివారూ– ముఖ్యంగా యువత ఈ వ్యాసాన్నీ పుస్తకంలోని తక్కిన ప్రసంగ వ్యాసాలనూ శ్రద్ధగా చదవాలని సూచిస్తున్నాము. – సం.

# సిద్ధాంత చర్చ

**నాకు** తిరిగి సిద్ధాంతాలపై మాట్లాడవలసిన అవసరం ఏర్పడదనీ చర్చకు జయప్రకాష్(నారాయణ) ముగింపు పలుకుతారని భావించాను. అదలా జరిగి వుంటే మరింత బాగుండేది. అశోక (మెహతా) అన్నదేమంటే భారతీయ సంస్కృతిలో ఉనికి లేకుండాపోవటమన్నది అనూచానంగా వస్తున్నది. మీరు నా ప్రసంగాన్ని జాగ్రత్తగా పరిశీలించివుంటే మీరు గమనించే వుంటారు –ఎక్కడ కూడ నేను అన్న పదాన్ని ప్రయోగించలేదని, అలా నేను నా ఉనికిని చాటుకోలేదని. అయితే చర్చను విన్న తరువాత నేను కొన్ని అంశాలపై వివరణ యివ్వవలసి వుంటుందని భావించినట్లున్నారు.

నేను మార్క్సువాదాన్ని తృణీకరించానన్నారు. ఆ సమస్య ఎందుకు తలెత్తిందో నాకు అవగాహనకు రావటం లేదు. ఎవరయితే మార్క్సు గురించి ఎక్కువగా మాట్లాడతారో, మార్క్సిజంను వృత్తిగా చేపట్టడం జరిగిందో వాళ్లకు మార్క్సు మూల సిద్ధాంతాలలో కొన్ని అసంపూర్ణాలనేది అవగాహనలోకి తెచ్చుకోరు. ఉదాహరణకు పెట్టుబడిదారీ విధానం, క్రమ పరిణామం విషయంలో మార్క్సు సిద్ధాంతీకరించింది, సరిపోయేదిగా లేదు. ప్రపంచవ్యాప్తంగా వున్న సోషలిస్టులు, విశ్వసించే ప్రకారం, పెట్టుబడిదారీ విధానం, అభివృద్ధి చెందే సమయంలో ఒకవైపున పెట్టుబడిపై అధిక శ్రద్ధను కనబరుస్తూనే మరో వైపునుండి ఉత్పత్తి సంబంధాలను సమాకలనం గావించేందుకు పూనుకుంటుంది. ఉత్పత్తికి సంబంధించిన యీ బంధనాలు వాటిలో అవి ఒక బ్రహ్మాండమైన సామాజిక శక్తిని పుట్టిస్తాయి; ఉత్పత్తి శక్తుల మధ్య పేచీలు, ఉత్పత్తి బాంధవ్యాలలో కాలం చెల్లినవి జరిగి ఘర్షణ రూపుదాల్చుతాయి; ఈ ఘర్షణనుండీ సోషలిజం ఉద్భవిస్తుంది. దీనినే నేను నమ్ముతూ వచ్చాను. ఇవ్వాల్టికీ దానిపైనే నా విశ్వాసం; అయితే అది సంపూర్ణ వ్యాఖ్యానం కాగలదా? అయితే పెట్టుబడిదారీ విధానం ఒకప్పుడు అభివృద్ధి పథాన పయనించింది కాని నేడది ముందుకుగాని, వెనుకకుగాని కదలలేని స్థితి ఏర్పడింది అనటం మాత్రం సబబు అన్పించుకుంటుందా ? అలా చెప్పటమూ సబబుకాదు. ఎన్నడో నాల్గువందల యేండ్ల నాడు మన దేశంలోనే– ఉదాహరణకు ప్రజలు యింతకంటే మంచిగా జీవించేవాళ్లు; నేటి స్థితితో పోలిస్తే వాళ్లకు తినేందుకు తిండి, కట్టుకునేందుకు బట్ట సరిపోయేంతగా వుండేది.

పెట్టుబడిదారీ విధానపు క్రమానుగతి సిద్ధాంతాన్ని అవగాహనలోకి తెచ్చుకునేందుకు అటువంటి అరకొర ప్రకటనల వల్ల ప్రయోజనం లేదు. మనం ఒకవేళ పెట్టుబడిదారీ విధానం ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి బాంధవ్యాలకు మధ్య ఘర్షణను కలుగజేసిందని చెప్పదలిస్తే, అప్పుడు అలా చెప్పేదాన్ని యిలా పూరించాల్సి వుంటుంది; దాని పరిణామక్రమంలో అది కూడ రెండు ప్రపంచాలను సృష్టించింది – ఒకదానిలో సాంకేతికపరమైన విప్లవాత్మక ప్రగతిని అందిస్తూ రెండవ దానిలో ప్రజలకు పేదరికాన్ని, దుర్భర దారిద్ర్యాన్ని, అంతులేని వ్యధను పంచింది. ఒక ప్రపంచానికి అది ఉత్పత్తికి అవసరమయ్యే వనరులు యిబ్బడి ముబ్బడిగా అందిస్తూ, రెండవ దానిలో ఉత్పత్తికి సంబంధించి

పనికిరాకుండాపోతున్న ఉపకరణాలను పంచింది.

మనకు లభించే ఆధారాలను బట్టి, చారిత్రక ధోరణిని అనుసరించిగాని ఈ వాస్తవాన్ని మనం కొట్టిపారవేయగలమా?

పెట్టుబడిదారీ విధానం విషయంలో మార్క్స్ ప్రతిపాదన పైన చెప్పిన మౌలిక అంశాల ప్రస్తావన తేకుంటే అది అర్ధసత్యమే కాగలదు. కనుక మనం దానిని పూర్తిగా సత్యసమ్మతంగావించ దలిస్తే పెట్టుబడిదారీ విధానం కూడ ప్రపంచాన్ని రెండుగా చీల్చింది; ప్రపంచంలో మూడింట ఒక వంతుకు ఉత్పత్తి శక్తులు వృద్ధి చెందేందుకు సహకరించింది; మూడింట రెండు వంతుల ప్రపంచంలో ఉత్పత్తి శక్తులు సన్నగిల్లేట్లు, చావుదెబ్బ తినేట్లు చేసింది.

ఏ మార్క్సిస్టు విశ్వాసి అయినా నిరంతరం అర్ధసత్యాన్ని బ్రతికించే దానికే పూనుకుంటాడు. అయితే దురదృష్టవశాత్తు మార్క్సిస్టు విశ్వాసులు బహు కొద్దిమందే. అయితే నా ప్రసంగాన్ని మార్క్సిజపు పరీక్షలకు గురిచేసి ఆ వెలుగులో ముందుకు సాగదలుచుకోలేదు. అటువంటి పనిలో నాకు ఉత్సుకత లేదు. నేను కనుగొన్న సత్యాన్ని కనుగొన్న విధంగా మీకు అందించటానికే పూనుకుంటాను.

నా భావనా పరంపరలో మార్క్సుకూ స్థానం వుంది. అది చరిత్రలో చాలా వెనక్కిపోతుంది. మార్క్సను దాటిపోతుంది కూడ. అది మానవ సంపూర్ణత్వానికి అతి దగ్గరగా చేర్చుతుంది. చివరకు మార్క్స్ కూడ యిటువంటి పాతబడిపోయిన సంప్రదాయాలకు, కాలప్రవాహానికి చెందిన నిరంతర జిజ్ఞాసకు కట్టుబడి వుండాల్సిందే. ఈ విధంగా మార్క్సిస్టులు, మార్క్సిస్టులు కానివాళ్లు అవి మాట్లాడుకోవటం అసంగతమే. కాదు, నిష్ఫలం కూడా. మనకు ప్రస్తుతం కావలసింది సరైన ఆలోచనా విధానం; ఒక సంఘటిత దృక్పథం. మన మనస్సు తృష్ణమయం కావాలి. గాంధీ లేదా మార్క్స్ భావనల్ని సారాంశాలను గ్రహించే దిశగా, మనం సంప్రదాయానికి అంటకాగకుండా తృష్ణకే పరిమితం అయితే ఫలితం వుంటుంది.

మార్క్సిజమ్, దాని సాధారణ సూత్రాలూ మొత్తంగా ఎక్కడైతే పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి కుంటుబడిందని వెల్లడించటం జరిగిందో అది తప్పు అని తేలటానికి కారణం ఎక్కడైతే ఉత్పత్తి శక్తులు వృద్ధి చెందటంలో వెనుకబడిపోతాయో అక్కడ పెట్టుబడిదారీ బాంధవ్యాలు కుంటుపడతాయి.

మార్క్సిస్టుల వాదన ఏమంటే నరజాతి నాగరికతకు చెందిన చరిత్ర అంతా పరపీడన పరాయణత్వమేనని. అయితే జాతుల మధ్య జగడాలు అంతగానే ప్రభావాన్ని చూపాయన్న విషయాన్ని వాళ్లు మరిచారు. జలగల్లా పీల్చటం, పీడించటం గత కొన్ని శతాబ్దాలుగా జరుగుతూ వస్తున్నదే – 1/3వంతు ప్రపంచం మిగతా 2/3 వంతు ప్రపంచాన్ని పట్టి పీడిస్తూనే వుంది. ఈ వాస్తవాన్ని మనం దాటవేయజాలం.

మరో సూచనను కూడా ముందుకు తెచ్చారు – నా ఆలోచనలు ఆ రెండు రకాల ప్రపంచాల మధ్య మరింతగా ఘర్షణను పెంచగలవని; అలాగే అక్కడి, యిక్కడి సోషలిస్టుల మధ్య కూడా ఘర్షణను తీవ్రతరం చేయగలవని. ఆ సూచన కేవలం నీడను చూపి వెలుగును మరుగుపరిచే పద్ధతి. ఒక విషయం మీరు మరువరాదు. యిప్పటికీ ఆ రెండు ప్రపంచాల మధ్య ఘర్షణ నెలకొనివుంది. దానిని నిర్మూలించేందుకు మనం కృషి చేయవలసివుంది. రెండు ప్రపంచాలకు చెందిన సోషలిస్టులు, కలసికట్టుగ, ఉన్నవారికి లేనివారికి మధ్యగల వ్యత్యాసాలను, సంఘర్షణను తొలగించవచ్చును. ఈ రెండు ప్రపంచాల మధ్య మూడు విధాలైన బాంధవ్యాలు ఉండవచ్చును; ఒకటి ఆధిపత్యానికి (domination) సంబంధించినది; రెండవది సమానత్వానికి సంబంధించినది; మూడవది పంపకానికి సంబంధించినది. పశ్చిమ దేశాల్లోని సోషలిస్టు పార్టీలు వాళ్ల ఆలోచనల్ని, చర్యల్ని ఈ మూడవరకం సంబంధంలో లంకె కుదుర్చుకోవాల్సివుంది. ఇప్పటివరకు వాళ్లు వాళ్ల ఉద్యమాల్ని వాళ్లు సృజియించిన దానిని నిలబెట్టుకునేందుకు నిరంతరం పెరుగుతూపోయే జీవన ప్రమాణాలపై ఆధారపడేట్లుగా చూశారు. కనుక వాళ్ల చర్యలన్నీ జాతీయ సరిహద్దులకే పరిమితమయ్యాయి. అప్పుడప్పుడూ ఐరోపా ప్రజలు పంపకానికి సంబంధించిన బాంధవ్యాన్ని అందిపుచ్చుకోవటాన్ని మనం చూడవచ్చు. అయితే అక్కడి సోషలిస్టు పార్టీలు మిగతా మూడింట రెండు వంతుల ప్రపంచంలో ప్రజలు చెప్పుకోదగిన జీవన ప్రమాణాలతో విలసిల్లేందుకు మూడింట ఒక వంతు గల తమ ప్రపంచంలో తమ జీవన ప్రమాణాల్లో కోత విధించుకోవాలని చెప్పటంలో విఫలమైనట్లు కన్పిస్తూంది. పశ్చిమ దేశాల ప్రజలు దీనిని అర్థం చేసుకొనగలరని భావిస్తాను. సృష్టించిన దానిని కూడబెట్టటంలోనూ, వాళ్ల జీవన ప్రమాణాల్ని నిలబెట్టుకునేందుకు వాళ్లు తరుచుగా యుద్ధాలు చేయవలసి వచ్చింది. వాళ్లు మార్పును స్వాగతిస్తారు; యుద్ధాన్ని కాక శాంతిని కాంక్షిస్తారు. వాళ్లకున్న దానిని యితరులతో పంచుకుంటారు.

ఇటువంటి ఆలోచనలు ఘర్షణలకు దారితీయవు; పైగా వాటిని అంతమొందిస్తాయి. నా ప్రసంగంలో మీకు ఉమ్మడి మానవ సన్నాహానికి మరిన్ని ఆలోచనలు లభించివుండవచ్చు. ఉదాహరణకు పునర్నిర్మాణం నిమిత్తం అంతర్జాతీయ దళాల ఏర్పాటు అటువంటివే. దానిని అది నిలబెట్టుకునేందుకు పాశ్చాత్య ప్రపంచం సంపదను, కోరికల్ని పోగేసుకుంది. మనం వాటిని యింకా అందిపుచ్చుకోవాల్సి వుంది; అత్యంత వేగంగా. అంతర్జాతీయంగా సంపదను ఒక చోటుకు చేర్చి పునర్నిర్మాణం దళాల ద్వారా కూడబెట్టటం, సృష్టించటం అనేది పోరాటాలకు దారితీస్తుందా లేక దాని అంతిమ పారమార్థిక దృష్టికి దారితీస్తుందా?

నేనెక్కడా వర్గ పోరాటాన్ని కాదన్నది లేదు. పైగా దానికి భిన్నంగా నేను చెప్పిందేమంటే వర్గపోరాటం పెట్టుబడిదారీ విధానాన్ని అంతమొందించేందుకు ఆ ప్రక్రియను వేగవంతం గావిస్తుంది. అది లేకుంటే మూడింట రెండు వంతుల ప్రపంచం తొలి అడుగు కూడా వేయజాలదు. సామాజిక మార్పును వర్గపోరాటం క్రియాశీలం గావిస్తుంది. మన సంస్థాగత రూపాలు, పోరాట పద్ధతులు వాటి ఆర్థిక, యితర సాధారణ లక్ష్యాలకు సంబంధం కలవిగావుండాలేకాని ఏవో మూలన పడివున్న వాటిని పెకలించి ప్రయోజనం లేదు. వెంటనే పరీక్షలకు గురిచేయాలంటే మనం సామాజిక మార్పు

తీసుకురావాలని చెప్తే చాలదు; దానిని సాధించటం ఎలాగో కూడా వివరించాలి. కమ్యూనిస్టు తరహా వర్గపోరాటం ద్వారా మనం సోషలిజాన్ని నిర్మించజాలం. వెంటనే సాధించటం అనే పరీక్షలో కమ్యూనిస్టు విధానాలు పూర్తిగా విఫలమయ్యాయి. కమ్యూనిస్టు పోరాటాలలోని ఏ చర్యా కూడా దాన్ని సమర్థించుకోలేదుగాని వారు చేపట్టిన ప్రతి చర్యా బహుశా ఆగామి చర్యల ఫలితాలతో సమర్థింపబూనటం జరిగింది. ఇటువంటి స్థితివల్ల గొలుసుకట్టు విధానం పెరుగుతూ పోయింది; విధానం డొంకతిరుగుడు వ్యవహారంగా మారింది; చివరకు ఫలితంగా లక్ష్యాలు జారిపోయే దశకు చేరుకున్నాయి.

చిన్న పరిశ్రమకు చెందిన యంత్రాలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి. కొందరు దానిని చరఖాతో సరిపోల్చారు. దాని వినియోగాన్ని ఆదిమ కాలపు పద్ధతులుగాను, అప్పటి పనిముట్లుగాను ముద్రవేశారు. నేను మరో అధునాతన యంత్రాన్ని గురించి మాట్లాడాను. భారీ యంత్రాల ప్రయోజనాన్ని కూడా త్రోసిపుచ్చలేదు. ఎవరయినా కొందరు నేను భారీ జౌళి పరిశ్రమ స్థానంలో చరఖాను సూచిస్తున్నాను అనుకుంటే వాళ్లు పప్పులో కాలేసినట్లే. పోనీ చరఖా విషయమే తీసుకోండి. దాన్ని ఎవరయినా యథాతథంగానయినా లేదా దానిలో అంతర్గతంగా దాగివున్న ఆర్థిక భావన ప్రకారమయినా పరిశీలించవచ్చు. భారీయంత్రము, పెద్ద యెత్తున సువ్యవస్థీకరణ మీకు కొన్ని కాన్పూరులనో, కలకత్తాలనో ప్రసాదించవచ్చు. అయితే అటువంటి ఆవేశపు చర్యలు ద్వేషాలతోపాటు వాటి చుట్టూ దైన్యం, పతనమైన మానవత్వం, ఉపాధిలేమి, పేదరికపు సముద్రాలు నిలుస్తాయి.

గత సంవత్సరం అమెరికాలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను కలసినప్పుడు, నేను ఆయనతో వికేంద్రీకరణకు సంబంధించిన సాంకేతిక ప్రక్రియల్ని గురించి చర్చించాను. ఇంతటి ప్రపంచ విజ్ఞాన శాస్త్రవేత్త కూడా లఘు పరిశ్రమకు చెందిన చిన్న యంత్రాల సాంకేతికత్వాన్ని కాని ఆధునిక సువ్యవస్థీకరణను కాని కాదనలేదు. వాటి సంభవనీయతను అంగీకరించాడు. ఆయన యింకా అంగీకరించిన అంశమేమంటే ఆధునిక మానవుని మేధ తన యానాన్ని ముగించుకునే దశకు చేరుకున్నదని. బ్రిటన్, ఫ్రాన్స్ ఒకనాడు యాంత్రిక అభివృద్ధికి అగ్రభాగాన నిలిచాయి. అయితే గత 50 సంవత్సరాలుగా ఆ రెండు దేశాల్లో చెప్పుకోదగినంతగా సాంకేతిక అభివృద్ధి కన్పించదు. సాంకేతిక విప్లవం అమెరికా, రష్యాలలో పరాకాష్ఠకు చేరుకున్న విషయం వాస్తవమేకాని పశ్చిమ ఐరోపాలో గత మూడు దశాబ్దాలుగానో, అంతకుమించో అది అలాగే నిలిచిపోయింది. అక్కడ జీవితం ఎలా తయారయ్యిందంటే ఉత్పత్తి పెంపుకు, జీవన ప్రమాణాల పెరుగుదలకు సంబంధించిన తృష్ణ తీరటం లేదు. ఎంతగా ఆ దేశాల్లో సామాజిక సమానత్వం శిఖరాగ్రాన్ని చేరుకున్నా ఎటుచూచినా ఏదో బెంగ, ఆరాటం, ఉద్రిక్తత, సాధారణమైన శూన్యతాభావం నెలకొంది. భరించనలవికాని బాధలు, పారలౌకిక అసమానతల కారణంగా ఆధునిక నాగరికత నక్కమీద తాటిపండు పడినట్లు మూల్గుతుంది. నడ్డి విరిగిపోతున్నది. పాశ్చాత్య మానవుడు తనలో తాను శాంతిగ, కాంతిగ బ్రతకటం లేదు. తన అసలు సిసలైన ఆవాసం కొరకు అన్వేషణలో నిర్వాసితుడే.

అందుకే సోషలిజం అనే ఈ సుదీర్ఘ తీర్థయాత్ర. అది మానవుణ్ణి నిర్వాసిత్వం నుండి, అతని మనోవేదనాభరిత స్వయం పరాయీకరణ నుండి ఒడ్డున పడవేస్తుంది. ఆ తీర్థయాత్ర వర్తమానంలో, మనదేశంలో సరికొత్త దిశానిర్దేశాన్ని కోరుకుంటున్నది. దానిని అందించేందుకు మనం కేవలం సంప్రదాయానికి విధేయతను ప్రకటించినందువల్ల ప్రయోజనం లేదు. దానిని మనం బ్రతికించుకోవటం అన్నదే ఏకైక మార్గం. అదిగో అటువంటి ఆశాజనక, వినయపూర్వక స్ఫూర్తితో సిద్ధాంత చర్చను నిర్వహించాం. అయితే నాకు హృదయోల్లాసాన్ని సమకూర్చిన అంశమేమంటే మన సభ్యుల్లో అత్యధికులు ఒడ్డున నిలబడి చోద్యం చూడటమో లేదా అక్కడి నుండి జారుకునే ప్రయత్నమో చేయకపోవటమే.

(పచ్‌మరి ప్రసంగం, మే1952)

---

**19 వ పుట తరువాయి...**

## కొత్త మాటల పుట్టింపు

దొరతనం(ప్రభుత్వం) వారిని నిలదీయడం, ఇవన్నీ చేయవలసిన పనులే. కానీ ఇంత చేసి ఊరుకొంటే తెలుగు నిలబడదు. తెలుగుకు బడిలో గుడిలో ఏలుబడిలో చోటు కల్పించాలి, ముందువరసలో నిలపాలి. తెలుగును ఎసిది(శాస్త్ర)నుడిగా ఎదిగించాలి. రెండువేల ఏళ్ల కిందటనే సంసుక్రుతంలో ఈ పని జరిగింది. ఎసిదినుడి కావాలంటే నెన్నొడి(పరిబాష/సాంకేతికపదాలు)ని బాగా పెంపొందించుకోవాలి. చిట్టిపొట్టిగా నెన్నొడిని పొందించడానికి తెలుగు ఎంతో అనువయిన నుడి. అందుకు ముందుగా తెలుగులో ఉన్న చేర్పులను గుర్తించాలి. వాటిని కుదురులకు కలపాలి. అప్పుడు నెన్నొడి పుడుతుంది. తెలుగులో మునుచేర్పులూ వెనుచేర్పులూ కలసి నూటికి పైగా ఉన్నట్లు నా ఎరుకలోకి వచ్చింది. నుడి ఎసిదరులు(శాస్త్రవేత్తలు) పనిగట్టుకొని వెతికితే ఇంకా ఎన్నో బయటపడుతాయి. నా ఎరుకకు వచ్చిన కొన్ని చేర్పులతో కొత్తమాటలను పుట్టించి చూపాలని, అమ్మనుడిలో 'కొత్తమాటల పుట్టింపు' పేరుతో నాలుగు నెలలపాటు రాసినాను. ఇంతలో నేను మరొక పనిని తలకెత్తుకోవలసి వచ్చింది.

తెలుగువారిలో కళలు చాలా ఉన్నాయి. కనుబరుపు(ప్రదర్శన) కళలూ, చేనేర్పు(హస్తనైపుణ్యం) కళలూ కలిసి, నా ఎరుకలోకి వచ్చినవే అయిదు వందలకు పైగా ఉన్నాయి. వీటిలో చాలా కళలు కనుమరుగు అయిపోతూ ఉన్నాయి. వీటన్నిటీ కనికి(వీడియో) పొదక (రికార్డింగ్) చేసే పనిలో తలమునకలు అయివున్నాను. 'డిట్రాయిట్ తెలుగు సాహితీ సమితి' వారు ఈ పనికోసం ముందుకు వచ్చినారు. అందువల్లనే కొత్తమాటల పుట్టింపును కొనసాగించలేకపోతున్నాను. ఈనెలలో ఈచేర్పులతో ఈపనిని ఇప్పటికి ఆపుతున్నాను. మరొకమారు ఎప్పుడయినా కొనసాగిస్తాను.

సి.వి.క్రిష్ణయ్య
93965 14554



# ఎవరు తెలివి గలవారు?! 2

**జరిగిన కథ**: జంతుజనాలు పక్షిజనాలు అడవిలో పెద్ద సభ చేసాయి. అడవికి రాజైన సింహానికి ఈ సృష్టిలో తెలివిగల ప్రాణి ఏది అనే సందేహంవచ్చింది. పక్షిజనాలు జంతుజనాలు పదిరోజులు ప్రపంచమంతా తిరిగి పరిశీలించివచ్చాయి. మనుషులు తెలివి గలవారేగాని అతని తెలివి తేటల కంటే బుద్ధిహీనత, దుర్మార్గాలే ఎక్కువని తేల్చాయి. ఇందుకు బడీ, ఆ బడిలో చదువులే కారణం కావచ్చునని మంచిబడి కోసం మానవులు ప్రయత్నిస్తున్నారనీ బడిలో చదువులు మారతాయని ఆశాభావం వెలిబుచ్చాయి. కొన్ని జంతువులు, పక్షులు ఆడవిలో మంచి బడిని మనవే పెట్టుకొందామని ప్రతిపాదించాయి. తరువాయి కథ చదువుకుందాం.

## చదువుకొన్న కోతి

**మి**ట్టమధ్యాహ్నం అయింది. ఎండలు మండిపోతున్నాయి. జంతువులన్నీ చెట్లనీడలకిందా, నేలబొరియల్లోనూ దాక్కున్నాయి. పక్షులు కొమ్మల చాటునా, చెట్లతొర్రల్లోనూ చేరి సేదతీర్చు కొంటున్నాయి. పక్షిపిల్లలు తమ దగ్గరకొచ్చిన పురుగుల్ని ముక్కులతో పొడిచి వినోదిస్తున్నాయి. పిల్లజంతువులు అప్పుడప్పుడు లేచి ఎండుటాకుల మీద పరుగులుదీస్తున్నాయి. ఆకుల గల గల శబ్దాలను విని జంతువులు భయంతో ఉలిక్కిపడుతున్నాయి. తల్లి జంతువులు కళ్లతోనే వాటిని గుర్రుగా చూసి వచ్చిపడుకోమని హెచ్చరిస్తున్నాయి. పిల్లజంతువులు తల్లి పొట్టలకింద చేరబోయి వేడికి తట్టుకోలేక దూరంగా జరిగి నేలకు తలలు వాల్చి కునుకు తీస్తున్నాయి.

పొద్దువాలింది. చెట్లక్రింద చల్లని పిల్ల గాలులు వీస్తున్నాయి. పిల్ల జంతువులు లేచి ఆడుకోడానికి పరుగులు పెట్టాయి. పరుగులు పెట్టవద్దంటూ పెద్ద జంతువులు అరుస్తున్నాయి. పిల్లల ఆటల ముందు పెద్దల మాటలు చెల్లవుగదా!

ఇంతలో అడవిలో అలజడి ప్రారంభమయింది. తూర్పున కొండ కింద మర్రిమాను దగ్గరకు అందరూ పరుగులుదీస్తూన్నారు.

ఒక పెంపుడు కోతి మనుషుల మధ్య నండి తప్పించుకొని అడవిలోకి వచ్చింది. దాని ఒంటిమీద చొక్కా నిక్కరు ఉన్నాయి. దాని మెడలో ఒక సంచి వేలాడుతూ ఉంది. ఆ కోతిని ముందుగా కొన్ని పక్షులు, జంతువులు చూసాయి. మనిషి అనుకొని భయపడి దూరంగా వెళ్లి తొంగి చూడసాగాయి. తనను చూసిన జంతువులు పక్షులు దూరంగా పోవడం కోతి గమనించింది. నేను కోతిని మీ నేస్తాన్ని అంటూ జంతువుల భాషలో కిచ కిచ అరిచింది. కోతి గొంతు గుర్తుపట్టి పక్షులు జంతువులు దగ్గరకొచ్చాయి.

కొన్ని సంవత్సరాల నుండి మనుషుల నుండి పారిపోయిన పెంపుడు జంతువులు, పెంపుడు పక్షులు అడవిలోకి వస్తూనే ఉన్నాయి. వీటి అలవాట్లను వింత చేష్టలను చూసి అడవిలో జంతుజనాలంతా వినోదిస్తూ కాలక్షేపం చేయడం అలవాటయింది. ఇందులో తోడేలు పిల్ల విక్కీ, జంక పిల్ల మాగీ చేసే అల్లరికి హద్దేలేకుండా పోయింది. విక్కీ, మాగీలు పెంపుడు కోతిని విచిత్రంగా చూడసాగాయి. కోతి వేషం చూసి వాటికి నవ్వు వచ్చింది.

"అన్నా! మనుషుల్లా వంటిమీద ఈ గడ్డలేంది అసహ్యంగా వెంటనే తీసెయ్" అంటూ చొక్కా పట్టి లాగింది విక్కీ. కోతి విక్కీ చేతిని గట్టిగా పట్టుకుంది.

"నాకు గుడ్డలేసుకోవడం అలవాటయింది. ఇవి లేకపోతే నాకు సిగ్గుగా ఉంటుంది." అన్నది పెంపుడుకోతి

"సిగ్గంటే ఏందన్న" అని అడిగింది మాగీ చెంగున గెంతుతూ. ఆ మాటకు మిగిలిన జంతువులు, పక్షులు నవ్వాయి.

"ఇవన్నీ మీకు తెలియదు. మీరు అడవిలో ఉంటున్నారు గదా! నేను మనుషుల మధ్య పెరిగాను. నాకు చాలా విషయాలు తెలుసు. మనుషుల దగ్గర చాలా నేర్చుకున్నాను" అన్నదికోతి.

"ఈ అడవిలో ఉండే వాళ్లలో సగం మంది మనుషుల మధ్య పెరుగుతూ పారిపోయి వచ్చినవారే. వాళ్లు కూడా నీమాదిరే చాలా తెలివితేటలు ప్రదర్శించి నవ్వుల పాలయ్యారు" అన్నది కొమ్ముల జింక.

"సరేలే అన్నా! నీకు చాలా తెలిసే ఉంటుంది. ముందు ఆ సిగ్గేందో అది ఎలా ఉంటుందో చూపించు" అంటూ కోతి చొక్కా, నిక్కరు పట్టుకొని లాగాయి విక్కీ మగీలు"

ఇంతలో గుడ్డలేసుకొన్న కోతి సంగతి అడవిలో ఉన్న అందరికీ తెలిసిపోయింది. బిలబిలమంటూ పరుగెత్తుకొని వచ్చారు. కోతి వేషం



చూసి నవ్వుకొన్నారు. మాగీ విక్కీలు కోతిని ఆటపట్టిస్తూనే ఉన్నాయి. "మాకు సిగ్గుకావాలి, సిగ్గు ఎలా ఉంటుందో చూపించు" అంటూ కోతి చొక్కా పట్టుకొని లాగాయి. మిగిలిన జంతువులు పక్షులు కూడా సిగ్గు ఎలా ఉంటుందో చూపించమని పట్టుపట్టాయి. మన పెంపుడు కోతికి సిగ్గు ఎలా ఉంటుందో చూపించక తప్పలేదు.

కోతి తన రెండు చేతులతో ముఖం కప్పుకొన్నది. ముఖాన్ని పక్కకు తిప్పి చేతులు కొద్దిగా తొలగించి ఓర కంటితో చూసి నవ్వుముఖం పెట్టింది. ఈ విచిత్రమైన విన్యాసం చూసి జంతువులు, పక్షులు నవ్వుకొన్నాయి. అవి కూడా అలా చూడడానికి ప్రయత్నించి విఫలమయ్యాయి. కాని ఓరకంటితో చూసి నవ్వడం మాత్రం నేర్చుకొన్నాయి. వాటికది తమాషాగా ఉంది.

ఒక మగ సింహం సిగ్గు పడడం చూసిన కోతి "ఆడవాళ్లు మాత్రమే సిగ్గుపడాలి. మగవాళ్లు సిగ్గుపడకూడదు" అని చెప్పింది. దీనికి అడవిదున్న, మేకపోతు ఒప్పుకోలేదు సిగ్గు పడే హక్కు మాకు ఉండాలని పట్టుపట్టాయి. ఆడామగలు ఎవరైనా సిగ్గు పడవచ్చని తీర్మానించాయి.

"అన్నా! నీ వల్ల సిగ్గుపడడం నేర్చుకొన్నాం. ఇంకా నీకేమి తెలుసు అవన్నీ మాకు నేర్పుతావా?" అని అడిగారు విక్కీ, మాగీలు.

నేను మీకు నేర్పడానికే ఈ అడవికి వచ్చాను. మనం తెలివితేటలు సంపాదించి మనుషులమీద పగతీర్చుకోవాలి. అన్నది పెంపుడుకోతి.

"ఇక్కడ మా అందరికీ మనుషుల మీద కోపంగానే ఉంది. కాని ఎలా మనుషుల్లాగా తెలివితేటలు సంపాదించుకుంటాం? అసలు నీ కథ ఏమిటో చెప్పు" అంటూ కొమ్ముల జింక పెంపుడు కోతిని అడిగింది.

కోతి తన కథ చెప్పడం మొదలుపెట్టింది. "నేను చాలా చిన్నవాడిగా ఉన్నప్పుడు ఒక మనిషి నా మీద ఒక దుప్పటి కప్పి పట్టుకొన్నాడు. వాడి పేరు బాలయ్య. నన్ను కొట్టి ఏడ్పించి నాకు రకరకాల విద్యలు నేర్పించాడు. నన్ను వీధుల్లోకి తీసుకొనివెళ్లి ఆ విద్యలు ప్రదర్శింపచేసి డబ్బులు సంపాదించేవాడు. ఆ డబ్బులతో వాడు బాగా తిని తాగి నన్ను కొట్టేవాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఒక రోజు తప్పించుకొని పారిపోయాను. పిచ్చిపట్టినట్లు ఎక్కడెక్కడో తిరిగాను. ఈ మనుషులు ఇంత తెలివితేటలు ఎలా సంపాదించారా అని నిశితంగా పరిశీలించాను. ఒక రోజు ఒక ఇంటి వరండాలో తినడానికి ఏమైనా దొరుకుతుందేమోనని దొంగచాటుగా చూస్తున్నాను. ఇంతలో ఆ ఇంట్లో నుండి ఒక అబ్బాయి బయటకు వచ్చాడు. అతను ఒక జామ పండు తింటూ నాకు పెట్టాడు. నేను తీసుకొని తిని అతనివైపే చూశాను. అతను ఇంటిలోపలికెళ్లి మరొక పండు తీసుకొనివచ్చి ఇచ్చాడు. ఆ విధంగా ఆ అబ్బాయికీ నాకు స్నేహం కుదిరింది. అతను రోజూ బడికి వెళ్లి సాయంకాలం ఇంటికి వచ్చి నాతో ఆడుకునేవాడు. నేను చాలా ఆనందంగా ఉన్నాను.

ఒక రోజు నాకు చొక్కా నిక్కరు తొడిగాడు. ఒక ప్రపంచపటం తెచ్చి నాముందు పెట్టాడు. ఒక్కొక్క దేశం పేరు చెప్పి అది ఎక్కడుందో చూపించేవాడు. నన్ను మళ్లీ అడిగి చూపించమనేవాడు. నేను చూపిస్తే ఒక బిస్కెట్టు ఇచ్చేవాడు. చెప్పకపోతే ఎక్కువ సార్లు చెప్పి నేర్పించేవాడు. ఈ విధంగా నేను వంద దేశాలు గుర్తుపట్టడం నేర్చుకొన్నాను. ఒక రోజు వాళ్ల బడిలో పెద్ద ప్రదర్శన ఏర్పాటు చెశాడు. ఒక్కో దేశం పేరు చెప్పి నన్ను చూపించమని అడిగాడు. అతను చెప్పిన అన్ని దేశాలు చూపించాను. అందరూ చప్పట్లు కొట్టారు. నాకు 'తెలివిగల కోతి' అని ఒక కాగితం ఇచ్చారు. ఆ అబ్బాయికి 'నేర్పుగల ఉపాధ్యాయుడు'అని కాగితం ఇచ్చారు. అవి తీసుకొని ఆనందంగా ఇంటికి వచ్చాము.

ఇంటి వరండాలో అబ్బాయి నాన్న కూర్చుని ఉన్నాడు. అబ్బాయి వెళ్లి వాళ్ల నాన్నకు మాకిచ్చిన కాగితాలు చూపించాడు. ఆయన బిగ్గరగా నవ్వుతూ ఇలా ప్రశ్నించాడు. "నీ కోతికి దేశమంటే ఏమిటో తెలుసా? ప్రపంచమంటే ఏమిటో తెలుసా? ప్రపంచపటం ఎలా తయారు చేస్తారో తెలుసా? అందులో 'స్కేలు' అని రాసి అంకెలు వేసి ఉంటాయి. ఆ స్కేలు సంగతి తెలుసా? పోనీ కోతికి నేర్పిన ఉపాధ్యాయుడివిగదా? ఇవన్నీ నీకు తెలుసా? అంటూ అబ్బాయిని అడిగాడు. అబ్బాయి నాకు తెలియదు అంటూ నీళ్లు నమిలాడు. కన్నీళ్లు పెట్టుకొని ఏడ్చుకుంటూ ఇంటిలోకి వెళ్లాడు. అబ్బాయి అమ్మ వచ్చి పిల్లవాడిని మెచ్చుకోకుండా ఏడ్పిస్తావా అంటూ తగువులాడింది.

"ఇదంతా ఒక సర్కసు. అర్థం లేని చదువులతో మానవజాతి

తమ కళ్ల ఎదుట జరిగే దానిని కూడా చూడలేకున్నారు. దీన్ని ఆసరాజేసుకొని దుర్మార్గులు రెచ్చిపోతున్నారు. ఎవడో నీకు కోటి రూపాయలు బహుమతి వచ్చింది అనగానే నమ్మేస్తారా? ఖర్చులకు లక్షరూపాయలు పంపమంటే పంపేస్తారా? నీ బంగారం రెండింతలు అవుతుందంటే నమ్మి ఇస్తారా! అర్థం చేసుకొని చదివి ఉంటే ఇలా మోసపోయేవారా! ఎవడో కోటి బహుమతి మనకు ఎందుకిస్తాడు అనే ఆలోచన ఎందుకు రాదు? మనకు రెండింతలు బంగారం చేసి ఇచ్చేవాడు మన ఇంటికి ఎందుకు వస్తాడు? వాడే రెండింతలు పదింతలు చేసుకొంటాడు గదా అని ఎందుకు ఆలోచించలేకున్నారు. మొత్తంగా మన చదువుల్లో– ఉన్న తెలివితేటలను పోగొట్టే లక్షణం ఏదో ఉంది అంటూ ఆవేదన వెలిబుచ్చాడు.

నీవన్నీ పాత కాలంనాటి మాటలంటూ అబ్బాయి అమ్మ కోపంతో వెళ్లిపోయింది. అబ్బాయి తండ్రిగారు పల్లెటూరులో వ్యవసాయంచేస్తూ వారానికి ఒక్కసారి వచ్చిపోతుంటాడు. అబ్బాయి చదువుల కోసం పట్టణంలో సంసారం పెట్టింది అమ్మగారు.

నేను అబ్బాయితో పాటు రోజూ బడికి వెళ్లి కూర్చుని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు వినేవాడిని. ఈ బడి వలన బడిలో చదువుల వలన మనుషులు ఇంత తెలివితేటలు సంపాదిస్తున్నారని అర్థమైపోయింది. అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. మనుషుల మాదిరి మనం కూడా ఎందుకు చదువుకోకూడదు అనుకొన్నాను. అడవిలో ఒక బడి పెట్టాలనుకొన్నాను. అందుకే నేను పారిపోయి ఇక్కడికి వచ్చాను. మీరు అంగీకరిస్తే నేను బడి పెడతాను. ఇదిగో ఈ సంచిలో నేను వంద దేశాలు గుర్తుపట్టిన ప్రపంచపటం. ఇవిగో పుస్తకాలు అంటూ చూపించింది.

బడి పేరు ఎత్తగానే అక్కడ ఉన్న జంతుజనాలు, పక్షిజనాలు ఆనందంతో కేరింతలు కొట్టారు. "మేము బడికోసమే ఆలోచిస్తున్నాం. బడి ఎవరు పెడతారు అని ఎరురుచూస్తున్నాం. వెదకపోయిన తీగ కాలికి తగిలినట్లు నువ్వే వచ్చావు. బడిపెట్టి పుణ్యం కట్టుకో పిల్లలతో వేగలేకున్నాం. అని ప్రాధేయపడింది పిల్లల తల్లి కోరలపంది. ఎప్పుడూ లేనిది కొత్తగా ఈ బడి ఎందుకు? లేనిపోని ఇబ్బందులొస్తాయని బడిపెట్ట వద్దంటూ కొందరు అడ్డుతగిలారు. ఒక రోజంతా చర్చించారు. చివరకు అనుభవమున్న పెద్దల సలహా తీసుకోవాలని నిర్ణయించారు. ఆ రోజు సభలో మాట్లాడిన గుర్రాన్ని చిలుకను వెదుక్కొంటూ వెళ్లారు. ఒక విశాలమైన పచ్చికమైదానంలో గుర్రాన్ని చిలుకను కలుసుకొని బడి సంగతి చెప్పారు.

"చదువులు మంచివే... కాని ఆ చదువులు చెప్పడానికి ఏర్పాటు చేసిన బడితోను, ఆ బడిలో చదువులు చెప్పే పద్ధతులతోనే సమస్య. జ్ఞానం అనేది బలవంతంగా కూర్చుండబెట్టి మెదళ్లలోకి ఎక్కించేది కాదు. అది ఎవరికి వారు స్వయంగా సంపాదించుకొనేది. ఈ బడి, బడిలో చదువుల గురించి మనుషులకే ఇంకా స్పష్టతలేదు. మీరు మరి కొంతకాలం బడి జోలికి పోకపోవడమే మేలు" అని చెప్పింది చిలుక.

"కొద్ది రోజులు ఆగినా మనకు మంచీ చెడులు తెలియడం కష్టం. అనుభవంతో గాని కొన్ని విషయాలు అర్థంగావు. మీరు బడి పెట్టండి. వచ్చే సాధక బాధలు గమనించండి. అప్పుడప్పుడు మేము వచ్చిపోతుంటాం. అడవిజనాలు తెలుసుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. అలాంటి విషయాలు మేము తెలియజేస్తాం. బడి మంచి చెడ్డలు ఎవరు చూస్తున్నారు." అని అడిగింది గుర్రం. అందరూ చదువుకొన్న కోతి గురించి చెప్పారు. గుర్రం చిలకల నుండి సెలవు తీసుకొని అంతా అడవిలోపలకి వెళ్లిపోయారు.

"అదన్నమాట సంగతి! బడి గురించిన ఆశను ఈ కోతి ప్రేరేపించింది. ఈ కోతి ఆశబోతుది. తానేదో గొప్ప పనిచేస్తున్నాననే భ్రమలో ఉంది. మనం ఎంత వారించినా జనం వినరు. అనుభవంతో గాని పాఠం నేర్చుకోరు. ఏంజరుగుతుందో చూద్దాం" అన్నది గుర్రం.

ఇక్కడ కోతి బడిపెట్టేపనిలో మునిగిపోయింది. పాఠాలు చేప్పే ఉపాధ్యాయులను ఎన్నిక చేస్తున్నట్లు ప్రకటించింది. ఆసక్తి ఉన్నవాళ్లు ఉపాధ్యాయులుగా రావచ్చని చెప్పింది. ఈ విషయం అడవిలో అందరికీ తెలియజేసారు. ఆ రోజు సాయంకాలం పక్షిజనాలు, జంతుజనాలు గుంపులు గుంపులుగా వచ్చారు. కోతి అందరినీ వరుసల్లో నిలబెట్టింది.

ప్రధానోపాధ్యాయునిగా ఏనుగును ఎన్నిక చేసింది. పాటలు నేర్పడానికి కోకిలను, నాట్యం నేర్పడానికి నెమలిని, పరుగులు నేర్పడానికి గుర్రాన్ని, మాటలు నేర్పడానికి చిలుకను నియమించింది. జాడలు కనుక్కోడానికి కుక్కను, వేట నేర్పడానికి గండుపిల్లిని, లెక్కలు నేర్పడానికి కోడి పుంజును ఎన్నిక చేసింది. ఈత నేర్పడానికి బాతును, ఇంటి నిర్మాణానికి పిచ్చుకను నియమించింది.

బడిని ఊడ్చి శుభ్రం చేయడానికి పందిని, ఆయాగా కుందేలును నియమించింది.

కోతి అందరికీ వారం రోజులు శిక్షణ ఇచ్చింది. శిక్షణలో ఉపాధ్యాయులకు పెద్ద సందేహం వచ్చింది. అందరికీ అన్ని విద్యలు నేర్పాలా? లేక ఎవరికి అవసరమైంది వారికి నేర్పాలా?

అవసరాలు, ఇష్టాలతో సంబంధం లేకుండా అందరికీ అన్ని విద్యలు నేర్పాల్సిందేననీ, మనుషుల పిల్లలు అన్నీ నేర్చుకొంటారనీ కోతి చెప్పింది. మరుసటి రోజు బడి ప్రారంభమైంది.

పక్షిపిల్లలు, పిల్ల జంతువులు ఎగురుకొంటూ నవ్వుకొంటూ వచ్చి కూర్చున్నాయి. కొత్త బడి చాలా సందడిగా ఉంది. ఒంటె పిల్లలు, ఏనుగు పిల్లలు పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ అందరి కంటే ముందు కూర్చున్నాయి. సింహాలు, పులులు తమ పిల్లల్ని భుజాలమీద ఎక్కించుకొని వచ్చి దింపాయి. మేకలు జింకలు ఆవులు గుర్రాలు తమ పిల్లల్ని తీసుకొని వచ్చి టీచర్లకు అప్పగించి వెళ్లాయి. కోతిపిల్లలు పక్షిపిల్లలు చెట్లమీద ఎగురుకుంటూ వచ్చి కిందికి దిగాయి.

ఇది నాచోటంటు సింహంపిల్ల నక్కపిల్లను లాగిపడేసింది. దూరంగా జరగమంటూ జింకపిల్లను పులిపిల్ల గుర్రుగా చూసింది. బురదలో పొర్లి వచ్చిన పంది పిల్లను, నల్లగా ఉన్న పిల్లదున్నను

**తరువాయి 30వ పుటలో....**

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# 'మాలపల్లి'- ముందూ వెనుకా రచనలు.

## 'చెప్పులు కుడుతూ కుడుతూ', 'చెదిరిన సమాజం' 'పంచతంత్రం';తులనాత్మక అధ్యయనం

**రా**మానాయుడువంటి భూస్వాములు ఉదారంగా వ్యవహరించటంతోపాటు, రామదాసువంటి హరిజనులలో ఆత్మ జ్ఞానవివేచనను(అచల మతం) గుర్తిస్తే- ఉన్నవాళ్ళు, లేనివాళ్ళ మధ్య ఘర్షణలు, ఇతర మతాల చొరబాటు తగ్గేవి అని'మాలపల్లి' నవల సూచిస్తుంది.' సహాయనిరాకరణోద్యమాలు, కార్మికోద్యమాలు, ధర్మకన్నాల వంటి ప్రజాఉద్యమాల ఫలితంగా స్వాతంత్ర్యం లభిస్తుంది. ఖైదీలు విడుదలవుతారు. వయోజన వోటింగు ద్వారా ప్రజాప్రతినిధుల ఎన్నికవుతారు. రామదాసు కూడా జైలు నుండి విడుదలై తన గ్రామానికి వస్తాడు. రామానాయుడు తన యావదాస్తిని దళితుల అభ్యుదయానికి సమర్పించి రామదాసుని గ్రామంలోనే వుండి సంగదాసు చేసిన కృషిని కొనసాగించమని కోరతాడు. కాని రామదాసు నిరాకరించి అడవుల కేగుతాడు. ఈ విధంగా అనేకానేక అంశాలు అల్లుకుపోయిన నేపథ్యంలో చివరకు భూస్వాముల మదం అణిగిపోయి వారు తమ సర్వస్వాన్ని దళితుల అభ్యుదయానికి, గ్రామాభ్యుదయానికీ సమర్పించుకొని, గ్రామసేవకి అంకిత మయినట్లుగా చెప్పబడింది'.అని వికీపీడియా ఈ నవల ముగింపును చిత్రిస్తుంది.అదే సమయంలో, ఇదే అంశం మీద ఆచార్య రంగా రాసిన నవల 'హరిజన నాయకుడు' సవర్ణుల పొగరుమోతుతనాన్ని ఎండగడుతూ, క్రైస్తవుల పెంపకంలో పెరిగి ఉపాధ్యాయురాలిగా వచ్చిన అరుణ, హిందూ ఉదారవాదుల ప్రభావంతో యువ హరిజన నాయకుడు బసవలింగాన్ని పెళ్ళాడటం, జాతీయోద్యమంలో పాల్గొనటం కథావస్తువు.




కాని, నాటిసమాజంలో పాతుకుపోయిన ఈ సమస్యలోతులను-1830లలో అదే గుంటూరు- (నేడు) ప్రకాశంజిల్లాలలో, క్రైస్తవమత వ్యాప్తికి దారితీసిన పరిస్థితులు- 1899లో ప్రచురించిన క్రైస్తవ ప్రచారకుని భార్య క్లౌ రచన (వివిన మూర్తి అనువాదం- మనసు ఫౌండేషన్ ప్రచురణ 2014) 'చెప్పులు కుడుతూ కుడుతూ' పరిశోధనాత్మకంగా వివరించింది. అగ్ర, దళిత వర్ణాలను ఒకనాడు కలిపిన సంబంధాలు, క్రమంగా ఆర్థికమైన తారతమ్యాలు పెరిగి, వర్ణవివక్షకు దారితీసిన క్రమం తెలియచేసే పురాగాథలు , ఆచారాలు; హరిజనులలో వ్యాపించిన ఆచల మతంలో నజరయ్యలాంటి గురువుల ఆదర్శం క్షీణించి, వెర్రితలలు వేయటం, క్రైస్తవంలో సాత్విక భావాలు, ఆ మతంలో చేరి, డప్పులుకొట్టటంలాంటి కులవృత్తులు మానేసిన వారిని, అగ్రవర్ణాలు వెలివేసి, మంచినీళ్ళు వంటి కనీస వసతులకు దూరం చేయటం; విదేశీ క్రైస్తవమతప్రచారకులు మతం మారిన వారికి అండగా నిలబడటం, నాడు ప్రభుత్వం చేపట్టిన బకింగ్‌హాం కాలువ తవ్వకం పనులలో ఉపాధికల్పించటం, చదువు సంధ్యలు చెప్పించి ఉద్యోగాలు ఇప్పించటం; వెలివేతలో ప్రధానపాత్ర వహించిన ఉద్యోగస్తుడు కరణాన్ని, ప్రభుత్వ అధికారులు జైలుకు పంపటం, అవమానంతో అతడు కుంగి కృశించి మరణించటం; ఈ వెలితంతులో పరోక్షపాత్ర వహించిన ధనికులు నాయుడు కుటుంబం మారు మనసు పొందటం- ఈ చరిత్రను 'చెప్పులు కుడుతూ కుడుతూ' కళ్ళకు కడుతుంది.' 'మాదిగలు భూములు సంపాదించుకుని, స్వతంత్రంగా వ్యవసాయం చేసుకుంటే, తొందరలోనే తమపిల్లలను చదివించుకోగలరు. తమను దాసులుగా అణచిపెట్టి ఉంచాలంటే, శూద్రులకు మిగిలిన మార్గం ఒక్కటే. మాదిగలు సొంత భూములు సంపాదించుకోకుండా అడ్డుతగలటమే. అందువల్ల పంటలు పండించాలంటే చాలా కష్టపడాలి. అప్పటివరకు వారికి తెలిసిన చర్మపరిశ్రమే జీవనాధారం. చాలా మొరటుబారిన పాతపనిముట్లతోనే పనిచేస్తున్నారు. ఆ వృత్తిలో నైపుణ్యం పెంచడానికి మిషన్ కృషి చేస్తుంది' భూమి, వృత్తి సమస్యలను స్పష్టం చేస్తూ, క్రైస్తవం వారిని ఆత్మన్యూనతనుండి బయటపడేసి, ముందుకు సాగే దైర్యమిచ్చింది' అని రచనను ముగిస్తారు.

'కొత్తమతంలో చేరిన మాదిగలు తప్పనిసరిగా నాలుగు నియమాలను పాటించేవారు: సారాయి ముట్టకపోవటం, చచ్చిన గొడ్డు మాంసం మాంసాన్ని తినకపోవటం, ఆదివారాన్ని విశ్రాంతి దినంగా ప్రార్థనా దినంగా పరిగణించటం, అన్యదేవతల పూజల్లో పాల్గొనకపోవటం. మొదటి నియమాన్ని వదిలేస్తే మిగిలిన మూడూ- క్రైస్తవులకు ఊళ్ళో వాళ్ళతో చిక్కులు తెచ్చిపెట్టాయి. పోలేరమ్మ ఎదుట బలిపశువును నరకలేదని, అమ్మవారి జాతరల్లో డప్పు వాయించలేదని, నూర్పిళ్ళ రోజుల్లో సైతం ఆదివారం పని చేసేందుకు ఒప్పుకోలేదని- రైతులకు, కరణాలకు, మునసబులకు కోపాలు వచ్చాయి. వేధింపులు, బహిష్కరణలు ప్రారంభమయ్యాయి.ఆ హింసకు ఎదురొడ్డి నిలిచారు క్రైస్తవులు' అని ఈ రచనమీద సమీక్ష పేర్కొంటుంది.

కంచికచర్ల కోటేశు, కారంచేడు, చుండూరు- వగైరా పరిణామాల










నేపథ్యంలో, ఆత్మవిమర్శకు, 'మాలపల్లి' కంటే ఈ రచన ప్రాసంగికత చాలాఎక్కువ. నాడు భాజపా నాయకుడు బంగారు లక్ష్మన్, 'చుండూరు ప్రాంతంలో దళితులందరూ క్రైస్తవులుగా మారిన విషయం వాస్తవమే. చుండూరు దుర్ఘటనకు మూలం హిందూ క్రైస్తవ వివాదం కాదు. ఈ దారుణాలను సవర్ణుల-హరిజనుల మధ్య ఘర్షణలుగా చూడాలి కాని, హిందూ-క్రైస్తవ దృష్టితో చూడటం తగదు' అని హెచ్చరించటం గుర్తు తెచ్చుకోవాలి (లక్ష్మణ్ స్మారక సంచిక . సామాజిక సమరసత ప్రచురణ. 2015).

మనలో అంటరానితనం లాగే , కవలపిల్లలను అడవిలో పారేసే దురాచారం, అటువంటివారిని చేరదీసిన క్రైస్తవ మతం, నాటి ఆఫ్రికన్ సమాజాన్ని ఎలా కుదిపివేసిందో తెలియచేస్తూ,1957లో ఆంగ్లంలో వచ్చిన ప్రసిద్ధ ఆఫ్రికన్ నవల things fall apart, 'చెప్పులు కుడుతూ కుడుతూ'ను గుర్తు చేస్తుంది. దీన్ని అనువదించి 'చెదిరిన సమాజం'గా జనసాహితి 2003లో ప్రచురించింది. 'లాటిన్ అమెరికన్, ఆఫ్రికన్ దేశాలలోని పరిస్థితులు నేడు మనదేశంలో పునరావృతమౌతున్నాయి' అని సంపాదకులు హెచ్చరిస్తారు. ఈ దురాచారాన్ని సూటిగా ప్రస్తావించలేదు!

ఈ సందర్భంలో గుర్తు తెచ్చుకోవలసిన మరో నవల బొజ్జా తారకం 'పంచతంత్రం'.

'మాలపల్లెకు, జమీందారీ కుటుంబానికి మధ్య ఘర్షణ ప్రధాన ఇతివృత్తంగా సాగే ఈ నవలలో ముఖ్యపాత్రలు మూడు. కాపు కులస్తుడైన జమీందారు విశ్వనాథం, మాల యువకుడు విద్యార్థి నాయకుడు అయిన సూరన్న, మిలట్రీలో పనిచేసి వచ్చిన మరో మాల కులస్తుడు సుబ్బారావు. సూరన్న బాల్యం నుంచి అనేక అవమానాలకు, వివక్షకు గురవుతూ చివరికి తన కృషితోచైతన్యంతో విద్యార్థి నాయకుడుగా ఎదిగిన తీరును చాలా బాగా చిత్రించారు.

సుబ్బారావు మాలపల్లెకు నైతిక ధైర్యాన్నిస్తూ, సూరన్నను కాపాడుకుంటూ దళిత ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తాడు. పాలేర్లుగా,వెట్టిచాకిరీ చేసే కూలీలుగా, అంటరానివారిగా అవమానాలకు, అణచివేతకు గురవుతూ బతుకుతున్న దళితులు విద్యావకాశాల వల్ల, ఉద్యమ చైతన్యం వల్ల, 'స్వాతంత్ర్యం' తెచ్చిన వెసులుబాటువల్ల విద్యావంతులుగా, నాయకులుగా రూపొందడం, జమీందార్ల అక్రమ ఆక్రమణనుండి భూముల్ని తిరిగి తీసుకోవడం, జమీందారు ఆస్తులకు అండగా ఉన్న రెవిన్యూ పోలీసు వ్యవస్థను వ్యతిరేకించడం వంటి ఘటనలన్నిటినీ అత్యంత వాస్తవికంగా మన కళ్ళ ముందు నిలిపారు రచయిత' అంటారు సమీక్షకులు.

అయితే ప్రభుత్వ భూములను కలిపేసుకుని భూస్వామిగా మారిన విశ్వనాథం, ఊరికి, తన పొలంలోంచి రోడ్డు వేయటాన్ని అడ్డుకుంటాడు. తనిఖీకి వచ్చిన ఇంజనీర్ చెప్పేదాకా అది విశ్వనాథంకబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమి అని చదువుకున్న సూరన్నలకు తెలియదు. దళితులకు కావలసిన భూమి చదువు గూర్చి, రచయిత ఇక్కడ, అంతకు ముందు తన రచన 'నేల, మూడు నాగళ్ళు' లో, 'సలహా' అధ్వర్యంలో జరిగిన ఇబ్రహీంపట్నం భూపోరాటంలో పాల్గొన్న అనుభవంతో నొక్కిచెపుతాడు.

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సంయోజకుడు అంగ్లసాహిత్యంలో ప్రొఫెసర్ విజయకుమార్ ఆఫ్రికన్ నవల things fall apart ను పరిచయంచేసే ప్రసంగం యూట్యూబ్‌లో దొరుకుతుంది. పోయిననెల, ఈయనా, సంఘపరివార్ మేధావి రామమాధవ్ Hindutva-A Pardigm shift పుస్తకావిష్కరణకు ముఖ్య అతిధిగా వచ్చారు. ముఖపుస్తకంలో ఆహ్వానం చూసినపుడు, విజయకుమార్ చేత things fall apart మీద ఉపన్యాసం పెట్టించండి, 'చెదిరిన సమాజం'లో సంపాదకులు అన్నట్లు అవే పరిస్థితులు నేటికీ కొనసాగుతున్నాయి- అని సలహా ఇచ్చాను. **ఇదే సమయంలో జరుగుతున్న 'మాలపల్లి' వందేళ్ళ సభలు- ఈ సమస్యమీద వచ్చిన ఈ రచనలను తులనాత్మకంగా అధ్యయనం చేయకుండా, ఎవరి పాఠం వారు చెప్పుకుంటూ ముందూ వెనుకా వచ్చిన రచనలను విస్మరించారు!**

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## <u>అడుగుజాడలు ఆనవాళ్లు</u>-<u>13</u>

# నా చిట్యాల - నోముల యాత్ర

**2010**వ సం॥లో నేను పురావస్తుశాఖలో స్థపతిగా పనిచేస్తున్నప్పుడు, నల్లగొండ జిల్లా, నకిరేకల్ మండలం, పాలెం గ్రామంలో, కాకతీయుల కాలానికి చెందిన నరసింహస్వామి ఆలయాన్ని ఊడదీసి ఆధునిక పునాదులపై మళ్లీ నిర్మించాను. అదే మండలం నోముల గ్రామానికి చెందిన గుండంరాజు కిషన్‌రావు గారు (పశు సంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్ గా రిటైరైనారు) ఆ ఆలయ అనువంశిక ధర్మకర్త. ఆ ఆలయం ఆలనా పాలనా చూచుకొంటుండేవారు. ఇప్పుడు కూడా చూస్తున్నారు. నేను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా పనిచేసినపుడు అదే సంస్థ సీఈవోగా ఉన్న జి. కళ్యాణ్ కుమార్ (కిషన్ రావు గారి కుమారుదు) కోరికపైన, పురావస్తుశాఖ రక్షిత కట్టడమైన ఆ నరసింహస్వామి ఆలయం పల్లమై పోగా, ఆ శాఖ నిధులు, కొంత కళ్యాణ్ కుమార్ అందించిన మరి కొన్ని నిధులతో ఆలయాన్ని ఊడదీసి, ఎత్తైన బేస్మెంట్ మీద యధావిధిగా పునర్నిర్మించటానికి దాదాపు నాలుగేళ్లు పట్టింది. దాంతోపాటు పక్క ఊరు గుడివాడలోని కాకతీయుల కాలపు శివాలయాన్ని కూడా ఊడదీసి మళ్లీ కట్టాను. ఈ నాలుగేళ్లలో చుట్టుపక్కల ఊళ్ల వాళ్లు ఎంతో మంది వచ్చి పాలెం ఆలయ పునర్నిర్మాణ పనుల్ని చూచి పోతుండే వాళ్లు. ఆ క్రమంలోనే నోముల గ్రామంలో పూర్తిగా శిథిలమైన నరసింహాలయాన్ని కూడా బాగు చేయాలని, కళ్యాణ్ కుమార్ 2011లో నన్ను అక్కడికి తీసుకెళ్లారు. చాలా నిధులు కావాల్సి వచ్చి, ఆ పని ఆగిపోయింది.

సరిగ్గా పదేళ్ల తరువాత కళ్యాణ్ కుమార్, చిక్కు శ్రీనివాస్, విక్రమ్ రెడ్డి 'ఆ ఆలయాన్ని ఊడదీసి మళ్లీ కట్టాలి, ఒకసారి నోముల కొస్తారా' అని పిలవటమే ఆలస్యం, నేను హైదరాబాదులో బయలుదేరాను. చిట్యాల, నార్కెట్పల్లి దాటి, వివేరా హోటల్లో టిఫిన్ కోసం ఆగాను. సంచిలోని నల్లగొండజిల్లా శాసనాలు మొదటి సంపుటాన్ని తిరగేస్తున్న నాకు, చిట్యాల శాసనం కనిపించింది. అది క్రీ.శ. 1253 నాటి కాకతీయ గణపతిదేవుని, గజ సైన్యాధ్యక్షుడు, బ్రహ్మరాక్షస గంగయ సాహిణి వేయించిన శాసనం. ఆ శాసనాన్ని చూడాలనిపించింది. టిఫిన్ ముగించుకొని, నేను, నా శిష్యుడైన ఆ హోటల్ జీఎం, ప్రసన్ కలిసి చిట్యాల సాక్షి విలేకరి వేణుకు ఫోన్ చేసి ఆ శాసనం ఆచూకీ అడిగాం. వేణు ఆ శాసనం ఉరుమల్లో దారిలో, ఎంపిడివో ఆఫీసు పక్క దారిలోని ముత్యాలమ్మ గుడి దగ్గర ఉండేదని, దాన్ని చిట్యాల మునిసిపల్ ఆఫీసు దగ్గరకు చేర్చారని చెప్పాడు. నేను బయలుదేరి ముత్యాలమ్మ గుడి దగ్గర కెళ్లాను. అన్నీ ముళ్ల చెట్లు, పొదలు. అడవిలా పెరిగింది. కారుదిగి అటూఇటూ చూచే సరికి రైలు కట్ట పక్కన గుబురు చెట్ల కింద ఇద్దరు యువకులు మద్యం మత్తులో మాట్లాడుకోవటం వినిపించింది. దగ్గరకెళ్లి ఇక్కడ ఒక పాడు బడిన దేవాలయం ఉండాలి, ఎక్కడా అని అడిగాను. ఒకతను వచ్చి కంపచెట్లలో దాక్కొని ఉన్న కాకతీయ ఆలయ మండప స్థంభాలు చూపించాడు. ఎలాగో నేను, నా డ్రైవర్ ముళ్ల కంపల్ని తొలగించుకొంటూ వెళ్లి, మండపం దగ్గరికి ప్రవేశించాం. విఠలాచార్య సినిమా గుర్తుకొచ్చింది. పిచ్చి చెట్లు, చేమల్ని తొలగించగా ఒక పీఠం, దానిపైన నెమలి బొమ్మ, పక్కనే విరిగిన వేణుగోపాల, కార్తికేయ, నంది బొమ్మలు, ప్రభామండల శకలం కన్పించాయి. నాకు నవనిధులు దొరికినంత ఆనందమేసింది. అపురూప శిల్పకళతో ఉట్టిపడుతున్న ఆ శిల్పాలు కాకతీయుల కాలానివి. చుట్టుపక్కల శుభ్రం చేశాను. శిల్పాలు మరింత బాగా కనిపించాయి. నాకళ్లల్లో కాంతులు విరజిమ్మాయి. ఫొటోలు తీసుకొని చిట్యాల కొచ్చాం.



'చిట్యాల'లోని మండపం

సాక్షి విలేకరి వేణు కనిపించి, మునిసిపల్ ఆఫీస్ వెనుకున్న ఆ శాసనాన్ని చూపించాడు. ఒక షాపు పక్కనే నీళ్ల కుళాయికి ఆనుకొని ఉంది. 768 ఏళ్ల నాటి శాసనం. నల్ల శానపు రాతిపై కాకతీయుల కాలపు అక్షరాలు ఒద్దికగా పెళ్లికూతురులా ముచ్చటగా ఇమిడి ఉన్నాయి. తడిమి చూశాను. చదివి మురిశాను. ఆ శాసనంలో గంగయ గజసాహిణి, ముత్తాత, తాతల పేర్లున్నాయి. తాత, ధన్వుడు, బౌద్ధుడనీ, అతని కొడుకు ధసువుడు చిట్యాల పాలకుడనీ, గుజరాత్ లోని ద్వారకానగరాన్ని పాలిస్తున్న శ్రీకృష్ణునికి 'చిట్టాలు' అనే గ్రామాన్ని దానం చేసిన సంగతి నమోదు చేయబడింది. నాతోపాటే ఉన్న దాస్యం వెంకట సురేందర్, ఆ శాసనాన్ని పైకి లేపి, మునిసిపల్ కార్యాలయంలో, ఒక పీఠంపై నిలబెట్టి, ఆ శాసన వివరాలను ఒక శిలాఫలకంపై ఇప్పటి అక్షరాల్లో పెట్టటానికి ఆయే ఖర్చును భరిస్తాననన్నాడు. ఆ పని చేయాల్సిన పురావస్తుశాఖ గుర్తొచ్చింది. నాకు నేను సర్ది చెప్పుకొని, నోముల గ్రామానికి బయలు దేరాను.

నోముల చేరగానే ఆ ఆలయ కార్యకర్తలు చిక్కు శ్రీనివాస్, గుర్రం శివశంకర్ రెడ్డి, పెద్దులు నన్ను సాదరంగా ఆహ్వానించారు.


'చిట్యాల'లోని మండపం

ఆలయం పక్కనే ఉన్న పడిపోయి ఉన్న విగ్రహాన్ని పైకి లేపాను. ఆశ్చర్యం! ఒకే విగ్రహం, ముగ్గురు మూర్తులు. ఒకే శరీరం, మూడు తలలు, నాలుగు చేతుల్లో శూలం, శంఖం, స్రుక్, అక్షమాలలను ధరించి నిలబడి ఉన్న ఆ విగ్రహం అరుదైన త్రిమూర్తి విగ్రహం. ఇంత వరకు తెలంగాణలో బయల్పడిన తొలి త్రిమూర్తి విగ్రహం. భిన్న మతాల మధ్య వైరుధ్యాలను తొలగించ టానికి హరి హరాధనను ప్రోత్సహించిన కాకతీయ గణపతి దేవుని కాలంలో బ్రహ్మను కూడా చేర్చడం గమనించాల్సిన విషయం. మట్టిగొట్టుకొన్న ఆ త్రిమూర్తి విగ్రహాన్ని నీళ్లతో కడిగి శుభ్రం చేశాను.

అక్కడే ఉన్న భైరవ శిల్పం, గర్భాలయంలో కళాత్మకంగా తీర్చిదిద్దిన యోగ నరసింహ విగ్రహాలను పరిశీలించాను. ఆలయం చుట్టూ, ముందూ ఉన్న మట్టిని తొలగించగా, రంగ మండప నేలరాళ్లు, రంగశిల బయల్పడినాయి. గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. ఇదేమిటని అడిగారు. గర్భాలయంలో మూలవిరాట్టుకు చేసే షోడశోపచారాలను అంగ భగమని, రంగ మండపంలో నాట్యగత్తెలు, దేవ దాశీలు, స్వామివారికి అర్పించే నర్తనాన్ని రంగభోగమని అంటారనీ, రెండింటినీ కలిపి అంగరంగభోగాలంటారని, ఇందుకోసం, స్వామి వార్లకు గ్రామాలు, పొలాలు, ధనాన్ని భక్తులు దానం చేసిన వివరాలు అనేక శాసనాల్లో ఉన్నాయని వారికి వివరించినంతసేపు, గ్రామస్తులు శ్రద్ధగా విన్నారు. బయల్పడిన రంగశిలపై 750 ఏళ్ల నాడు ఎందరో ప్రసిద్ధ నర్తకీమణులు నాట్యమాడారని చెప్పగా, కనుబొమ్మలు పైకెగరేశారు.


త్రిమూర్తివిగ్రహం - నోముల

“సార్ మా ఊళ్లో మరికొన్ని శిల్పాలున్నాయి. వాటి వివరాలు చెప్పండ'ని తీసుకెళ్లారు. నేను, నాతో దాదాపు 20 మంది గ్రామస్తులు. ముందుగా ఒక మేకల దొడ్డి దగ్గరకు తీసుకెళ్లారు. పక్కనే రెండు


నోములలోని రంగ మండపం

నల్ల రాతి శిల్పాల ఆనవాళ్లు కనిపించాయి. పిచ్చి మొక్కలు, పచ్చగడ్డిని తొలగించాం. క్రీశ. 13వ శతాబ్దిలో, పక్క గ్రామాల పశువులు అక్రమ ప్రవేశాన్నో, శత్రువులనో, దొంగలనో ఎదుర్కోవటంలో వీరమరణం పొందిన వీరుల శిల్పాలు. ఇద్దరూ మంచి దిట్టంగా ఉన్నారు. యుద్ధంలో పాల్గొన్న దృశ్యానికి అద్దం పడుతున్న ఈ వీరుల శిల్పాలను వీరగల్లులంటారు. ఆ శిల్పాల్ని మరింత దగ్గరగా చూశారు వారందరూ. ఇంతలో 'సార్, పక్కనే కంపలో మరో విగ్రహముంది'. 'చూద్దాం రండి' అన్న గొంతుతో కలసి, అందరం అటు వెళ్లాం. రోడ్డు వేసినపుడు అడ్డంగా ఉందని ఒక శిల్పాన్ని అటువైపుకు తిప్పి


'నోముల'లో యోధుల విగ్రహాలు

పడేశారో ఏమో, దాన్ని ఇటు వైపుకు తిప్పగా, మరో వీరుని శిల్పం. పొలాల్లో మరికొన్ని వీరుల శిల్పాలున్నాయని తీసుకెళ్లారు. అక్కడ ఒక బండపైన నిలువెత్తు ఆంజనేయుడు. పక్కనే నాగరాజు, నాగరాణి శిల్పాలు. అవి క్రీ.శ. 16వ శతాబ్దినాటిది. ఒక్క నోములలోనే ఇన్ని


'నోముల'లో మరోయోధుల విగ్రహం

శిల్పాలు. వాటిలో వీరగల్లులే ఎక్కువ. ఇంతమంది మరణించిన ఆ ఊళ్లో పెళైన ఆడవాళ్లందరూ, తమ భర్తలు బాగుండాలి. ఎవరూ

మరణించకూడదని నోములు నోయటాన ఆ ఊరికి నోముల అని పేరొచ్చిందేమో అనిపించింది.

హైదరాబాదుకు తిరుగు ప్రయాణం. శిథిలాలయాలు, నిర్లక్ష్యంగా పడి ఉన్న శిల్పాలు దొరక్క పోతాయా అని ఆలోచిస్తుండగా, చిట్యాల సాక్షి విలేకరి వేణు నుంచి ఫోన్. 'సార్, పెద్దకాపర్తి దారిలో హైవేపక్కన ముళ్ల పొదల్లో ఒక మండప ముంద'న్నాడు. మళ్లీ హుషారొచ్చింది. ఆ శిథిలాలయాన్ని చూచి ఎవరైనా పదిలం చేసేవారు దొరక్కపోతారా అనుకుంటూ కారెక్కాను. అనుకొన్నట్లుగా చిట్యాల దాటిన 5 కి.మీ.ల తరువాత హైవే పైన


హైవే పక్కనున్న 'పెద్దకాపర్తి'లోని కళ్యాణమండపం

పెద్దకాపర్తి బోర్డు కనిపించింది. పదేళ్ల క్రితం జాతీయ రహదారిని విస్తరిస్తుండగా, ఒక కాకతీయ ఆలయం నెత్తిమీద నుంచి కొత్త రోడ్డు వేస్తుండగా, నేను చూచి, బాధపడిన సంగతి గుర్తొచ్చింది. తరువాత రహదారిని మరింత విస్తరించినపుడు, ఆ ఆలయాన్ని ఊడదీసి, దేవాదాయ శాఖకు నష్టపరిహారం కూడా ఇచ్చారని తెలిసింది. ప్రభుత్వం కదా. తీరిక దొరక్క ఆ ఆలయ విడిభాగాలను అలానే గాలికొదిలేశారు. దాని ముందు మండపం దూరంగా ఉండటాన బతికిపోయింది. కప్పు జారిపడి, చుట్టూ ముళ్ల కంప, చెట్లు పెరిగి, పోలీసుకు భయపడి దాక్కున్న దొంగలా బిక్కుబిక్కుమంటూ కనిపించింది. నాతోపాటొచ్చిన సోమశిల ఎల్లయ్య, కంపన పక్కకు జరుపుతూ పోగా, నేను, దాస్యం వెంకట సురేందర్ ఆ మండపం దగ్గరకెళ్లాం. ఒకప్పుడు ఊడదీసిన శివాలయంలోని శివపార్వతుల పంచలోహ విగ్రహాలకు వైభవోతంగా జరిగిన కళ్యాణోత్సవానికి వేదికగా హారతులందుకొన్న ఆ కళ్యాణ మండపం, స్మశానంలో కప్పులేని కాటికాపరి గూటిలా తోచింది. కాల 'ధర్మం' ఇలా


'నోముల'లోని రంగ మండపం

ఉంటుందనుకొంటూ రాతి దూలాల్ని, స్థంభాల్ని ఒకసారి స్పృశించి, సహనం నశించి, వెనక్కి మళ్లీ బాధతో కారెక్కాను. చిన్న కాపర్తి దాటి బోయగుబ్బ గ్రామానికెళ్లాను. ఊరి చివర, పొలాల్లో నిర్లక్ష్యానికి నిలువుటద్దాల్లా నైరాశ్యం పోగుపోసుకొన్న ఒక శివాలయం, మండపాలను చూచి, చలించిపోయాను.

శివాలయం మహామండపం ఆనవాళ్లు కోల్పోయింది. శివుని ముందుండాల్సిన నంది, తావుదప్పింది. పొలాల్లో ఆలయం, మండపం ఆలనా, పాలనా లేక, గబ్బిలాలకు నెలవై, ఇలా ఉండేకంటే, శతృమూకల చేతిలో విధ్వంసమైనా బాగుండేదేమో అని మౌనంగా రోదిస్తున్నాయి. చూడటానికొచ్చిన నాలాంటి వాళ్లను బాధిస్తున్నాయి. జీర్ణోద్ధరణ కోసం ఎదురుచూస్తున్నాయి. వారసత్వం వరస తప్పటం పట్ల ముక్కు మీద వేలేసుకొంటున్నాయి.

---

**25 వ పుట తరువాయి...**

## చదువుకున్న కోతి

ఉపాధ్యాయులు దూరంగా కూర్చుండబెట్టారు. విక్కీ మాగీలు ఒక దగ్గర కూర్చుని ఉంటే వారిని విడదీసి దూరంగా కూర్చుండబెట్టారు. విక్కీ ఉపాధ్యాయులను కోపంగా చూసాడు. కాకిపిల్లకు కోపం వచ్చి చెట్టెక్కి ఉపాధ్యాయుల మీద రెట్టవేసింది. కోతిపిల్ల కాయలు కొరికి ఆవుదూడలముందు పడేసింది. ఈ కాయలు ఎందుకు కొరికి పడేశావంటూ ఏనుగు ఆవుదూడను తొండంతో కొట్టింది. ఆవుదూడ ఏడ్చుకొంటూ ఇంటికి పరుగుదీసింది. దీంతో మిగిలిన పిల్లజంతువులు పక్షిపిల్లలు అమ్మకావాలి అంటూ ఏడుపు లంకించుకున్నాయి. ఉపాధ్యాయులు సముదాయిస్తూ ఉంటే మిగిలినవ గిచ్చుకొంటూ, కొరుక్కొంటూ ఒక చోట చూర్చోకుండా అటూ ఇటూ పరుగులు తీస్తున్నాయి. ఉపాధ్యాయులకు విసుగుపుట్టింది.

ప్రధానోపాధ్యాయులైన ఏనుగు గారికి ఎక్కడలేని కోపం వచ్చింది. ఒక చెట్టు కొమ్మ విరిచి తొండంతో పట్టుకొని పిల్లల వీపులు పగలగొట్టింది. పిల్ల జంతువులు పక్షి పిల్లలు భయంతో పరుగులు తీసాయి. ఇదే సందని నిక్కీ మాగీల దూరంగా పారిపోయి దాక్కున్నారు. మిగిలిన పిల్లల్ని నువ్వు ఇక్కడ నువ్వు అక్కడ కదలకుండా కూర్చోవాలి అంటూ కూర్చుండబెట్టారు. పిల్లలు గజగజ వణుకుతూ భయభయంగా ఏనుగును చూస్తూ కూర్చున్నాయి.

ఇంతలో కొన్ని పిల్లజంతువులు అక్కడ ఒంటికి పోసాయి. కొన్ని దొడ్డికికూర్చున్నాయి. అంతా గబ్బు గబ్బుగా తయారైంది. పంది చీపురు తెచ్చి మొత్తం ఊడ్చింది. కుందేలు వాటి ముద్దికడిగి కూర్చుండ బెట్టింది. ఆ రోజంతా అలాగే జరిగిపోయింది. కొన్ని పిల్లజంతువులు ఆకలి అని ఏడ్చాయి. కొన్ని మంచినీళ్లు కావాలి అంటూ గోల చేసాయి. మొదటిరోజు పాఠాలు ఏమీ జరగలేదు.

వచ్చే సంచికలో: **బడి కష్టాలు**

యలమర్తి అనూరాధ
9247260206




**ఆ**కాశం పలకపైన సిందూర వర్ణపు బలపంతో 'రవి' అక్షరాలు దిద్దుతున్న సమయంలో 'విద్య' వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఉలిక్కిపడి నిద్ర లేచింది సరస్వతి. తల్లి హృదయం తల్లడిల్లింది. 'పిల్ల ఎంత బెంబేలు పడితే ఇలా నిద్రలో కూడా ఏడుస్తుంది' తనలో తానే అనుకొంది.

"భయంలేదు పడుకోమ్మా! నేను పక్కనే ఉన్నానుగా" ధైర్యం చెబుతా విద్యను దగ్గరకు తీసుకుంది.

"అమ్మా! నాకాస్కూలు వద్దమ్మా!" కలవరిస్తోంది పదే పదే.

"వద్దులే! నేను పంపించను. నాన్నగారితో సర్దిచెబుతానుగా" వీపునిమురుతూనే పాప చెవిలో గుసగుసలాడింది.

నిద్రలో ఉన్న విద్యకు ఆ మాటలు చేరాయోలేదో తెలియదు కానీ అప్పటి నుంచీ గొడవ చెయ్యకుండా పడుకుంది.

సరస్వతికి మాత్రం నిద్ర పట్టటంలేదు. ఈ సమస్యకు పరిష్కారం ఎలా? ఇదే ఆలోచన. ఆ ఆలోచనలలో కొట్టుకుపోతూ ఎప్పుడో తెల్లవారురఝామున నిద్రలోకి జారింది ఆమెకు తెలియకుండానే.

♦ ♦ ♦

నూజివీడు జమిందారు వంశంలో చివరగా మిగిలినవాడు శ్రీ రఘువీరప్రతాపరాజు. ఆనాటి సంపదలు అన్నీ కరిగిపోయినా ఈనాడు కోటీశ్వరుడుగా మిగిలాడు. విదేశీ సంస్కృతి అంటే అతనికి తగని మక్కువ. వాళ్ళ పద్ధతులు ఎంతో బాగుంటాయని తెగ మురిసిపోతుంటాడు. అతని భార్య సరస్వతి దీనికి పూర్తిగా విరుద్ధం. భారతమాత ముద్దుబిడ్డగా పెరగాలన్నదే ఆమె ఆశ. నెమ్మదిగా సాగే నదిలాంటిది ఆమె స్వభావం. ఆ చేతికి నరం లేదంటారు. సాక్షాత్తూ అన్నపూర్ణ మనసే. మన దేశమన్నా, మన సంప్రదాయాలన్నా ఎంతో ఆరాధన. ఒక్కగానొక్క బిడ్డ విద్యావతి. తనని తన భావాలకనుగుణంగా పెంచాలని ఆమె తాపత్రయం. కానీ అనుక్షణం అడ్డుతగిలే భర్త. అతని భావాలు ఆమెను అడుగు కూడా ముందుకు వేయనివ్వటం లేదు.

కానీ విద్య అలా కాదు. చిన్నతనమే అయినా తనకేంకావాలో తనకు తెలుసు అన్నట్లు మాట్లాడుతుంది. అందరూ తాత, అత్తలతో మాటలు ప్రారంభిస్తారు. విద్య మాత్రం 'అమ్మ' పదంతోనే పదాలకు శ్రీకారం చుట్టింది. దాన్ని 'మమ్మీ'గా మార్చాలని ఆ తండ్రి ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. 'అమ్మ' పిలుపులోని మాధుర్యాన్ని వదలకపోగా "మమ్మీ ఏమిటి... ఏం బాగోలా" అనేది ఖచ్చితంగా. "సరస్వతీ! నీకిష్టమయింది. పిలిపించుకుంటున్నావు. కనీసం నన్నయినా 'డాడీ' అని పిలవమని చెప్పవచ్చుగా!

డాడీ! అంటే ఎంత గొప్పగా ఉంటుంది! ముందు నీకు అలా అనిపిస్తే కదా దానికి చెప్పటానికి' అని ఎప్పుడూ సాధిస్తూనే ఉంటాడు భర్యను.

'నాన్న' అన్న పిలుపులో ఉన్న కమ్మదనం ఒకరు చెబితే అర్థమయ్యేది కాదు. అలా పిలిపించుకొనే వాళ్ళకే అందులో ఉన్న అనుభూతి తెలుస్తుందని మిన్నకుండిపోయేది భర్తకు భయపడి.

'అలాగే!' అన్నట్లు తల ఊపేది.

విద్యకు ఇవేమీ పట్టేవి కావు. అలనాటి ప్రహ్లాదుడు 'హరి' నామం వదలనట్లు అమ్మ.. నాన్నల పిలుపులను పదే పదే పిలిచేది.

"నాన్నా!" అంటూ దరిచేరిన చిన్నారిని దూరం నెట్టేయాలని చూసేవాడు రఘు. కానీ గుమ్మడి పండులా ముద్దులొలకబోస్తూ తన ముందు నిలబడ్డ విద్యను తిరస్కరించలేకపోయేవాడు. ఈ సారికి క్షమించేద్దాం అంటూ దగ్గరకి తీసుకొనేవాడు.

దగ్గరగా కూర్చోబెట్టుకొని, బ్రతిమాలుతున్నట్లు "ఒక్కసారి 'డాడీ!' అని పిలవరా" అనేవాడు. "ఊహూ! అలా అడిగావంటే నేను నీ దగ్గిర నుంచి వెళ్ళిపోతాను. నాకు నాన్నంటేనే ఇష్టం. అలాగే పిలుస్తాను. డాడీ వద్దు.. యాక్.." అని సమాధానమిచ్చేది.

నిస్సహాయంగా నిట్టూర్పు విడిచేవాడు. ఇలాకాదు ఈ పిల్లను మంచి రెసిడెన్షియల్ స్కూలులో చేర్పించితే పరుగులెత్తుతూ తన దగ్గరకు వచ్చి 'డాడీ' అని పిలుస్తుందనే బ్రహత్ప్రథకానికి శ్రీకారం చుట్టాడు. అనుకొన్నదే తడవుగా ఏలూరు సెంట్ థెరిసా కాన్వెంట్‌లో ఫీజులన్నీ కట్టేసాడు. తన ప్లాన్ సూపర్ సక్సెస్ అవుతుందనుకున్నాడు మనసులో గట్టిగా.

అదీ మొదట్లోనే బెడిసికొట్టింది. ఈ ఊరు విడిచి వెళ్ళనని విద్య మారం చేసింది. బలవంతంగా విద్యను ఏలూరు పంపారు. రెండు రోజులు తిండి తిప్పలు మానేసి తన పంతమే నెగ్గించుకుని అందరినీ వెనక్కితీసుకు వచ్చింది.

అప్పటి దాకా దిగులుతో బెంబేలు పడిన సరస్వతి తప్పిపోయిన

పిల్లపక్షి గూటికి చేరినంత ఆనందంగా వచ్చిన విద్యను అక్కున చేర్చుకుంది.

"సగం నీవల్లే అది చెడిపోతోంది. నా బిడ్డకేం తక్కువ. చక్కగా ఇంగ్లీషు చదువులు చదివిద్దామంటే కుదరటం లేదు. కాస్త పెద్దవనీ, ఢిల్లీనో, కొడైకెనాలో పంపిస్తాను. ఇప్పుడు చిన్నదని సర్దుకుంటున్నాను" అని తనసుతాను సమర్థించుకున్నాడు ఏమీ చేయలేక.

విద్య విషయంలో అతని ఆటలు ఏవీ సాగవని సరస్వతికి ముందే తెలుసు. అది జుట్టు కత్తిరించుకోనని బ్యూటీపార్లర్ గేటు దగ్గర మారాం చేసినప్పుడే అర్థమయింది. ఎందరు ప్రయత్నించినా లోపలికి తీసుకువెళ్ళలేకపోయారు.

పప్పీక్రాఫ్ చేయిస్తే విద్య మరింత బాగుంటుందని ఆలోచన రాగానే సరస్వతిని, విద్యను తీసుకొని బయలుదేరాడు రఘు.

బ్యూటీషియన్ 'భువన'తో మా పాపను చక్కగా తయారు చెయ్యండి. ఫారిన్ పాపలా మెరిసిపోవాలి. ఎంత డబ్బయినా ఫరవాలేదు' అన్నాడు దర్పంగా రఘు.

మంచి కేసు దొరికిందని మురిసిపోయినంత సేపు పట్టలేదు వారికి అది తమవల్ల అయ్యే పనికాదని తెలుసుకోవటానికి.

విద్యలాంటి అమ్మాయిని వారింతవరకూ ఎక్కడా చూడలేదు.

చాక్‌లెట్లు, బిస్కెట్లు, కాడ్‌బెరీస్... ఏమీ పని చెయ్యలేదు.

శతవిధాల ప్రయత్నించి మా వల్ల కాదని చేతులెత్తేశారు.

తననుకున్నవేవీ జరగటం లేదని ఇంతెత్తున ఎగిరిపడ్డాడు సునామీ అలలా.

సరస్వతికి మాత్రం ఈ అనుభవంతో ఒకటి అర్థమయింది.

విద్య ఈ కాలం పిల్లకాదు. తన వంశంలోని ఎవరి అంశో దీనిలో ఉంది. అందుకే ఇలా ప్రవర్తిస్తోంది. లేకపోతే మాకా డ్రస్సు కావాలి, మమ్మల్ని అక్కడకి తీసుకువెళ్ళు... ఇక్కడకు తీసుకువెళ్ళు, మాకది కావాలి... ఇది కావాలి అంటూ ప్రతి నిముషం ఇప్పటి పిల్లల్లా పేచీ పెట్టదే!

బట్టల కొట్టుకు తీసుకువెళితే లంగాలు, జాకెట్లు, గౌన్లు తప్ప మరేమీ వద్దంటుంది. మిగిలిన వాటిని అసలు చూడటానికి కూడా ఇష్టపడదు. చిన్నదయినా జడలే వేసుకుంటుంది. వాటికి చివర రిబ్బన్లు కొని కట్టించుకుంటుంది. దాని వయసే ఉన్న పనిపిల్ల గౌరి కూతురు 'కన్న'తో ఎన్ని కబుర్లు చెబుతుందో!

దాని వల్ల చెడిపోతోందేమో అనిపించి దాన్ని పని మాన్పించేసాడు రఘు.

మళ్ళీ ఆ పిల్లను, గౌరినీ పిలిపించేంత వరకూ ఎవరితో మాట్లాడలేదు. రఘు దిగిరాక తప్పలేదు. ప్రతీసారీ తనిలా ఓడిపోతున్నాడు.

ఏలూరు వద్దందని అదే ఊరిలో ఉన్న 'చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూలు'లో చేరుస్తానన్నాడు. కదిలితే ఒట్టు. నేను రానని పేచీ.

పై చదువులు చదివి విదేశాలు చుట్టి రావాలని విద్య అని పేరు పెడితే ఇదేమిటి అసలు స్కూలుకే వెళ్ళనంటుంది. దీనికి చదువు రాదా? నేర్చుకోవాలనిపించటం లేదా? ఎలా ఈ పిల్లను దార్లోకి తీసుకురావటం. ప్రతి నిముషం ఇవే ఆలోచనలు.

ఆ ఆలోచనలకి తెర పడింది.

విద్య ఒకరోజు తనంతటతనే పలక పుచ్చుకొని స్కూలుకు వెళతానంది. .. ఇంతా చేస్తే విద్య వెళతానన్న స్కూలు తెలుగు మీడియం, ప్రభుత్వ పాఠశాల!

అప్పటిదాకా బెలూన్‌లా పొంగిన హృదయం ఒక్కసారి ఠప్‌మని పగిలిపోయింది. నిరాశతో నీరసపడినా పట్టువదలక 'చదవకపోతే మానేయ్! ఆ బడిలో మాత్రం చేర్చ'నన్నాడు.

అతను మొండి అయితే విద్య జగమొండి.

పంతాలు, పట్టింపులు సడలింపులుగా మారాయి.

చివరకు విద్యే గెలిచింది.

రాజీవితో గవర్నమెంట్‌వారి స్కూలులో చేరింది.

అక్కడ టీచర్లందరికీ విద్య అపురూపం.

విద్య పట్టుపట్టి తమ స్కూలుకు రావడం వాళ్ళందరికీ అబ్బురంగా అనిపించింది. గొప్ప గొప్ప స్కూల్స్ అన్నీ వదిలేసి వచ్చిన ఆ చిన్నారి వాళ్ళ లెక్కలో ఒక దేవత. విద్యకు బాగా చదువు చెప్పాలని అందరూ ధ్యేయంగా పెట్టుకున్నారు. బద్ధకం దుప్పటి కప్పుకున్న మాష్టార్లు కూడా విద్యను చూసి హుషారు తెచ్చుకున్నారు. అందులో విద్య ఏకసంతాగ్రాహి. క్షణంలో గ్రహించేది. ఒక్కసారి చెబితే చాలు ఆకళింపు చేసుకొనేది. ఒకటవ తరగతి పుస్తకాన్ని ఒక్క రోజులో చదివేసింది. ఆశ్చర్యపోవడం అందరి వంతయింది. ఆ విజ్ఞానపు గనిని చూసి తమ స్కూలుకు గొప్ప పేరు తేవటానికి సరస్వతీదేవే ఈ రూపంలో వచ్చిందేమో అని మురిసిపోయేవారు.

అందరూ తెలుగు మీడియం అని చిన్నబుచ్చుతారు కానీ ఎందరు ఐ.ఏ.యస్‌లు ఐ.పీ.యస్‌లు ఇలాంటి బడులలో చదివి ఈ రోజు ఉద్యోగులుగా పేరు ప్రతిష్టలు తెచ్చుకోవడం లేదా అనే సత్యాన్ని కొత్తగా గుర్తించటం ప్రారంభించారు.

ఇంట్లో చిట్టి చిలకమ్మా... మా తెలుగుతల్లికి... పద్యాలు మారుమ్రోగసాగాయి.

ట్వింకిల్ ట్వింకిల్.. లిట్టిల్ స్టార్ పాటలు వినవలసిన చెవులు ఈ పాత చింతకాయ పచ్చడిని వినివలసి వస్తోందే అని కుమిలిపోతున్నా అతని మనసు మాత్రం తెలుగులోని శ్రావ్యతకు లోలోపల కరిగసాగింది. రాయిలాంటి అతని హృదయం భాషాభావానికి శిల్పంగా తయారవటం ప్రారంభించింది. అది చివరకు అభిమానంగా మారిపోయింది. ఇలా తీయటి తెలుగు భాషామృతాన్ని రుచి చూపించిన విద్య అంటే అ తండ్రికి ప్రాణం. విద్య ఇప్పుడు కాస్త నొసలు చిట్లించినా గుండెనొప్పి వచ్చినంత బాధ పడ్తాడు. అంత ఇష్టం పెంచుకోవటమే కాకుండా విద్యకు సంగీతం కూడా నేర్పించసాగాడు. అక్కడ నేర్చుకున్న పాఠాలు తండ్రి దగ్గిర వల్లెవేస్తుంది. ఇద్దరూ కలసి మళ్ళీ మళ్ళీ పాడుకుంటారు. వాటికి కొసరులా తెలుగు పద్యాలూ, పాటలు కూడా కలుస్తాయి.

ఆ దృశ్యం చూసి సరస్వతి మనసు సంతృప్తితో నిండిపోయింది. ఈ జన్మకిదిచాలు అని కళ్ళనిండా ఆనందపు సెలయేర్లు నింపుకుంటూ విద్యను చూసి మురిసిపోతోంది. ఈన విద్యలా ఇంటికొక్కరు ఉంటే మన తెలుగు భాష మనల్ని విడిచి ఎక్కడికి వెళుతుంది అనుకొంది. ఆ భావనతో మనసంతా మల్లెపూల సుగంధంలా పరిమళంతో నిండిపోయింది.

డా. వెంకటనరేష్ బుర్ల
87977 12340

# కోవిడ్ -19 నీలినీడల్లో నాటక రంగం: ఒక పరిశీలన

ఈ పత్రిక ముఖచిత్రం చూడండి. పన్నెండురోజుల ఆన్‌లైన్ జాతీయ నాటకరంగ పండుగలో భాగంగా ప్రదర్శించిన బారిస్టర్ పార్వతీశం నాటకంలోని సన్నివేశాలు ఇవి. తెలుగు నవలా సాహిత్యంలో అద్భుతమైన నవలగా నిలిచిపోయిన మొక్కపాటివారి నవలను డా॥ తూము శివ తెలుగు, హిందీ భాషల్లో నాటకీకరించి ప్రయోగం సంస్థ పక్షాన దేశ వ్యాప్తంగా ప్రదర్శించారు. నాటక దర్శకులు: డా॥ తూము శివప్రసాద్. రంగోద్దీపనం: డా॥ బుర్ల వెంకటనరేష్.

**కో**విడ్ -19 (COVID-19) మహమ్మారి ప్రపంచంలోని అన్ని దేశాలలో సామాజిక, సాంస్కృతిక మరియు ఆర్థిక జీవితాలను గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ మహమ్మారి ప్రజల మధ్య నిర్బంధమైన భౌతిక దూరాన్ని సృష్టించడంవల్ల కూడా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఉత్పాదక రంగాలను మూసివేయడానికి దారితీసింది. తద్వారా ఉద్యోగులు/కార్మికులు తమ ఉద్యోగాన్ని కోల్పోవలసి వచ్చింది. దీనికి నాటక రంగం కూడా మినహాయింపు కాదు. పర్యవసానంగా అన్ని ప్రదర్శనలను నిలిపివేయడం ఒక నిర్బంధమైన ప్రక్రియగా మారింది. ఇది సాధారణ ప్రజల ఆర్థిక జీవితంతో పాటుగా నాటక కళాకారులపై తీవ్రమైన ప్రభావాన్ని సృష్టించింది. కోవిడ్ -19 మహమ్మారి ప్రపంచ నాటక రంగం పై ఎటువంటి మార్పులను తీసుకువచ్చిందో అదేవిధంగా భారతదేశంలోని నాటక రంగంలో మహమ్మారి వలన జరిగిన మార్పుల ప్రభావాన్ని విశ్లేషించడానికి ఈ పరిశోధనా పత్రం ప్రయత్నిస్తుంది.

**పరిచయం:**

కోవిడ్ -19 మహమ్మారి వల్ల పాటించవలసిన నిర్బంధ భౌతికదూరం ప్రపంచంలోని సామాజిక, ఆర్థిక, విద్యా మరియు సాంస్కృతిక జీవితాన్ని ఒడిదుడుకులకు గురిచేసింది. ఇది ఇతర కళా రంగాలతో పాటు ప్రదర్శన కళలపై కూడా గణనీయమైన ప్రభావాన్ని చూపింది. నాటక ప్రదర్శన వేదికల మూసివేత ప్రదర్శనలను మాత్రమే కాకుండా కళాకారుల జీవితాలను కూడా అంధకారంలోకి నెట్టింది. అయినప్పటికీ, మహమ్మారి ఈ క్లిష్ట సమయాల్లో మనుగడ సాగించడానికి వివిధ రంగాలలో మార్పులను తప్పనిసరి చేసింది. కొన్ని సర్వేలు ప్రకటించినట్లుగా మన దేశంలో సాధారణంగా ఐదు నుండి ఎనిమిది సంవత్సరాల సమయం తీసుకునే డిజిటల్ మార్పులు మహమ్మారి సమయంలో ఏర్పడిన నిర్బంధ అవసరాల కారణంగా కొత్త మార్పులను స్వీకరించడానికి కేవలం రెండు నెలలు మాత్రమే తీసుకున్నాయి. ఉదా: ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, వీడియో కాల్‌లు చేయడానికి స్మార్ట్‌ఫోన్‌ల వినియోగం మొదలైనవి. నాటక రంగంలో కూడా మహమ్మారి సమయంలో వివిధరకాల నిర్బంధ మార్పులు చోటుచేసుకున్నాయి.

నాటక కళ ప్రారంభం నుండి నటులు మరియు ప్రేక్షకులు ఒకే చోట కలసి ప్రదర్శనను అనుభవించే ఒక 'ప్రత్యక్ష' ప్రదర్శనగా చెప్పవచ్చు. ఐతే కోవిడ్ -19 మహమ్మారి వల్ల పాటించవలసిన నిర్బంధ భౌతిక దూరం 'ప్రత్యక్ష' నాటక ప్రదర్శనలను ప్రేక్షకులకు దూరం చేసింది. చారిత్రక ఆధారాలను పరిశీలిస్తే ఆయా కాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నాటకం తనను తాను మార్చుకుంటూ తన ఉనికిని చాటుకుంటుందని స్పష్టమవుతుంది. నాటకం అనేది నిస్సందేహంగా ఒక ప్రత్యక్ష ప్రదర్శన, అయితే మహమ్మారి సమయంలో జరిగిన మార్పులను నాటక కళాకారులు విజయవంతంగా దత్తత తీసుకున్నారు. నాటకకారులు డిజిటల్ మరియు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో నాటకాలను వర్చ్యువల్‌గా ప్రదర్శించడం ప్రారంభించారు. 'వర్చ్యువల్' ప్రదర్శన అనేది 'ప్రత్యక్ష' ప్రదర్శనకు ప్రత్యామ్నాయంగా ఎన్నడూ పరిగణించబడలేదు. ఈ పరిశోధన పత్రం మహమ్మారి సమయంలో నాటక సాధన ప్రక్రియలో మార్పులు మరియు 'వర్చ్యువల్' (virtual) ప్రదర్శనలను విశ్లేషించడానికి ప్రయత్నించింది.

**నాటకం-స్థల కాల సంబంధం:**

సంప్రదాయ నిర్వచనం ప్రకారం, నటీనటుల మరియు ప్రేక్షకుల స్థల మరియు కాల (temporal and spacial) సంబంధం నాటక రంగం యొక్క అతి ముఖ్య మరియు మొదటి లక్షణం. ప్రదర్శనకారుడు మరియు ప్రేక్షకులు, ప్రదర్శన సమయంలో భౌతికంగా స్థలం మరియు సమయాన్ని పంచుకుంటారు. నాటక ప్రత్యక్ష(live) ప్రదర్శన అశాశ్వతమైనది(స్వల్ప వ్యవధి వరకు ఉంటుంది). తద్వారా నాటక ప్రదర్శన యొక్క సన్నివేశం ప్రేక్షకులను ఊహించడానికి మరియు మాయా ప్రపంచానికి ప్రయాణించడానికి ప్రేరేపిస్తుంది. ఫెలాన్ ప్రకారం, నాటక ప్రదర్శన "representation without reproduction" (Phelan, 1993). అనగా ఒక నాటక ప్రదర్శనను ఖచ్చితంగా తిరిగి ప్రదర్శించవచ్చు కానీ మునుపటి ప్రదర్శనలో ప్రదర్శించినట్లుగా నాటకం ఎన్నటికీ పునఃప్రదర్శన/పునరావృతం చేయబడదు. థీమ్, ప్లాట్, సెట్, సౌండ్, లైటింగ్, కాస్ట్యూమ్, అదేవిధంగా నటీనటులు వారి నటన, చివరికి అదే ప్రేక్షకులు ఉండవచ్చు, కానీ నాటకం ఇంతకు మునుపు వలె పునఃప్రదర్శన చేయబడదు. కారణం, నటీనటుల భావోద్వేగ ప్రదర్శనలో చిన్న చిన్న వ్యతాసాల ద్వారా కాని, సాంకేతిక మార్పులద్వారా కానీ, లేదా ప్రేక్షకుల స్పందనలో వ్యత్యాసాల వల్ల కానీ, ఒక ప్రదర్శన ఒకేవిధంగా ప్రదర్శించబడదు. మరి ముఖ్యంగా అంతకుముందు ప్రదర్శించిన నాటక 'సమయం' ఎన్నడూ తిరిగి రాదు, నాటక ప్రదర్శన క్షణ భంగురం, అశాశ్వతమైనది. అందువలనే నాటకం చిత్రలేఖనం, శిల్పం లేదా రికార్డ్ చేసిన ప్రదర్శన వలె కాకుండా స్థలంతో పాటు సమయానికి సంబంధించిన ఒక 'ప్రత్యక్ష'

సంఘటన గా చూడవలసి ఉంటుంది.

అందువల్ల వందలాది మంది ప్రేక్షకుల సాక్షిగా పూర్తిగా నిండిన ఆడిటోరియంలో ప్రదర్శించిన ప్రదర్శన నాటక కళ యొక్క 'ఉనికి'కే మూలాధారంగా నిర్వచించవచ్చు. ఈ 'ఉనికి' నే 'థియేటర్ మ్యాజిక్' లేదా నాటకీయత/నాటక ఇంద్రజాలం అని శతాబ్దాలుగా ప్రేక్షకులు భావిస్తూ ఉన్నప్పటికీ దానిని అక్షరాలలో ఖచ్చితంగా నిర్వచించడం అసాధ్యం. సంప్రదాయ రంగస్థల ప్రదర్శనలు సజీవమైన పాత్రలతో, ఇవ్వబడిన కథాంశం(script) ప్రకారం, పాత్రల సంభాషణల (dialogue) తో పాటుగా సంగీతం, సెట్, లైట్ మరియు ఇతర అంశాల సహాయంతో ప్రేక్షకుల కోసం దృశ్యమానం చేయబడతాయి.

**భారత దేశ నాటక రంగ ప్రదర్శన పద్ధతులు:**

నాటకం ఎల్లప్పుడూ సామాజిక మార్పులకు అనుగుణంగా తనను తాను మలచుకొంటుంది. వలసరాజ్యాల కాలంలో, భారతీయులపై బ్రిటిష్ వారి దౌర్జన్యాలు మరియు కపట కార్యకలాపాలను చూపించకుండా నాటకం ప్రదర్శించే బృందాలపై నాటకీయ ప్రదర్శనల చట్టం(Dramatic Performance Act-1876) విధించబడింది. అందువలన నాటకకారులు రామాయణం, మహాభారతం మరియు ఆయా ప్రాంతాల జానపద/ప్రజాదరణ పొందిన కథలను ఇతివృత్తాలుగా మర్చి ప్రదర్శించడం ప్రారంభించారు. ఆయా నాటకాలలోని ప్రతినాయకులను నాటి ప్రజలు బ్రిటిషర్లుగా అన్వయించుకొన్నారు. అదే విధంగా, స్వాతంత్ర్యానంతరం వీధి నాటకాలు సఫ్దర్ హష్మి జననాట్య మంచ్ ద్వారా భారత రాజకీయ మరియు పరిపాలనా వ్యవస్థల అక్రమాలు మరియు దుష్ప్రవర్తనను ప్రశ్నించడం ద్వారా ప్రాచుర్యం పొందాయి. కనుక సమాజ అవసరాల కోసం నాటకం 'రూపం'(form) మరియు 'వస్తువు' (content)లలో తదనుగుణమైన మార్పులను స్థల(spatial) మరియు కాల(temporal) సంబంధాన్ని కీలకమైన అంశంగా కలిగి ఉంటుందని నిరూపించబడింది. ఈ విధంగా తరతరాలుగా ఉన్న సంప్రదాయ నాటక ప్రత్యక్ష ప్రదర్శనలను కోవిడ్-19 మహమ్మారి స్తంభింపజేసింది. ఈ క్రొత్త అవసరానికి అనుగుణంగా నాటకం తన ఉనికిని నిరూపించుకోవడానికి వివిధ సాంకేతిక మార్పులను స్వీకరించవలసిన అవసరం ఏర్పడింది. ఆ సాంకేతిక మార్పులు ప్రదర్శనకారుడు మరియు ప్రేక్షకుల మధ్య స్థల(spatial) మరియు కాల(temporal) సంబంధాల ఆలోచనను పునఃనిర్వచించవలసిన అవసరాన్ని సృష్టించాయి.

**నాటక ప్రదర్శన-వర్చువల్ ప్రెజెంటేషన్:**

పాశ్చాత్య దేశాలలో ఇరవైవ శతాబ్దం నుంచి నాటక ప్రదర్శనలో రికార్డ్ చేయబడిన వీడియో క్లిప్పింగ్ మరియు ప్రత్యక్ష ప్రసార వీడియోలను నాటక ప్రదర్శనలలో పరిపూరకంగా(complimentary) ఉపయోగించడం జరిగింది. ఈ డిజిటల్ అంశాలను సెట్ మరియు ఇతర సాంకేతిక అంశాలలో ఉపయోగించడం ద్వారా నాటకం యొక్క సాంకేతిక ప్రమాణాలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. ఈ డిజిటల్ సాంకేతికత మన దేశంలో ఇరవై ఒకటవ శతాబ్దపు మొదటి దశకం తరువాత నాటకం లో భాగంగా ఉపయోగించబడి గుర్తించదగ్గ మార్పులను తీసుకువచ్చింది. నాటక ఆచార్యులు మాథ్యూ కాసే ప్రకారం "The foundational technology of representation of theatre is to present 'this by displaying that which is not-this."(Causey, 96), నాటకంలో భౌతికంగా లేని దానిని ఉన్నట్లుగా ప్రదర్శించడం, నాటకంలో సాంకేతిక ప్రాతినిధ్యానికి పునాదిగా అభివర్ణించాడు. అయితే ఈ డిజిటల్ టెక్నాలజీ భారత దేశంలో ఢిల్లీ, ముంబాయి వంటి మహానగరాల్లోని నాటక సాధనలో మాత్రమే కేంద్రీకృతమైంది. కోవిడ్-19 మహమ్మారికి ముందు వరకు భారతదేశ గ్రామీణ నాటకాలను డిజిటల్ టెక్నాలజీ ప్రభావితం చేయలేదు. కానీ నిర్బంధ భౌతిక దూర కారణంగా నాటకాలను డిజిటల్ టెక్నాలజీ ఉపయోగించి టెలికాస్ట్ చేయడం గ్రామీణ ప్రాంతాలలో కూడా అనివార్యమయింది. ఈ విస్మరించలేని డిజిటల్ టెక్నాలజీ జోక్యం కారణంగా నాటక "ఉనికి"(presence) మరియు "ప్రదర్శన"(performance)లను డిజిటల్ యుగంలో జరిగే సంఘటనలతో చూసి క్రొత్తగా అర్థం చేసుకోవలసిన అవసరం ఏర్పరిచింది.

రాయల్ షేక్స్పియర్ డ్రామాకంపెనీ, వారి ప్రేక్షకులను ఆకర్షించడానికి యూట్యూబ్ ద్వారా గతంలో ప్రదర్శించిన థియేటర్ ప్రదర్శనలను టెలికాస్ట్ చేసింది. అదేవిధంగా బ్రిటిష్ నేషనల్ థియేటర్ సెప్టెంబర్ 2020 నాటికి ప్రదర్శించిన 17 నాటకాలను 170 దేశాలనుండి దాదాపు ఒక కోటి యాభై లక్షలమంది ఆన్ లైన్ లో వీక్షించడం జరిగింది. ఇదే బాటలో వివిధ దేశాలలోని నాటక కంపెనీలు ఆన్‌లైన్ మాధ్యమాన్ని నాటక ప్రదర్శనలకోసం ఉపయోగించుకొన్నాయి. భారతదేశంలో, హైదరాబాద్ నుండి ప్రయోగం థియేటర్ గ్రూప్ 'పన్నెండు రోజుల ఆన్‌లైన్ నేషనల్ థియేటర్ ఫెస్టివల్' ను 2020 సెప్టెంబర్ 5 నుండి 16 వరకు నిర్వహించింది, ఇందులో భాగంగా వివిధ భాషలలో గతంలో రికార్డు చేసిన ప్రముఖ దర్శకుల నాటకాలను ఆన్‌లైన్‌లో వెబ్‌స్ట్రీమింగ్ ద్వారా ప్రదర్శించారు. అంతకు ముందు వివిధ నాటక సంస్థలు ఆన్ లైన్ లో నాటక ప్రదర్శనలు చేసినప్పటికీ జాతీయ స్థాయిలో వరుసగా పన్నెండు రోజులు నాటకాలను టెలికాస్ట్ చేయడం ఇదే తొలి ప్రయోగం. వీటిని దాదాపు ఏడువేలమంది ప్రేక్షకులు చూసారు. అదే సంవత్సరం వరగాని అనే గ్రామం (గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్)లోని లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్, మహమ్మారి సమయంలో నాటక కళాకారులను ఆర్ధికంగా ఆదుకోవడానికి వినూత్న రీతిలో నాటక పోటీలను నిర్వహించంది. తమ సంస్థ గత ఐదు సంవత్సరాల నుండి నిర్వహించిన నాటక పోటీలలోని ఉత్తమ ప్రదర్శనలకు (రికార్డ్ చేయబడిన నాటకాలు) ఆన్‌లైన్‌లో పోటీని నిర్వహించి మొదటి ఐదు ఉత్తమ ప్రదర్శనలకు మరియు ఉత్తమ కళాకారులకు ఆర్ధిక సహాయం చేసింది. పదిరోజుల పాటు నిర్వహిచిన ఈ ఆన్‌లైన్ పోటీలను ఐదువేల మంది ప్రేక్షకులు తిలకించారు. ఈ పోటీలకు పరిశోధనా పత్రం రచయిత కూడా ఒక న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక థియేటర్ కంపెనీలు, ప్రపంచ

ప్రఖ్యాత థియేటర్ కంపెనీ నుండి స్థానిక వీధి డ్రామా కంపెనీల వరకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా గతంలో ప్రదర్శించిన నాటకాలను టెలికాస్ట్ చేయడం ద్వారా తమ ప్రేక్షకులను నాటక వినోదంలో నిమగ్నం చేశాయి.

గతంలో రికార్డ్ చేసిన ప్రదర్శనలతో పాటు, 'ఆన్‌లైన్‌లైవ్' ప్రదర్శనలు కూడా మహమ్మారి కాలంలో ఒక తప్పనిసరి అవసరంగా మారిపోయాయి. వివిధ ప్రదేశాల నుండి కళాకారులు తమ ఇళ్లలో లేదా కార్యాలయంలో అందుబాటులో ఉన్న లైట్‌లతో ఏకపాత్రాభినయాలే కాకుండా ఒకే పూర్తి నాటకాన్ని ప్రదర్శించే స్థాయికి చేరుకొన్నారు. ఈ 'ఆన్‌లైన్‌లైవ్' ప్రదర్శనలు కొన్ని గుర్తించదగిన మార్పులను తీసుకొచ్చాయి. కళాకారులు పూర్తి నాటకంలో నిర్ణయించబడిన సెట్ లో లాగా కాకుండా వారి స్వంత సృజనాత్మకతపై ఆధారపడి తమ స్వస్థలాన్ని, అందుబాటులో ఉన్న వస్తువులను నాటకానికి అనుగుణంగా మార్చుకొని వాటిని నాటకంలో భాగంగా ఉపయోగించుకోవడం జరుగుతుంది. నటులు వ్యక్తిగత బెడ్‌రూమ్/డైనింగ్ హాల్/డ్రాయింగ్ రూమ్ నేపథ్యంతో నాటక ప్రక్రియ మొదలయ్యింది. ఈ వ్యక్తిగత స్థలం యొక్క వర్చువల్ షేరింగ్ కారణంగా ప్రేక్షకులు దూరంలో ఉన్నప్పటికీ కళాకారులతో ఒక విభిన్నమైన సాన్నిహిత్యాన్ని సృష్టిస్తుంది. కళాకారులు మరియు ప్రేక్షకుల మధ్య భౌతిక స్థల సంబంధం లేకపోవడం వల్ల వర్చువల్ ప్రదర్శన ప్రదర్శకుడు మరియు ప్రేక్షకుల మధ్య నకిలీ మార్పిడిని సృష్టిస్తుంది. మాథ్యూ స్మిత్ చెప్పినట్లుగా "the resourcefulness perhaps even might inspire audiences to even create their own home-based performances." (SMIT, 2000) ఈ క్రొత్త ఉత్పన్నత (resourcefulness) బహుశా ప్రేక్షకులు తమ సొంత గృహ ఆధారిత ప్రదర్శనలను సృష్టించడానికి ప్రేరేపించవచ్చు.

ఐతే ఈ 'ఆన్‌లైన్' ద్వారా ప్రదర్శింపబడ్డ వర్చ్యువల్ నాటకాలలో నటీనటులు మరియు ప్రేక్షకులు వాస్తవానికి 'ప్రత్యక్ష' ప్రదర్శనకు ప్రత్యామ్నాయంగా వర్చ్యువల్ గా ఉంటారు. ఈ 'వర్చ్యువల్' (కాల్పనిక?) నాటక ప్రదర్శన భౌతిక నాటక ప్రదర్శనలో వలే కళాకారులు మరియు ప్రేక్షకుల మధ్య ఉండే 'ప్రత్యక్ష' ప్రదర్శనకు సమానమా? అనే ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తింది.

మార్చి 2020లో మొదట విధించిన నిర్బంధ భౌతిక దూరం (Lockdown) నుండి నాటక కళ లో గుర్తించదగ్గ డిజిటల్ మార్పులు చాలా జరిగాయి. ప్రారంభంలో అనేక పెద్ద నాటక సంస్థలు అంతకముందు ప్రదర్శించి రికార్డ్ చేసిన నాటకాలను ఆన్లైన్ లో ఉచితంగా ప్రసారం చేయడానికి వీలు కల్పించారు. కాలం గడిచే కొద్దీ, రికార్డ్ చేసిన ప్రదర్శనలే కాకుండా టికెట్స్ అమ్మి లైవ్‌స్ట్రీమ్డ్ థియేటర్ ప్రొడక్షన్ ప్రదర్శనలను ఏర్పాటు చేయడం జరిగింది. లైవ్‌స్ట్రీమ్డ్ థియేటర్ ప్రొడక్షన్ అనేది ప్రేక్షకులు ఆన్లైన్లో చూస్తున్నప్పుడు ప్రత్యక్షంగా జరుగుతున్న ప్రదర్శన (రికార్డ్ చేసిన ప్రదర్శన కాదు). అనేక నాటక సంస్థలు ముఖ్యంగా ఇంగ్లాండ్ లోని 'ఓల్డ్ విక్' నాటకశాల ఖాళీ థియేటర్ నుండి పూర్తిగా ప్రత్యక్ష ప్రదర్శనలను ప్రసారం చేయడం మొదలుపెట్టింది. ప్రయోగాత్మక బెల్జియన్ థియేటర్ కంపెనీ 'ఒంట్రోఎరెండ్ గోడ్' ఇంటరాక్టివ్(influencing each other, i.e. performer and audience) పద్ధతిలో నాటకాలను ప్రసారం చేసింది. నేషనల్ స్కూల్ అఫ్ డ్రామా సహాయ ఆచార్యులు మరియు నాటక దర్శకుడు అమితేష్ గ్రోవర్ సెప్టెంబర్ 2021లో రూపొందించిన ది లాస్ట్ పోయెట్(The Last Poet) అనే నాటకం మన దేశంలో మొదటి ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ ప్రదర్శనగా చెప్పవచ్చు.

**ముగింపు:**

బెన్నెట్ తన 'Theatre audience: Theory of Production and Reception'లో ప్రేక్షకుల సాంస్కృతిక స్థితిని నిర్ధారించడానికి భౌతిక ఉనికితో కూడిన ఒక సామాజిక దృగ్విషయంగా నాటకాన్ని వర్ణించాడు. అయితే దీనికి విరుద్ధంగా మహమ్మారి సమయంలో నటీనటులు తమ స్వంత ప్రదేశం నుండి కెమెరా ముందు స్వీకరించదగిన మార్పులతో నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు, మరియు ప్రదర్శన అనేది ప్రేక్షకులకు తెర(screen) ద్వారా అందించబడుతుంది. తద్వారా ప్రేక్షకులు తమ పరిసరాలలో ఉండి ప్రత్యక్ష నాటక పరిసరాలను కోల్పోతారు. సాంకేతికంగా నటుడు కెమెరా కోసం ప్రదర్శిస్తున్నారు, మరియు ప్రేక్షకులు స్క్రీన్ (మొబైల్, డెస్క్‌టాప్, మొదలైనవి) చూస్తున్నారు. మహమ్మారి అనంతర పరిస్థితిలో దీనిని అర్థం చేసుకొని అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది.

ఐతే పైన పేర్కొన్న వర్చ్యువల్ ఇంటరాక్టివ్ నాటక ప్రదర్శనల ద్వారా ప్రేక్షకులు మరియు నటుల మధ్య ఒక పరస్పర సంబంధం సృష్టించబడుతుంది. తద్వారా ప్రేక్షకుల నిష్క్రియాత్మకతను ఛేదించడానికి వీలుపడుతుంది. ఇది పూర్తిగా 'ప్రత్యక్ష' ప్రదర్శనకు ప్రత్యామ్నాయం కాకపోయినప్పయికి మహమ్మారి కాలం నాటకానికి అందించిన ఒక నూతన ఒరవడిగా పేర్కొనవచ్చు. నాటకం స్థల పరిమితులను దాటి విశ్వవ్యాప్తంగా అందరికీ అందుబాటులోనికి వచ్చింది. అంతకుముందు సామాన్య ప్రేక్షకులు చూడడానికి అవకాశం లేని నాటకాలు కోవిడ్–19 మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోనికి వచ్చాయి. తద్వారా నాటకం యొక్క శతాబ్దాల సంప్రదాయ నిర్వచనాన్ని పునఃనిర్వచించుకోవడానికి లేదా పునరాలోచించుకోవడానికి అవకాశం ఏర్పరచింది. నాటక శిక్షణలో ఒక నటుడి ఆలోచనల తరువాత మరొక నటుడు "అవును మరియు....." ("yes and") అనే అన్వేషణా పదాన్ని ఒక క్రమ పద్ధతిలో జోడించడం ద్వారా ఒక ఆలోచనకు అర్థవంతమైన రూపాన్ని ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. కోవిడ్–19 మహమ్మారి సమయంలో నాటక కళలో జరిగిన ఈ మార్పులు "అవును మరియు" అనే క్రమ పద్ధతికి సరైన వ్యక్తీకరణ. సంక్షోభ సమయంలో నటులు/కళాకారులు వారి ప్రేక్షకులను ప్రదర్శనల ద్వారా చేరుకోవడానికి ఇబ్బందులు ఉన్నప్పటికీ అవకాశాలను అన్వేషించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఆలోచనలను అమలుచేయడానికి ప్రయత్నించారు. ఏదేమైనా, నాటకం లేదా మరేదైనా కళ మానవ జీవితంలో అంతర్భాగమైనందున కొత్త కాలానికి కొత్త రూపాలను కనుగొంటుంది.

ఈ వ్యాసరచయిత సెంట్రల్‌యూనివర్సిటీ ఆఫ్ జార్ఖండ్, రాంచీ–
ప్రదర్శన కళల విభాగంలో సహాయ ఆచార్యులు

**పుస్తక పరిచయం**

# జాషువా హృదయ దర్పణం




రచన: డా॥ గుమ్మా సాంబశివరావు
పుటలు: 432
వెల రూ:400
ప్రతులకు :
ఎస్.ఆర్.పబ్లికేషన్స్
విజయవాడ 0866 2436959
బ్రాంచ్: నల్లకుంట
హైదరాబాద్-44
సెల్: 90324 28516

**ఆ**ధునికసాహిత్యంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న కవుల్లో జాషువా ఒకరు. ప్రక్రియ పద్యరచన అయినా, సరళంగా, సూటిగా, స్పష్టంగా, భావవ్యక్తీకరణ చేయగల దిట్ట. ఆయన కవిత్వంపై ఎంత పరిశోధన జరిగినా జాషువా సంపూర్ణహృదయ ఆవిష్కరణ ఒకచోట జరగలేదు. మనసు ఫౌండేషన్‌వారు ప్రచురించిన 'జాషువా సర్వలభ్య రచనల సంకలనం' డా॥ గుమ్మా సాంబశివరావు ద్వారా ఈ లోటును భర్తీ చేసింది. జాషువా అన్ని రచనల్లోని ప్రధానపద్యాలకు హృద్యమైన వ్యాఖ్యానంతో వెలువరించిన గ్రంథం 'కవికోకిల గుర్రం జాషువా పద్య చంద్రిక.' "వడగాల్పు నా జీవితం. వెన్నెల నా కవిత్వం" అనే కవి మాటల ఆలంబనగా ఈ పుస్తక శీర్షికను పొందుపరిచారు.

శిశువు అనే ఖండికలో పిల్లలు తమ బొటనవేలును నోట్లో పెట్టుకునే సందర్భాన్ని ఆ వేలులోనే ముల్లోకాల్ని చూస్తారనే ఉత్కృష్ట భావజాలాన్ని వివరించారు. అంతేగాక గతంలో ఏ కవి వ్యక్తీకరించని భావాల్ని జాషువా వ్యక్తీకరించారనే శనగల నరసింహస్వామి మాటల్ని పేర్కొన్నారు. విశ్వనాథ "జాషువాను మహాకవిఅని చెప్పడానికి ఆయన శిశువును గూర్చి రాసిన ఖండిక చాలు" అనే మాటల్ని పొందుపర్చడం వ్యాఖాతకున్న లోతైన అవగాహనకు అద్దం పడుతుంది.

అనేక సందర్భాల్లో మాతృమూర్తుల పట్ల భక్తిని, మమకారాన్ని వ్యక్తీకరించిన సందర్భాలు అనేకం. తల్లి లింగమ్మ పుత్ర ప్రేమను, ఔన్నత్యాన్ని వివరిస్తూ, కవిత్వం రాశారు. అలాగే తండ్రి వీరయ్యకు నేతాజీ కావ్యాన్ని అంకితమివ్వడమే గాక "తానమంది క్రైస్తవ మంతబున జేరి కులంబు గోత్రమున్ మానిన వెర్రి గొల్లడవమాయక మూర్తివి" అని వాస్తవాన్ని వెల్లడించారు.

జాతీయత, దేశభక్తి, మానవతావాదం, హేతువాదం, మహిళాభ్యుదయం, జీవకారుణ్యం, మూఢాచార నిరసనలాంటి అనేక భావాల కూడలిగా జాషువా కవిత్వం ఉందనేది ఈ రచన ద్వారా తేటతెల్లం అవుతుంది. అంతేగాక జాషువా కవిసమయాలు, భావనాపటిమ, నూతన పదబంధాల ప్రయోగం, విలక్షణ వ్యక్తీకరణ మొదలైన అంశాల్ని ఎక్కడికక్కడ ప్రస్తావించడం ఈ వ్యాఖ్యానంలో విశేషాంశంగా కన్పిస్తుంది.

ముంతాజ్ మరణించి భూమిలో కలిసిపోవడం వల్లనే దీనికి రత్నగర్భ అనేపేరు సార్థకమైందనేది కవిభావన. అలాగే ఆమె తన తలమీద ధరించడం వల్ల సాధారణ బొగ్గు కోహినూరుగా పరిగణించబడిందనేది సముచిత రీతిలో వ్యాఖ్యానానికి నోచుకుంది. శబ్దాలు ఏవిధంగా కవి ఆధీనంలో వుంటాయో అలాగే శిలలు శిల్పుల ఆధీనంలో వుంటాయని పేర్కొన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన "క్రీస్తు చరిత్ర" కావ్యాన్ని ఉపశీర్షికలుగా విభాగించి ఒక క్రమ పద్ధతిలో రాయడంలోని కవి నేర్పరితనాన్ని వ్యాఖ్యాత గుర్తించగలిగారు. అందులోని పద్యాలకు కవి అంతరంగాన్ని ఊహించిన సందర్భాలు కూడా ఉన్నాయి. "నాగార్జునసాగర్" అనే కావ్యాన్ని జాషువా అమోఘంగా రాశారని, చారిత్రకంగా ఆ ప్రాంత గొప్పతనాన్ని వర్ణించిన అంశాలలో వాస్తవికతల్ని గుమ్మావారు విపులీకరించిన తీరు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బౌద్ధులు ఆ నేలమీద సంచరించారు కాబట్టి వారి మహిమ వల్ల ఆ భూమికి గొప్పదనం సంక్రమించిందని జాషువా భావనలోని ఔన్నత్యాన్ని వ్యాఖ్యాత విశ్లేషించారు.

గబ్బిలంలో గాంధీ, పటేల్, నెహ్రూల గొప్పతనాన్ని వర్ణించడమే గాక అంబేద్కర్ ఘనతను శ్లాఘించారు. ఇలాంటి అనేక సందర్భాల్లో కవిపేర్కొన్న అంశాల వివరణకు చారిత్రక అంశాల్ని కూడా గుమ్మా పరిశీలించినట్లు అర్థమవుతుంది. ఆంధ్రకవుల చరితం అనే గ్రంథంలో తొలితెలుగు ప్రజాకవి వేమనను చేర్చకపోవడం కందుకూరి తప్పిదంగా కుండబద్దలుకొట్టిన విషయాన్ని సముచితంగా వ్యాఖ్యానించారు. అక్కడ వేమనకు జరిగిన అన్యాయం 'వైతాళికులు'లో జాషువాకు జరిగింది. ముప్పైసంవత్సరాలు శ్రమించి పిరదౌసి షానామా కావ్యాన్ని రాస్తారు. కానీ ఇచ్చినమాట విస్మరించి, పైగా చంపమని గజినిమహ్మద్ ఆజ్ఞాపించడాన్ని జాషువా నిశితంగా విమర్శించారు. పిరదౌసి కవి వ్యధను, సమాజంలో అవమానాలు ఎదుర్కొన్న జాషువా సమర్థవంతంగా చిత్రించగలిగారని వ్యాఖ్యాత పేర్కొన్నారు.

తేనెపట్టు అనే ఖండికను "నరులకు నీతి హుళక్కనుచు" అనే జాషువా మాటలు కరుణశ్రీ పుష్పవిలాపంలో "నరజాతికి నీతి యున్నదా?" అని మారి ఉంటాయన్నారు. అలాగే "వంచిన తల ఎత్తకుండా నేత్రంచలములు చెమ్మగిల్ల 'అపరాధంగా భావించితినని' చెంపలు వాయించుకొనుచు మరల యింటికేగినంతన్" అనే మాటలు కూడా "ఇట్లు పుష్పాలు నన్ను చీవాట్లు పెట్టినట్టుగాన్- వట్టి చేతులతో నిటువచ్చినాను'' అదే విధంగా రూపొందాయని తులనాత్మక అధ్యయనంతో వ్యాఖ్యానించారు.

బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రాసిన "సత్యహరిశ్చంద్రీయం" నాటకంలో జాషువా శ్మశాన వాటి పద్యాలు చోటు చేసుకోవడం జగద్విదితం. 1912 సం॥లో రాసిన ఈ నాటకంలో "దళిత ఘోరారి యీ వీరదాసు గలడు" అనే పద్యంలో "దళిత" పదం ప్రప్రథమంగా చోటు చేసుకుంది. జాషువా పద్యాల వల్ల నాటకానికి, నాటకం వల్ల జాషువా పద్యాలకు ప్రాచుర్యం లభించిందని, ఇది అరుదుగా జరిగేదని స్పష్టం చేశారు.

జాషువా కవిత్వం యావత్తూ సందేశాత్మకమని అనేక సందర్భాల్లో ఆయన భిన్న దృక్కోణాల్లో సమాజానికి మార్గనిర్దేశం చేశారని ఈ రచన వెల్లడిస్తుంది. వట్టి వ్యాఖ్యానమే గాక జాషువా ప్రభావానికి లోనైన కవుల్ని, వారి కవితా పంక్తుల్ని సోపపత్తికంగా ఉటంకించడం గుమ్మాకు సాహిత్యంపై వున్న పరిణతికి, పట్టుకు ప్రబల తార్కాణం. ఈ రచన జాషువా కవిత్వానికి కరదీపికగా ఉపకరిస్తుందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

-ఆచార్య కొండపల్లి సుదర్శన రాజు
ఆంధ్రవిశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు

పుస్తక పరిచయం

# తెలుగుతేజం సాంఘికోద్యమ జీవితం




రచన:
వకుళాభరణంరామకృష్ణ
కొంపల్లి సుందర్
పుటలు: 104
వెల రూ: 100
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్‌హౌస్
27-1-54,
కారల్‌మార్క్స్‌రోడ్,
గవర్నర్‌పేట,
విజయవాడ-2
ఫోన్:08662577533
మరియు ప్రజాశక్తి
బ్రాంచీలలో లభించును.

**తె**ల్లవాడు చెప్పిందే చరిత్ర, ఆ తెల్లకలాలు రాసిందే చరిత్ర పాఠ్యాంశంగా సాగిన అధ్యయనం నుండి బయటపడి, స్థానిక కోణంలో చరిత్రను తెలుసుకోవసిన అవసరం వుందని, స్థానికంగా చరిత్ర సృష్టించిన వ్యక్తులను వెలుగులోకి తీసుకురావలసిన సమయం వచ్చిందని తెలియచెప్పిన పుస్తకం- "దక్షిణ భారతదేశంలో ప్రథమ ప్రజాఉద్యమకారుడు గాజుల లక్ష్మీనరసు చెట్టి" అజాదీ అమృతోత్సవ్ సందర్భంగా మరుగున పడిన ప్రముఖులు వెలుగులోకి వస్తున్నారు. ఆ కోవలో తెలుగువారు తెలుసుకుని, అర్థం చేసుకుని గర్వ పడాల్సిన ప్రజా ఉద్యమకారుడు గురించి, గురు శిష్యులైన రచయితలు వకుళాభరణం రామకృష్ణ, కొంపల్లి సుందర్‌లు పరిశోధించి రాసిన పుస్తకంయిది 'వలసవాద, ఉదారవాద పరిశోధకులు, రచయితలు విశ్లేషించింది నిజం కాదు' అని భూమికలోనే చెప్పటం ద్వారా 'వలసవాదులు చరిత్రను వక్రీకరించారనీ తమ అవసరాలకు అనుగుణంగా రాసుకున్నారన్న' పుస్తకం ప్రస్తావించటంతో చరిత్రకున్న కొత్తకోణం వెలుగులోకి తీసుకు వస్తున్న స్పష్టత వచ్చింది.

గాజుల లక్ష్మీనరసు చెట్టిగారు వ్యాపారి. వ్యాపారులకు లాభార్జన తప్పించి సామాజిక స్పృహవుండదు అనేది సమాజ అభిప్రాయం. కాని అది తప్పని నిరూపిస్తుంది లక్ష్మీనరసుచెట్టి గారి జీవితం. ఎంతకాలం జీవించాం అనేది కాక ఎలా జీవించాం, సమాజానికి ఏం చేసామన్నది ముఖ్యమైన విషయం లక్ష్మీనరసు చెట్టిగారు తమ జీవన విధానంతో నిరూపించారు. ఆయన జీవించింది 62ఏళ్ళే, చదివిన చదువు నామమాత్రమే. సామాజిక అధ్యాయనం సహజంగా అబ్బింది. ఒకసారి సమాజంపట్ల మక్కువ, ప్రజాసేవపట్ల ఆసక్తి పెరిగిన తర్వాత ఆయన జీవితం మారిపోయింది. ప్రజల మనిషిగా మారాడు, ప్రజాఉద్యమకారుడయ్యాడు. 19వ శతాబ్దం బ్రిటీష్ వలస కేంద్రం చెన్నపట్నాన్ని ప్రభావితం చేశాడు. తెలుగు సమాజాన్ని నడిపించాడు. బ్రిటీష్ పాలకులను ఢీకొన్నాడు. రాజద్రోహం నేరం మోపబడినా వెనకడుగు వెయ్యలేదు. ప్రభుత్వ ప్రతిఘటనకై పత్రికను ప్రారంభించాడు. ఈనాడు ఘనంగా చెప్పుకొనే పరిశోధనాత్మక పాత్రికేయానికి నాడే శ్రీకారం చుట్టినవాడిగా నిలిచాడు. ఒక వ్యక్తి వ్యక్తిత్వం ఎన్ని రంగాలను ప్రభావితం చేయగలడనేదానికి నిదర్శనం గాజుల లక్ష్మీనరసుచెట్టి జీవితం. ప్రజాసేవకూడా ఒక వ్యసనం వంటిదేనేమో! ఒక్కసారి పట్టుకుందా... వదలదు. సర్వం కోల్పోతున్నా ఆ 'సేవా వ్యసనం'లోనే కొట్టుకపోతారు. సర్వస్వం కోల్పోయి నిరుపేదగా, జీవితాన్ని సమాజం కోసం వినియోగించి, తానేమీ మిగుల్చుకోకుండా వెళ్లిపోయిన ధన్యజీవి గాజుల లక్ష్మీనరసుచెట్టి గారిని మన ముందు నిలబెట్టారు రచయితలు.

ఒక వ్యక్తి జీవితచరిత్ర పుస్తకంకాదు ఇది. 19వ శతాబ్దపు సామాజిక పరిస్థితుల, నాడు సమాజంలో సాహిత్య సంఘాల ఏర్పాటు, ప్రజాజీవన పరిణామం, బ్రిటీష్‌వారి వలసపరమైన కుయుక్తులు, మతపరంగా చాపకింద నీరులా క్రైస్తవాన్ని హిందూ సమాజంలోకి తీసుకవచ్చిన వీరు, విద్య అందిస్తూ, ఆ విద్యలో బైబిల్ బోధన నిర్బంధం చేసిన ఎత్తుగడలు అన్నీ పాఠకులకు తెలుస్తాయి. సమాజంలోని లోపాలను తమ పాలనకు, తమ మతానికి అనుకూలంగా మలచుకుంటూ ఒక వైపు భౌతిక భూభాగాన్ని ఆక్రమించుకుంటూ మరోవైపు మేధోబానిసలను తయారుచేసిన తెల్లవాడి తెలివితేటలను వాటిని గుర్తించి అడ్డగించిన తొట్టతొలి పోరాట యోధునిగా నిలిచిన గాజుల లక్ష్మీనరసుచెట్టి జీవితం ద్వారా తెలియజెప్పారు.

ఒక మనిషి మూడు దశాబ్దాల కాలంలో అంతగా ఎదగడం, నాయకత్వం చేపట్టి, సమాజాన్ని ప్రభావితం చెయ్యటం సాధ్యమేనని, వ్యక్తిగత ప్రచారం, లాభం చూసుకోకుండా సేవలు అందించవచ్చని లక్ష్మీనరసుచెట్టి నిరూపించాడు. సమాజానికి చెరుపుచేసే ఏ యత్నం అయినా ఈస్టిండియా కంపెనీ నిర్ణయమైనా ధైర్యంగా ప్రతిఘటించడం ఆయన జీవితంలో భాగమైంది.

ప్రభుత్వం మీద పోరాటాలకు ఆయుధం అక్కరలేదు, సభ్యసమాజానికి ఆవల అడవుల్లో నక్కి వుండాల్సిన పనిలేదు. నలుగురినీ ఒప్పించి, తమ పోరాటంలో భాగస్వాములుగా మలచుకోవటం ఎలానో లక్ష్మీనరసుచెట్టి జీవనం చదివి నేటి ఉద్యమకారులు మారవచ్చు. పసిపిల్లలను తమ మతంవైపు తిప్పుకునే తెల్లవారి కుట్రను భగం చేసే పోరాటంలో నాటి ప్రభుత్వాలు దిగివచ్చేలా చేసిన ఘనత ఆయనది.

పిడివాదికాదు లక్ష్మీనరసుచెట్టి, సంస్కరణవాది. ప్రజాస్వామ్యవాది. ప్రజలను ఏకీకృతులను చేయగలిగిన నేర్పరి. అంశాలను ముందుగా గుర్తించగలిగిన అధ్యయనశీలి. స్థానికుల ప్రయోజనాలను దెబ్బతీసే ఏ ప్రభుత్వమూ నిజమైన ప్రభుత్వం కానేకాదు అనే నమ్మకం

**తరువాయి 39వ పుటలో....**

డా॥ అల్లంసెట్టి చంద్రశేఖరరావు
9949605141

# లేఖనం ఒక సంప్రదాయం

**రాత** అన్నది సాంప్రదాయకంగా వస్తున్న ఒక అలవాటు. మనది అక్షరలిపి. అంటే ఒక హల్లు ఒక అచ్చుతో కలిసివుంటుంది. 'క' అనే అక్షరాన్ని క్ అనే హల్లుకి అ అనే అచ్చు కలిపి 'క' గా రాస్తున్నాం. తలకట్టు అ ధ్వనికి సంకేతం. దీర్ఘం ఆ ధ్వనికి సంకేతం. క్+అ = క. క్+ఆ = కా. క్+ఇ = కి. క్+ఈ = కీ. మరి కు = ?. క్+అ+ఉ = కు. క్ అనే పొల్లు అక్షరానికి తలకట్టు, కొమ్ము ఇస్తున్నాం. క్ అనే హల్లుకు 2 అచ్చులు అంటుకొని ఉన్నాయి. ఐనా క కు కొమ్మిస్తే కు అనే చదువుతున్నాం కదా. కూ = ? క్ + అ + ఉ + ఆ = కూ. క్ అనే పొల్లు అక్షరానికి తలకట్టు, కొమ్ము, దీర్ఘం ఇస్తున్నాం. క్ అనే హల్లుకు 3 అచ్చులు అంటుకొని ఉన్నాయి. ఐనా క కు కొమ్ముదీర్ఘం ఇస్తే కూ అనే చదువుతున్నాం కదా. శాస్త్రీయంగా ఆలోచిస్తే తలకట్టు స్థానంలో కొమ్ము రావాలి కదా?

'మ' కు ఓ త్వం విషయం ఆలోచిస్తే తెలుగులో రెండు విధాలైన రాతలు కనిపిస్తున్నాయి. నా చిన్నతనంలో మ కు తలకట్టు స్థానంలోనే 'ఓ' త్వం రాసేవాళ్ళం. ఇప్పుడు గూడ ఆ పద్ధతివుంది. ఇదే పద్ధతి హ విషయంలో గూడవుంది. "మహోన్నత శిఖరాలు" అన్న కవితా సంకలనం పుస్తకం అట్టమీద 'హ' కు 'ఓ' త్వంవుంది. కాని ఆ పుస్తకాన్ని సమీక్షించిన పత్రికలో "మహోన్నత శిఖరాలు" అనే ప్రింటు చేశారు. నేను 'హ' కు 'ఓ' త్వం ఇచ్చి టైపుచేస్తే 'హ' కు ఎత్వం, కొమ్ముదీర్ఘం ప్రింటంది. వంద సంవత్సరాల క్రితం మానాన్న రాసిన పుస్తకాలలో "కోపం" అన్న మాటను 'క' కు 'ఎత్వం, కొమ్ముదీర్ఘం' ఇచ్చే రాశారు. ఆయన చిన్నప్పుడు అలాగే రాయడం నేర్చుకొని వుంటారు.

మ, య, హ వంటి హల్లులకు 'ఎ' త్వం + కొమ్ము, లేదా 'ఎ' త్వం + దీర్ఘం రాసే అలవాటు ఎట్లా కలిగింది అని తెలుసుకోవాలనుకొంటే తమిళ రాతవిధానం తెలుసుకోవాలి. వాళ్ళకు మనలాగే అచ్చులు, హల్లులు వున్నాయి. అచ్చులకు గుణింతాలున్నాయి. దీర్ఘం, గుడి, కొమ్ము వంటి గుర్తులు వున్నాయి. తలకట్టు లేదు. పొల్లు అక్షరాన్ని రాయడానికి హల్లు అక్షరం పై ఒక చుక్క పెడతారు. గుడి, కొమ్ము వంటి గుర్తులు హల్లును అంటిపెట్టుకొని కలిసి వుంటాయి. దీర్ఘం, హల్లును అంటిపెట్టుకొని వుండదు. హల్లుకు కుడి పక్కన రాస్తారు. ఎత్వం, ఏత్వం, ఒత్వం, ఓత్వం వంటి గుర్తులు హల్లును అంటిపెట్టుకొని వుండవు. హల్లుకు ఎడమ పక్కన రాస్తారు. తమిళంలో 'మొత్తమ్' అన్న పదంలోని 'మొ' రాయడానికి 2 అచ్చు సంజ్ఞలు వాడతారు. 'మ' కు ముందు ఎ త్వం గుర్తు, 'మ' తరువాత దీర్ఘం గుర్తు రాస్తారు. తెలుగులో 'మొత్తమ్' అన్న పదంలోని 'మొ' రాయడానికి 2 అచ్చు సంజ్ఞలు వాడుతున్నాం. మ్ + ఎ త్వం + కొమ్ము రాస్తున్నాం. తమిళం లో 'మోసమ్' అన్న పదంలో 'మో' రాయడానికి 'మ' కు ముందు 'ఏ' త్వం గుర్తు, 'మ' కు తరువాత దీర్ఘం గుర్తు రాస్తారు. తెలుగులో మోసమ్ రాయడానికి మ్ + ఎ త్వం + దీర్ఘం రాస్తున్నాం.

తెలుగులో వలపలగిలక అనే ఒక గుర్తు ఉండేది. సుమారు ఒక వంద సంవత్సరాల క్రితం అచ్చయిన పుస్తకాలలో దీనిని చూడవచ్చు. దీనిని హల్లుకు కుడివైపున రాస్తారు. కర్తవ్యము (కర్‌తవ్యము) అన్న మాటను "కర్త‍వ్యము" అని రాసేవారు. ఇది ఇతర అక్షరాల లాగే ఒకే వరుసలో వుంటుంది. తలకట్టు, దీర్ఘం, గుడి లాగ హల్లు తలపై ఉండదు. దీనికి రెండు వంపులు వుంటాయి. ఇది హల్లు తరవాత ఉన్నా హల్లు కంటే ముందు పలకాలి. ఇటువంటిదే నకారపు పొల్లు. దీనిని గూడ అక్షరం తరవాతే రాస్తారు. దానిని అక్షరం తరవాతే పలకాలి. 'రామన్' అన్న పదాన్ని 'రామ ౝ' అని రాసేవారు. ఇది గూడ ఇతర అక్షరాల లాగే ఒకే వరుసలో వుంటుంది. దీనికి (ౝ, అచ్చుతప్పు) మూడు వంపులు వుంటాయి. ఈ సూక్ష్మ భేదాన్ని గుర్తించడం కష్టంగా వుండేది. ఇప్పుడు ఈ రెండూ వాడుకలో లేవు. ఇది ఒక శుభపరిణామం.

తెలుగు గుణితంలో హల్లులకు గూడ గుణింతాలున్నాయి. మనం హల్లు కింద హల్లు గుర్తు రాస్తున్నాం. 'కైక' అన్న పదంలోని మొదటి అక్షరాన్ని 'క' కు ఎత్వమిస్తే కె, కింద 'ఇ'త్వమిస్తే కయ్ అని చదువుతున్నారు. లేదా 'క'కు ఐత్వ మిస్తే కయ్ అని చదవడం గూడ వుంది. అనైక్యత లోని 'నై' = 'న్ ' అనే హల్లు ఐ అనే అచ్చు కలయిక. అలాగే 'అమృతము'లోని 'మృ' = మ్ అనే హల్లు ఋ అనే అచ్చు కలయిక. హల్లు కింద హల్లు రాస్తే దానిని సంయుక్తాక్షరం అంటారు. ఒక హల్లు కింద అదే హల్లు రాస్తే దానిని ద్విత్వాక్షరం అంటారు. 'కై, మృ'లను సంయుక్తాక్షరాలు అనుకొనే ప్రమాదం వుంది. ఈ రెండుచోట్ల అక్షరం కింద అక్షరసంజ్ఞ రాశాం. ఈ కారణంగా పద్యపాదాలను గురు లఘు నిర్దేశం చేసేటప్పుడు సమస్య ఎదురౌతుంది. 'అనైక్యత'లో 'నై' ని 'అమృతం'లో 'మృ'ను సంయుక్తాక్షరాలు అనుకొంటే వాటి ముందున్న 'అ' దీర్ఘం ఔతుంది. ఛందో భంగం ఔతుంది. వీటి విషయంలో సందేహానికి తావులేని రాత అవసరం.

తెలుగు లేఖనాన్ని సులభతరం చెయ్యాలంటే గుణింతంలో హల్లులకు వేరే గుర్తులు వుండకూడదు. దేవనాగరిలో హల్లులకు గుణింతంలో వేరే గుర్తులు లేవు. సగం హల్లు రాస్తారు. ఇది మొదటి హల్లును అంటివుంటుంది. తమిళంలో హల్లులకు గుణింతంలో వేరే గుర్తులు లేవు. హల్లు పక్క హల్లు రాస్తారు. ద్విత్వ సంయుక్తాక్షరాలలో మొదటి హల్లు పొల్లు అక్షరం కాబట్టి దానిపై ఒక చుక్క పెడతారు. హల్లులు అంటిపెట్టుకొని వుండవు. తెలుగు కన్నడ లేఖనంలో హల్లు కింద హల్లు రాయడం వుంది. గుణింతంలో హల్లులకు వేరే గుర్తులు వున్నాయి. గుణింతంలో అచ్చులకు మాత్రమే గుర్తులు వుండి, అవీ హల్లుని అంటుకొని వుండి, హల్లులకు వేరే గుర్తులు లేని లేఖన విధానం మంచిది.

'కార్‌తీకపౌర్‌ణమి' అన్న మాటను తెలుగులో 'కార్తీకపౌర్ణమి'

అని రాస్తున్నాం. 'కార్తీకపౌర్ణమి' అని చదువుతున్నాం. భాషలో 'త' కు గుడిదీర్ఘం వుంది. రాతలో 'ర' కు గుడిదీర్ఘం ఇస్తున్నాం. అచ్చులకు మాత్రమే గుణింతంలో వేరే గుర్తులు వుండి హల్లులకు వేరే ప్రత్యేకమైన గుర్తులు లేకుండా పొల్లు అక్షరం వాడడం మంచి పద్ధతి. ఉదాహరణ 'కార్తీకపౌర్ణమి'. ఈ విధానంలో అక్షరాలు ఏ వరుసలో పలుకుతున్నామో అదే వరుసలో రాయడం జరుగుతుంది. సవర మాసపత్రికలో తెలుగులిపిలో సవరభాషను రాయడానికి నేను ఇదే పద్ధతి అనుసరించాను. ఈ పద్ధతిలో అచ్చులో నిడివి పెరుగుతుంది అని ఒక భాషాశాస్త్రవేత్త అభిప్రాయం వ్యక్తంచేశారు. కాని వరుసకీ వరుసకీ మధ్య ఖాళీ తగ్గుతుంది. లెడ్డింగు తగ్గుతుంది. ఆ కారణంగా పేజీలోని వరుసల సంఖ్య పెరుగుతుంది. పుస్తకంలోని పుటల సంఖ్య తగ్గుతుంది. ఈ రాత పద్ధతిని సులభంగా ఆచరణలో పెట్టవచ్చు. తెలుగు రచయితలు, పాఠకులు, పుస్తకాలను అచ్చువేసేవారు, ప్రింటుమీడియావారు ఒకసారి ఆలోచించండి.

రచయిత తెలుగు, సవరభాష బోధనలో అనుభవజ్ఞుడు.
పరిశోధకుడు. సవరభాషాపత్రిక సంపాదకుడు.

**37 వ పుట తరువాయి...**

## తెలుగుతేజం సాంఘికోద్యమ జీవితం

లక్ష్మీనరసు చెట్టిది. నాటికే బెంగాల్‌లో మొదలైన ప్రతిఘటన ఉద్యమకారులతో సంబంధాలు ఏర్పరుచుకొని, రహస్యంగా పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లటం నరసుచెట్టి నేర్పు.

చివరి 5 సంవత్సరాలలో చేసిన చాణక్యంతో తంజావూరు, మైసూరు సంస్థానాలను నిలబెట్టటం, నైజాం నవాబుతో మంత్రాంగం వంటివి బ్రిటీష్‌వారిని ప్రతిఘటించటంలో భాగంగా చేసినవే.

ఇవన్నీ ప్రథమ స్వాతంత్ర్య సమరంగా చెప్పే 1857 కాలానికి ముందు జరిగినవి. ఆనాటికే దక్షిణ భారతదేశంలో వెల్లివిరిసిన తెలుగువారి చైతన్యానికి ప్రతీకలు. ఈస్టిండియా కంపెనీ అధికారులలో మంచివారితో మైత్రి, ప్రమాదకారులతో వైరం, ఆయా సద్దుబాట్లకు అయినా, పోరాటాలకైనా సామాజిక పోరాట బృందాల నిర్మాణం... అంతా గాజుల లక్ష్మీనరసు చెట్టి చతురత.

ఆంధ్రకోస్తా ప్రాంతం వీడి చెన్నపట్నాన్ని తమ వ్యాపార కేంద్రంగా చేసుకుంటున్న ఈస్టిండియా కంపెనీని ఆశ్రయించి ఈ ప్రాంత వ్యాపార కుటుంబాలే వెళ్ళాయి. అలా వెళ్ళిన తెలుగువారే చెన్నపట్న అభివృద్ధి, సామాజిక, సాంస్కృతిక వికాసాలలో కీలక పాత్ర పోషించారు. చెన్నపట్నం మీద తమిళ పెత్తనం పెరిగి తెలుగువారి మూలాలను తెంచేసే యత్నం జరిగింది. అలా ఆ నగర నిర్మాణం విస్మృతిలో పాత్రవున్న తెలుగువారు ఎవరికీ పట్టకుండా పోయారు. వలస పాలన సమయంలో, 19వ శతాబ్దికాలంలోని సామాజిక, రాజకీయ రంగాలలో తెలుగు ప్రముఖులను బయటకు తెచ్చిన తొలి పుస్తకం ఇది. మరెందరో ఆ తరం తెలుగువారి గురించి తెలిసినవారు, ఆ సమాచారం గ్రంథస్తం చేసేందుకు వకుళాభరణం, కొంపల్లిల పుస్తకం స్ఫూర్తిగా నిలుస్తుంది.

– దుగ్గరాజు శ్రీనివాసరావు
94404 21695

## 'అమ్మభాష రక్షణకోసం అందరూ దీక్షవహించాలి'

'ప్రపంచంలో మరణంలేనిది అక్షరానికే'– అని కృష్ణాజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి అన్నారు.

అక్షరం అజరామరం. భాషను రక్షించుకొంటే సంస్కృతి నాగరికతలు రక్షించబడతాయి. సంస్కృతి నాగరికతల్ని రక్షించుకొంటే కళలు బతుకుతాయి. ఏ జాతి మాతృభాషను మర్చిపోతుందో ఆ జాతికి మనుగడ ఉండదు. మనిషి జీవనయానం అమ్మపొత్తిళ్లనుంచే ప్రారంభమవుతుంది. అందుకే భాషారక్షణకు అమ్మలు నడంకట్టుకోవాలి' అని జస్టిస్ శేషసాయి అన్నారు.

సభాధ్యక్షులు డా॥ మండలి బుద్ధప్రసాద్ తన ప్రసంగంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం గత 50 ఏళ్లుగా చేసిన కృషిలో ముఖ్యాంశాలను వివరించారు. సంఘం తెలుగుభాష, సాహిత్యం వికాసానికి తోడ్పడిన పెద్దలను గుర్తుకుతెచ్చుకొని ఉద్వేగంతో ప్రసంగించారు. ఆ రోజు సభలో 2020, 2021 సంవత్సరాలకు పురస్కారాలను అందుకోబోతున్నవారు చేసిన సేవలను స్థూలంగా ప్రస్తావించి అభినందించారు. స్వర్ణోత్సవాల సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచిక 'పసిడికృష్ణ'ను ముఖ్యఅతిథి ఆవిష్కరించారు. 50 సంవత్సరాల కృష్ణాజిల్లా సాహిత్య కృషిని ప్రతిబింబించే వార్తాపత్రికల కథనాలతో రూపొందించిన ప్రదర్శనను శ్రీమతి శేషసాయి ప్రారంభించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ సంచికను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఆచార్య వెల్చేరు నారాయణరావు, పరుచూరి శ్రీనివాస్ రచించిన 'తెలుగుభాషా కథ'ను ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించి, విపులంగా ప్రసంగించారు.

కృష్ణాజిల్లా రచయితల సంఘం కేవలం జిల్లా స్థాయిలోనే కాకుండా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సభలు నిర్వహించి 12 బృహత్ గ్రంథాలను ప్రచురించిందని సభకు స్వాగతం పలికిన జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు శ్రీ గుత్తికొండ సుబ్బారావు, కార్యదర్శి డా॥జి.వి.పూర్ణచందు తెలియజేశారు.

పలువురు దాతలు నెలకొల్పిన ప్రతిభాపురస్కారాలను 2020, 2021 సం॥కు వివిధ రంగాల్లోని ప్రముఖులకు అందచేశారు.

'భాషాచైతన్యం–సాహితీ సంస్థలపాత్ర' అనే అంశం మీద 20కి పైగా సాహితీ సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు శ్రీమతి తేళ్ల అరుణకుమారి అధ్యక్షత వహించగా గజల్ శ్రీనివాస్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సులో పాల్గొన్నారు. తర్వాత జరిగిన స్వర్ణోత్సవ సత్కారాల సభలో పలువురు సాహితీ మూర్తుల్ని సత్కరించారు. ఈ సభకు సమాచార కమీషనర్ శ్రీ ఐలాపురం రాజా ఆత్మీయ అతిథిగా విచ్చేశారు. స్వర్ణోత్సవ వేడుకల కవిసమ్మేళనం జరిగింది. డా॥గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించగా శ్రీమతి ఎ.వి.కె. సుజాత నిర్వహించారు.

– గుమ్మా సాంబశివరావు

(ఫోటోలు : 3వ అట్టపై)

కన్నడ మూలం: డా. చంద్రప్ప సొబటి; తెలుగుసేత: రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబెగౌడర రామనగౌడ ఆత్మకథ

7

### పిచ్చెక్కి నృత్యం చెయ్యి 'హుచ్చురాయ'

నా కళా జీవితపు రెండవ దశలోని మొదటి ప్రదర్శన శికారిపురలో ఏర్పాటు అయింది.

శికారిపుర గణేష్ కమిటీ వాళ్ళు మమ్మల్ని ఆహ్వానించారు.

ఆ రోజు కొత్త బొమ్మలు, కొత్తమేళం, కొత్త ఆట అనే ఉత్సాహం, నాలోనూ మా బృందంలోనూ ఉంది.

నిజానికి నన్ను తీవ్రమైన భయం వేధిస్తోంది. వెనుకటి మేళంలోని సగం మందిని, బంధువులను వదిలి ఇప్పుడు ఆట ప్రదర్శిస్తున్నాం. ఈ ఆట విజయవంతం కాకపోతే నేను జీవితాంతం 'ఓడిపోయినవాడు' అనే నిందను నా తలమీద మోసుకొని తిరగవలసి ఉంటుంది.

ఇలాంటి ఆలోచనలతో అక్కడికి పోయి వేదిక నిర్మించాను. 'హుచ్చేశ్వరుని' గుడి ప్రాంగణంలో అంటే గుడి ముందు బయలు స్థలంలో వినాయకుడిని కూర్చోబెట్టారు. ఆట మొదలు పెట్టాలి. పిల్లలు, మేళం పూజ చేస్తున్నారు. నాకు ఏమయిందో తెలియదు. హఠాత్తుగా ఏడ్వటం మొదలుపెట్టాను. మా తండ్రిగారు స్వర్గంలో ఎక్కడో నిలబడి మా బొమ్మలను చూస్తుంటారు. ఆయన– 'గతంలో అందరం కలిసి ఆట ప్రదర్శించాం. ఇప్పుడు ఒక్కడివే ఆడటానికి వచ్చావా? నువ్వు ఎలా ఆడతావు? ఆడరా...ఎలా ఆడతావో నేను చూస్తాను' అని అంటాడేమోననే ఆలోచన మనసును వేధిస్తోంది. అంతేకాకుండా 'నా ఇద్దరు కొడుకులు చనిపోయారు. వాళ్లను వదిలేయ్. నా మనవళ్ళు ఉన్నారుకదా. వాళ్లందరినీ వదిలి నువ్వొక్కడివే నా పేరిట అధికంగా సంపాదించడానికి వచ్చావా? వాళ్లను తీసుకుని వస్తే ఏమయ్యేది?' అని అంటాడేమోననే ఆలోచనతో ఏడుస్తూ కూర్చున్నాడు.

నేను ఏడవడం చూసి మేళం కళాకారులు చాలా భయపడ్డారు.

"ఏమైంది? ఎవరైనా ఏమైనా అన్నారా?" అని అడిగారు.

నేను వాళ్ళ ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు. నా మనసులో కలిగిన బాధను, కలవరాన్ని చెప్పడం నాకు ఇష్టం లేదు. నాన్న, అన్నయ్య, తమ్ముళ్ళతో కలిసి బతికాను. ఆట ప్రదర్శనలోని కష్టసుఖాలు, సంబంధాలు ఏవి వారికి సరిగ్గా తెలియవు. నాన్న బతికున్నప్పుడు అన్నదమ్ములతో మాకు ఉన్న ఏ సంబంధాలు వారికి అంత ముఖ్యమని అనిపించటం లేదు. వారికి ఈ నాటిది మాత్రమే ముఖ్యం. అందువల్ల "నా మనసులోని బాధ. వదిలేయండి" అని చెప్పి ఆట మొదలు పెట్టమని చెప్పాను.

ఆట మొదలు పెట్టే పనిలో మునిగారు.

నేను చేతికి బొమ్మలు తీసుకున్నాను. అప్పుడు నా ఒళ్ళంతా ఒక విధమైన పులకరింత.

సుమారు రెండు సంవత్సరాల తర్వాత ఆట ప్రదర్శించడానికి బొమ్మను పట్టుకున్నాను. ఎదురుగా ఉన్నా హుచ్చేశ్వరుడికి నిల్చున్న చోటినుండే చేతులు జోడించి నమస్కరించి 'తండ్రీ, నా బొమ్మలను ఈరోజు పిచ్చెక్కినట్టు ఆడించు. నా మనసులోని పిచ్చి, ఆట పైన ఉన్న పిచ్చి వదిలిపోకుండా ఆడించు. నృత్యము చేయించు. ఎక్కడ ఆట ప్రదర్శించినా నీ ఆశీర్వాదం నామీద సదా ఉండాలి, నా ఆట మీద ఉండాలి' అని మనసులోనే వేడుకున్నాను.

హుచ్చేశ్వరుడు అంటే 'హనుమాన్'... అంటే హనుమంతుడు. హనుమంతుడిని సాతేనహళ్ళిలో సంతేశ్వర, బ్యాడిగి తాలూకా కదరమండలిగిలో కాంతేశ్వర అని పిలిచినట్టు ఇక్కడ హుచ్చేశ్వరుడని పిలుస్తారు (కన్నడలో హుచ్చు- అంటే పిచ్చి అని అర్థం). అయితే హనుమంతులు అందరూ ఒక్కరే కదా? మా ఊరి ఆంజనేయుడి దగ్గర ఆ మొక్కు తీర్చుకుంటే సరిపోతుందని, "నా బొమ్మ నీ పేరులాగే పిచ్చెక్కి ఆడితే మొక్కు తీరుస్తాను" అని వేడుకున్నాను. హుచ్చేశ్వరుడిని వేడుకున్న తర్వాత విఘ్నేశ్వరునికి చేతులు జోడించాను.

అప్పుడు మరొకసారి నా తండ్రి గుర్తు తెచ్చుకుని, 'నాన్నా, నేను శత్రుత్వంతోకానీ, వైషమ్యంతోకానీ తమ్ముడిని, అన్నదమ్ముల పిల్లల్ని వదిలి రాలేదు. ఇంతకు మునుపు కలిసిమెలిసి రమ్మని ఎన్నోసార్లు పిలిచాను. ఆటకు రాకపోయినా, కనీసం బొమ్మలను కూడా మాకు ఇవ్వలేదు. ఈరోజు కూడా పిలిచాను. రాలేదు. "బాగా ఆడుతావులే వెళ్ళు" అని వెక్కిరించారు. వాస్తవం నీకు తెలుసని అనుకుంటాను. అందువల్ల నువ్వు ప్రపంచంలో ఎలా అభివృద్ధి చెందావో అంతకు రెట్టింపుగా అభివృద్ధి చెందు నాయనా అని ఆశీర్వదించాలి' అని మా తండ్రిని తలుచుకుని ఆట మొదలు పెట్టాను.

ఆట విజయవంతంగా ప్రదర్శించాం. అక్కడ ఆ రోజు కర్ఫ్యూ జారీలో ఉంది.

అయినా రాత్రి పన్నెండు గంటలైనా మా ఆట సాగుతూనే ఉంది. ఎవరూ ఆటను అడ్డుకోలేదు. చాలా మంది ప్రభుత్వ అధికారులు వచ్చారు. స్వయంగా పోలీసువాళ్ళు వచ్చి ఆటను చూశారు. పన్నెండున్నర గంటలకు మేము ఆట ముగించాం.

ఆ రోజు ఆటను ప్రదర్శించామంటే అది కేవలం హుచ్చేశ్వరుని ఆశీర్వాదం వల్ల. మా నాన్న నా లోపల దూరి పాత్రలను, సంభాషణలను ఎక్కడ పొల్లు పోనీయకుండా చెప్పించాడు. అందువల్ల ఆట విజయవంతమైంది.

నేను ఆరోజు – నువ్వు గొప్పవాడివి హుచ్చేశ్వరా అని

తలుచుకుంటూ హుచ్చేశ్వరుడికి, విఘ్నేశ్వరుడికి కాయలు, పూలు, పళ్ళు సమర్పించి, నమస్కరించి, ప్రసాదం తీసుకుని అదే భోజనం అనుకొని తిన్నాను. ఎందుకంటే ఉదయం నుంచి నేను భోజనం చేయలేదు. ఉదయం ఇంట్లో ఇంటి దేవుడైన వీరన్న దగ్గర ఆ రోజు ఆట విజయవంతం అయితేనే అన్నం తింటానని, లేకపోతే అన్నం తినడం మాని చచ్చిపోతానని ప్రమాణం చేసి వచ్చాను అందువల్ల ప్రసాదమే భోజనంగా తీసుకున్నారు.

ఆ రోజు మొదలైన మా ఆటప్రదర్శన ఎంతగా ప్రసిద్ధి చెందిందంటే ఆ రోజు నుంచి 22 ఆటలు విరామం లేకుండా ప్రదర్శించే వరకు మేము ఇల్లు చేరలేదు.

ఈ విషయం పత్రికల్లోనూ వచ్చింది

ఈ మధ్యన నాలో ఉన్న కళను విద్వాంసులు గుర్తించారు.

తండ్రిలా నువ్వు కూడా మంచి కళాకారుడివి అని పొగిడారు.

తాలూకా, జిల్లా, రాష్ట్రస్థాయిలో సన్మానాలు చేశారు. జానపద అకాడమీ పురస్కారం, రాజ్యోత్సవ పురస్కారం మొదలైన అనేక పురస్కారాలు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. దీనివెనుక మా మేళంవారి, కుటుంబ సభ్యుల, అభిమానుల శ్రమ ఉంది. అంతేకాకుండా శ్రీకృష్ణుని ఆశీర్వాదమూ ఉంది. 'శ్రీకృష్ణ నువ్వు అక్కడ పడుకోలేదు. మా ఇంట్లో దాక్కున్నావ్' అని నాకు అనిపిస్తుంది. అందువల్ల, పున్నమి రోజున, అమావాస్య రోజున అతన్ని, అతని పరివారం వారిని (అంటే బొమ్మలను) తప్పకుండా పూజిస్తాం.

### శ్రీ కమలాంజనేయ మేళం

తాతయ్య కాలం నుంచి వాడుకలో ఉన్న 'శ్రీ యక్షగాన కళాదర్శక కొయ్య బొమ్మలాట మండలి" అనే పేరిట మళ్ళీ ఆట ప్రదర్శనలు ప్రారంభించాను. ఇలా రెండు మూడు నెలలు గడిచి ఉండాలి.

అప్పుడు నెమ్మదిగా సమస్యలు మొదలయ్యాయి.

అన్న కుమారుడి నుంచి 'శ్రీ యక్షగాన కళా దర్శక సూత్ర బొమ్మలాట మండలి" అనే పేరిట ఆట ప్రదర్శించకూడదని ఫిర్యాదు వచ్చింది. అంతేకాకుండా గ్రామస్తులు ఆట ప్రదర్శన కోసం మాకు 'ఇళెవు'– తాంబూలం ఇవ్వడానికి వచ్చినప్పుడు కూడా మాకూ, వారికీ ఇబ్బంది కలిగేది. ఒక్కోసారి మా ఇంటికి రావలసినవాళ్ళు వాళ్ళ ఇంటికి వెళ్ళేవారు.

ఇంతకన్నా తీవ్రమైన సమస్య మాకు ఉత్తరాల వల్ల వచ్చేది. మాకు వచ్చిన ఉత్తరాలను పోస్ట్‌మ్యాన్ ఒక్కోసారి మా అన్నకొడుకు ఇంట్లో ఇచ్చేవాడు. మాకు రావలసిన ఉత్తరాలు మాకు అందేవి కావు. అది పోస్ట్‌మ్యాన్ తప్పు కాదు. మా అన్న కొడుకు మా పాత ఇంట్లో ఉంటున్నాడు, అప్పటిదాకా బొమ్మల ఆటకు సంబంధించిన అన్ని వ్యవహారాలు జరిగింది ఆ ఇంట్లోనే.

ఈ సమస్య పరిష్కారానికి నాకు తెలిసిన కొందరు అధికారులను, విద్వాంసులను అడిగాను. తండా పేరును అంటే మా మేళం పేరును మార్చుకోమని సలహా ఇచ్చారు. ఒక మేళానికి తాతల కాలంనాటి నుంచి వచ్చిన పేరును పోగొట్టుకోవడం అంత సులభం కాదు. ఆ బాధ నాకు తెలుసు. పేరు మారితే పెద్దల ఆశీర్వాదం తప్పిపోతుందనే భయం. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా మా మేళం చరిత్ర కనుమరుగు అవుతుందనే ఆలోచన విపరీతంగా బాధించింది. అయితే పేరు మార్చుకోక తప్పలేదు. దాంతో తల్లిదండ్రుల పేరు కలుపుకున్న 'శ్రీ కమలాంజనేయ (కమలమ్మ, ఆంజనేయ అంటే హనుమంత) కొయ్య బొమ్మలాటల మేళం' అనే పేరు పెట్టాను.

తల్లితండ్రుల ఆశీర్వాదమేమో! నేను అనుకున్నట్టే మేళానికి ఏ సమస్యలు ఎదురవ్వలేదు. ఈ పేరుతోనే సుమారు 200కు పైగా ఆటలు ప్రదర్శించాను. ఈ ప్రదర్శనల ద్వారా తల్లిదండ్రులను నా మనసులో సజీవంగా, చైతన్యవంతంగా నిలబెట్టుకున్నాను. వారు నాకు అప్పగించిన బాధ్యతల్లో కళాసేవ కూడా ఒకటి. ఆ కళాసేవ చేస్తూ వారిని నిత్యం గుర్తు చేసుకుంటున్నాననే భావన నాది.

### కళాకారులకు డబ్బులు– మాకు కీర్తి ప్రతిష్ఠలు

కొయ్య బొమ్మలాట మా వంశపు కళగా ముందుకు కొనసాగాలనే కోరిక నాన్నకు ఉండేది.

'ఇంటివాళ్ళే కాకుండా (మేళంలో ఉన్న ఇతర సభ్యులు కూడా శ్రమిస్తేనే ఈ కళ నిలుపుకోవడం సాధ్యం' అని నాన్న అప్పుడప్పుడు అనేవారు.

అందువల్లనే మేళంలోని ఏ కళాకారుడి పట్ల భేదభావం చూపించేవాడిని కాను. వాళ్ళు మా ఇంటికి వచ్చినప్పుడు కూడా కుటుంబ సభ్యులు అనే భావనతో చూసేవాళ్ళం. భోజనం చేసే సమయంలో ఎలాంటి తారతమ్యం చూపించే వాళ్ళం కాదు. అన్ని కులాలవారిని ఒకే పంక్తిలో కూర్చోబెట్టి భోజనం వడ్డించేవాళ్ళం. షహనాయి వాయించే అతను కొంగనాడుకు చెందిన వ్యక్తి. కొందరి ఇళ్ళల్లో ఇతర కులస్థులకు వేరుగా కంచాలు పెడతారు. అయితే ఇక్కడ అలా లేదు. 'మేము క్షత్రియులం. మాకు కులం లేదు. అంతేకాకుండా మేము సిద్ధారూఢ మఠం శిష్యులు. మఠానికి వచ్చిన వారిని సిద్ధారూఢ వేరుగా కూర్చోబెట్టి భోజనం పెడతారా?' అని మాతోపాటు కూర్చోబెట్టుకొని భోజనం వడ్డించేవారు మా నాన్నగారు. మా అమ్మ వాళ్ళు తిన్న కంచాలను వాళ్ల చేత తీయించేదికాదు. ఇది వాళ్ళకు చాలా గౌరవంగా అనిపించేది. "గౌడ ఇంటి కోడలికి గర్వమే లేదు. అందుకే వీళ్ళ ఇంట్లో కళామతల్లి నివాసం ఉంది" అనేవారు.

బొమ్మలాట నుంచి డబ్బు సంపాదించాలని నాన్న ఎన్నడూ అనుకోలేదు. అందుకు బదులుగా బొమ్మలాట మా వంశపు సంపద అనే భావన ఆయనలో ఉండేది. అకస్మాత్తుగా ఆట ఆడిన గ్రామస్థులు తక్కువ డబ్బు ఇస్తే దాన్ని వారి చేతిలో పెట్టి, ఒట్టి చేతులతో ఇంటికి వచ్చేవారు. అంతేకాదు వాళ్ళకు ఇచ్చింది చాలకపోతే ఇంటికి వచ్చి జొన్నలు కొలిచి ఇవ్వాలి" అని నాన్న అనేవారు.

'ఇళెవు' (తాంబూలం) తీసుకునేటప్పుడు కూడా అంతే. 'ఇంత మొత్తానికే' ఆట ప్రదర్శిస్తామని ఎన్నడూ పట్టుబట్టిన వాళ్ళం కాదు. సీజన్లో ఆట ప్రదర్శనకు పల్లెలకు పోయినప్పుడు, ఆటలు ప్రదర్శిస్తూ ప్రదర్శిస్తూ అలాగే దూరంలోని ఊళ్ళకు వెళ్ళిపోయేవాళ్ళం. అక్కడి నుంచి మా ఊరికి తిరిగి రావడానికి రెండు మూడు రోజులు పట్టేది. అలాంటి సమయంలో ఏ ఊరి వారైనా 'బాగా భోజనం పెడితే చాలు'. ఆ ఊర్లోనే ఒక ఆట ప్రదర్శించేవాళ్ళం. ఇలా దారిలో ఆట ప్రదర్శించినందుకు ఇంటికి రాగానే ఒక గిద్దెడు జొన్నలు, ఒక పడి పెసలు, ఇలా ధాన్యపు గింజలు ఇవ్వాలి. వాళ్ళు ఇంతే ఇవ్వాలని ఎన్నడూ పట్టుబట్టలేదు. 'మేళంలో పనిచేసేవారికి ఏదైనా ఇవ్వడం ధర్మం. పనిచేసిన వారికి ఇస్తే ఆ సిద్ధారూఢప్ప మనకు ఎక్కువ ఇస్తాడు'

అనే నమ్మకం నాన్నది. అంతే కాకుండా 'డబ్బు బయటి నుంచి వచ్చిన కళాకారులకు- కీర్తి ప్రతిష్ఠలు గొంబే గౌడకు' అనేవారు.

### గింజలు -ధాన్యం ఇచ్చి అమ్మ కళను సాకింది

నాన్న కొయ్యబొమ్మలాటను అమ్మ చాలా ఇష్టపడేది. తాము బొమ్మలను నమ్మి పన్నెండేళ్ళు పూజించినందుకే శ్రీకృష్ణుడు అయిదుమంది పిల్లలను కరుణించాడని అమ్మ చెప్పేది.అన్నిటికన్నా ముఖ్యంగా 'గొడ్రాలు' అనే నింద నుంచి తప్పించి ప్రజల నోళ్ళు మూయించాడు. అంతేకాదు మాకు కేవలం మగపిల్లల్నే ఇవ్వలేదు. మా ఇంటి వెలుగు కోసం ఆడపిల్లను కూడా ఇచ్చాడనే నమ్మకం అమ్మకు అపారంగా ఉండేది. అందువల్లనే ఆమెకు బొమ్మలంటే పంచప్రాణాలు. పున్నమి, అమావాస్య, ఉగాది మొదలైన పండుగలు వచ్చాయంటే అమ్మకు ఎక్కడలేని సంతోషం. అలాంటి ప్రత్యేకమైన రోజుల్లో ఉదయమే లేచి, ఇల్లు శుభ్రం చేసి, స్నానం చేసి, బొమ్మలను శుభ్రంగా తుడిచి, అలంకరించి పూజించేది. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో నాన్న మంచి దుస్తులు (అలంకరించడానికి ఉపయోగించే) తెచ్చి ఆ బొమ్మలకు తొడిగించాలి. పొరబాటున చౌకలో బట్టలు తెస్తే నాన్నతో గొడవపడేది. అలా పోషణ చేయటం వల్లనే బొమ్మలు మన్నికకు వచ్చాయి. ఆట ప్రదర్శనలోనూ చక్కగా కనిపించేవి. ఈ రోజు పోషణ లేక, ఆటకు ఉపయోగించక, ఆ బొమ్మలు పాడవుతుండటం నాకు దుఃఖాన్ని కలిగించింది.

పల్లెలకు పోయి నాన్న ఆట ప్రదర్శించి వస్తే అమ్మ చాలా సంతోషపడేది. 'నా భర్త కీర్తి దేశమంతటా వ్యాపించింది' అనేది. నాన్న వెంబడి వెళ్ళే మేళం వారు ఆట కోసం పల్లెలకు పోవడానికి ముందు, ఆట ముగించిన తరువాత వాళ్ళు మా ఇంట్లోనే ఉండేవారు. అలాంటి కళాకారుల భోజనాలకు, స్నానాలకు అన్ని ఏర్పాట్లు చూసేది. కులభేధాలు చూపేదికాదు. మమ్మల్ని, కళాకారులను ఒకే వరుసలో కూర్చోబెట్టి భోజనాలు వడ్డించేది. ఈ విధమైన ఆమె ప్రవర్తన కళాకారుల అభిమానాన్ని చూరగొనటంలో ప్రముఖ కారణమైంది.

నాన్న కాలంలో పుట్టుకొచ్చిన, ఇప్పటికీ అమలులో ఉన్న ఒక పద్ధతిని చెప్పాలి. ఆట ఆడటానికి నాన్నతో వెళుతున్న కళాకారులకు ఆటవల్ల తక్కువ సొమ్ము దొరికినపుడు ధాన్యం గింజలు ఇచ్చేవాళ్ళంకదా! అప్పుడు అమ్మే ధాన్యం కొలిచి ఇచ్చేది. నాన్న ఒక 'పడి' ఇచ్చి పంపమంటే అమ్మ 'పడి'మీద ఒక సేరు, అర్థసేరు ఒక దోసెడు ఎక్కువే వేసేది. పెద్ద కుటుంబం ఉన్న కళాకారులకు, ఇంట్లో ఏమీ లేని, కేవలం ఇతని సంపాదనపైనే బతుకుతున్న ఆ కళాకారుని కుటుంబానికి కాస్త ఎక్కువ గింజలు ఇచ్చి పంపేది. అమ్మలోని ఆ గొప్ప గుణానికి కళాకారులు అమ్మను ఎంతగానో అభిమానించేవారు. చుట్టుపక్కల పల్లెల్లోని మేళం వారు మా మేళాన్ని చీల్చి మా మేళంలోని కళాకారులను తమ మేళంలోకి పిల్చుకోవాలని ప్రయత్నాలు చేశారు. అయితే వీళ్ళు మా మేళం వదిలి వెళ్ళనే లేదు. అందుకు తల్లిలా అమ్మ అవసరాల్లో ఆదుకుంటుందన్నది ఒక కారణం కావచ్చు.

### ఆట ప్రదర్శనలో కొత్త నీరు

మా ఇంటి వెనుకటి కాలపు జీవితం, సాంస్కృతిక వాతావరణం నాకు ఇప్పటికీ కుతూహలాన్ని కలిగిస్తాయి. నాన్న కాలంలో మా ఇల్లే ఒక సాంస్కృతిక కేంద్రంగా ఉందనే భావన మాకు ఉండేది. ఈ రోజు దాన్ని ఊహించుకోవడానికీ సాధ్యం కాదు. ఆ రోజులలో స్వాములు-సంతులు మా ఇంటికి వచ్చి రోజుల కొద్దీ మా ఇంటిలో మకాం పెట్టి కొన్ని కార్యక్రమాలు చేయించేవారు. తామూ చేసేవారు. అమ్మ వాళ్ళందరికీ రకరకాల వంటలు చేసి వడ్డించేది. అన్నదానం చేస్తే, సాధు-సంతులను పూజిస్తే, వాళ్ళ సేవచేస్తే సంతానం కలుగుతుందని పూజిస్తూ వచ్చింది. మేము పుట్టిన తరువాత అమ్మ నమ్మకాలు మరింత పెరిగాయి. అందువల్ల ఒక్కింత కూడా విసుక్కోకుండా వారి సేవ చేసేది.

హుబ్బళ్ళి మఠం శ్రీ నాగభూషణ శివయోగి స్వామిజిగారు వచ్చి మా ఇంట్లో బస చేసినప్పుడు ఇంట్లో జాతర జరుగుతున్నట్టు జనం చేరేవారు. బస చేసిన రోజు లేదా వారున్న రోజులు సాయంకాలాలు ఒకటి రెండు గంటలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసేవాళ్ళం. అప్పుడు కొయ్యబొమ్మలాట ప్రదర్శించడమే ఎక్కువ. అరుదుగా పురాణ ప్రవచనాలు, సంకీర్తనలు జరిగేవి. ఆయనకూ కొయ్యబొమ్మల ఆట అంటే చాలా ఇష్టం. అందుకోసం నాన్న బొమ్మలాట ప్రదర్శించేవారు.

ఆటప్రదర్శన సందర్భంలో స్వామీజీగారు కేవలం మా ఆటను ఆస్వాదించడానికి ప్రేక్షకుడిగా వ్యవహరించలేదు. మా ప్రతి మాటను, సంభాషణను చాలా ఆసక్తిగా, శ్రద్ధగా వినేవారు. మా డైలాగుల్లో సంస్కారం లేని-లేదా చెడ్డమాటలు వినిపించిన వెంటనే ఆ మాటను మార్చి, శ్రోతలకు నచ్చేలా ఎలా చెప్పవచ్చో నేర్పించారు. ఉదాహరణకు మా నాన్న దగ్గర నేర్చుకున్న కథలో కర్ణుడిని 'లంజకొడకా', 'హీనకులం వాడా' అని పిలుస్తాం. ఆ పదాలకు బదులుగా 'సూతపుత్రా' అని పిలవాలని చెప్పారు. ఇలా డైలాగులను చిన్న, చిన్నగా మార్చి ప్రజలకు సులభంగా తొందరగా అర్థమయ్యేలా మార్చారు. సుమారు 12-13 సంవత్సరాలు ఇదే విధంగా మమ్మల్ని తీర్చిదిద్దారు.

స్వామీజీ చేసిన ఈ మార్పులునాన్నకు నచ్చలేదు. అయితే అన్నయ్య వీరన్నకు నచ్చింది. కారణం నాన్న కాలంలో ప్రజలు

### మాతృభాషలో విద్యకు విద్యార్థి సృజనాత్మకతకు లంకె

మాతృభాషలో విద్యకు, విద్యార్థి సృజనాత్మకతకు నేరుగా లంకె ఉందని నిరూపించే మరో పరిశోధన ఇటీవలే వెలువడింది. మిగితా పరిశోధనల్లానే ఇందులో చిన్నపిల్లల్లో, అప్పుడే బడిలో చేరే పిల్లల్లో మాతృభాషలో చదువు ఎలాంటి మెరుగుదలను ఇస్తుందో గణాంకాలతో నిరూపించారు పరిశోధనకర్త షీబా సివి. ఒడి నుంచి బడికి వెళ్ళే పిల్లవాడికి ఒడిలో(ఇంట్లో), బడిలో మారకుండా ఉండేది, వినిపించేది మాతృభాషలో పలుకులే. పిల్లలకు మాతృభాష విద్యను దూరం చేస్తే వేల ఏళ్ళ ఆలోచనల సమాహారంగా ఉన్న మాతృభాషలోని జ్ఞానం వృథా అయిపోతుంది. ప్రతి విద్యార్థికి తనకు సంబంధించిన కొన్ని అంశాలు, సాంస్కృతిక వారసత్వపు విషయాలు, మతపరమైన-తాత్వికమైన అంశాలు మాతృభాషలో చెబితేనే సరిగ్గా అర్థమవుతాయి. మాతృభాష విద్యకు దూరంగా ఉన్న పిల్లల్లో ఉచ్చారణా దోషాలు అధికంగా ఉన్నాయని వీరి పరిశోధన తెలుపుతోంది.



ఆయన వాడే పదాలకు విపరీతంగా ఆనందించేవారు.

పల్లెలలో ఆట ప్రదర్శనపుడు స్వామీజీ మార్చిన మాటలను ఆయన పొరబాటున కూడా చెప్పేవారు కాదు.

అన్నయ్యకు మఠం స్వామిగారి పట్ల గౌరవం. అన్నా, అతను చదువుకున్నవాడు. ఈ నాటి ప్రజల అభిరుచి అతనికి తెలుసు. కథల సంభాషణల్లో పురాణ ప్రవచనాల, కీర్తనల శైలిని జారీకి తీసుకుని రావటానికి ఇష్టపడేవాడు. నాన్న మాతోపాటు ఆట ఆడటానికి వచ్చేవరకు అన్నయ్య కోరికకు అడ్డంకులు ఉండేవి. నాన్న ఆట ప్రదర్శన వదిలివేసిన తర్వాత ఆటలో మార్పులకు ఎలాంటి ఆడ్డూ ఆటంకాలు ఏర్పడలేదు.

మా కాలంలో అప్పటికే కొన్ని డైలాగులను, అందులోనూ అశ్లీల పదాలను ప్రజలు ఇష్టపడేవారుకాదు. అందువల్ల స్వామీజీ శైలిని అలవరుచుకోవలసిన అవసం ఏర్పడింది. ఆ శైలిని అలవరుచుకున్న తర్వాత మా ఆటలో కథలలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అశ్లీల పదాల వాడుక తగ్గిపోయింది. దీర్ఘమైన సంభాషణలు సంక్షిప్తమయ్యాయి. అనేక పదాలను వదిలేశాం. ఆ పదాలలో కొన్ని ఇప్పుడు నాకు గుర్తుకు కూడా లేవు. కథల మధ్యలో నీతులున్న ఉపకథలను చేర్చాం. మొత్తానికి మా ఆట ప్రదర్శనలో కొత్తదనం కనిపించింది.

మా ఆటలోని కొత్తదనం గురించి జీశంప, నాగేగౌడ, బసవరాజ మలశెట్టి మొదలైన విద్వాంసులు వేదికమీద అప్పుడప్పుడు ప్రస్తావించేవారు.

ఈ కొత్తదనం వల్ల అవకాశాలు మరింతగా పెరిగాయి. ఇలాంటి కొత్తదనాన్ని అలవరుచుకోనటువంటి మేళాలు కనుమరుగయ్యాయని అనిపిస్తుంది.

**పాండవులు వస్తే ఊరి దరిద్రం పోతుంది**

మా తండ్రిగారితో సుమారు ఎనిమిది వందల ఆటలు ప్రదర్శించాం. అప్పుడు ప్రతి పల్లెలో ఆటలు ఆడించేవారు. ఒక్కోసారి మలెనాడు (కొండప్రాంతం) వైపు పోతే అక్కడి నుంచి శికారిపుర, శికారిపుర నుంచి తూర్తగుండి, బండి కట్టి, తడారు ప్రాంతాలలో ఆటలు ప్రదర్శిస్తూ ముందుకు వెళ్ళేవాళ్ళం.

మా తండ్రిగారు వేసవికాలం వచ్చిందంటే నాలుగు నెలలు కొయ్యబొమ్మలాటకే కేటాయించేవారు. పండుగలూ పబ్బాలలో ఊరి జనం ఆటలు ఆడించేవారు. వర్షకాలం కాకపోయినా ఆట ఆడిస్తే వర్షం వస్తుందని గ్రామీణుల నమ్మకం. పాండవులు(కొయ్యబొమ్మలు) శక్తివంతులు. వాళ్ళు తమ ఊరికి వచ్చారంటే తమ ఊరి దరిద్రం కొట్టుకునిపోతుందని పక్కనున్న పల్లెలో ఆటను ప్రదర్శనప్పుడు ఆ ఊరి పెద్దలంతా కలిసి మేమున్న చోటికి వచ్చి మమ్మల్ని పిల్చుకుని పోయేవారు. పక్కనున్న పల్లెలో ఏమి సంభవన ఇస్తారో అంతే సంభావన మేమూ ఇస్తామని అనేవారు. అందువల్ల విరామం లేకుండా రోజు ఏదో ఒక ఊళ్ళో ఆటలు ప్రదర్శించేవాళ్ళం.

అయితే హఠాత్తుగా అన్నయ్య కాన్సర్‌తో చనిపోయాడు. ఇది ఎవరూ ఊహించని విషయం. అయినా నేను తమ్ముడు, చెల్లెలిని పిల్చుకుని యాభై నంచి అరవై ఆటలు ఆడివుండొచ్చు.

అన్నయ్య పోయిన దుఃఖాన్ని ఇంకా మరక ముందే తమ్ముడు జీవనగౌడ హఠాత్తుగా గుండెపోటుతో మరణించాడు. మా కుటుంబమంతా శోకంలో మునిగిపోయింది. మా మేళం నిలిచిపోయింది. రెండు మూడు సంవత్సరాలు ఆట ప్రదర్శనలు

ఆగిపోయాయి.

బొమ్మలు అన్నయ్య వీరన్న గౌడ ఇంట్లో ఉండిపోయాయి. మా పిల్లలు "బొమ్మలు కదిలించకూడదని తాతయ్య చెప్పాడుకదా, కొత్త బొమ్మలు చేయించుకోండి" అన్నారు.

అక్కడక్కడ తిరిగి, బొమ్మలు తెచ్చాను.

నా పిల్లలకు తర్ఫీదు ఇచ్చి మేళం కట్టుకున్న తరువాత దాదాపు వందా, నూటాయాభై ప్రదర్శనలు చేశాం. అన్నీ కలిసి వెయ్యిన్ని యాభై నుంచి పదకొండు వందల ఆటలు ప్రదర్శించి ఉండొచ్చు.

ఆయన తన ఆటవల్ల వచ్చిన డబ్బు వివరాలు, మేళం వారికి పంచిన డబ్బు వివరాలు బుక్కులో రాసిపెట్టారు!

**బొమ్మల రిపేరి చేయించుకోండి**

శివరామ కారంతగారు సుమారు 16 ఏళ్ళ క్రిందట సాగరలో కొయ్యబొమ్మలాట కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్తమ ప్రదర్శన చేసినవారికి మూడువేల రూపాయలు కానుక పెట్టారు. ఆ సొమ్ము మాకే వచ్చింది.

అప్పుడు నాన్న "ఆ సొమ్ము నాకు వద్దు, బళ్ళారి జిల్లా హడగలి తాలూకా మైలార గ్రామం మేళం వారికి ఇవ్వండి. ఎందుకంటే వారి బొమ్మలు పాడైపోయాయి. ఈ డబ్బుతో రిపేరీ చేయించుకుంటారు" అని కారంత్‌గారికి చెప్పారు.

అప్పుడు కారంత్‌గారు నిర్ఘాంతపోయి 'కళాకారుల మధ్య ఇలాంటి సర్దుబాటు తక్కువ. హనుమన గౌడలాంటివారు ఇంకా తక్కువ" అని చెప్పి వారికి ప్రైజ్‌మనీ ఇచ్చారు.

దారిలో వచ్చేటప్పుడు "ఎందుకు నాన్నా, ఇలా చేశావు?" అని అడిగితే, "చూడు, వారి ఆటబొమ్మలైతే ఏమిటి? మన బొమ్మలైతే ఏమి? పాడైపోతే పాడైపోయినట్టేకదా? కృష్ణుడి బొమ్మ పాడవడం నేను కళ్ళతో చూడలేను. అందుకే ఇచ్చాను" అన్నారు.

ఇప్పటికీ నా ముగ్గురు పిల్లలు ఈ వృత్తిలోనే ఉన్నారు.

విశ్వవిద్యాలయం పట్టాంగ కార్యక్రమానికి నన్ను పిలవటం చాలా సంతోషంగా ఉంది.

**ఇంటి ప్రాంగణంలోనే విశ్వవిద్యాలయం**

జానపద విశ్వవిద్యాలయం ఏర్పడటం నాకు చాలా సంతోషం కలిగిస్తోంది. భారత దేశంలోని కర్ణాటకలో స్థాపించటం, అందులోనూ నేను పుట్టిన జిల్లాలోనే స్థాపించటం మరింత సంతోషాన్ని కలిగించింది. మా దుఃఖం, కష్టాలు, సంతోషాలు చెప్పుకోవటానికి విశ్వవిద్యాలయంలో ఒక వేదిక ఉందికదా అని సంతృప్తి కలుగుతోంది. మా సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయో లేదో తెలియదు. మా పిల్లల కాలానికైనా మేము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు దొరకవచ్చు, అప్పుడైనా కళాప్రదర్శకుల జీవితాలు సంతోషంగా సాగాలి. ఈ విశ్వవిద్యాలయం అలాంటి అవకాశాలు ఏర్పరచాలి. అంతేకాకుండా ఇక్కడ వివిధ జిల్లాల నుంచి వివిధ కళా ప్రదర్శనలు జరుగుతూ ఉండాలి!

**(అయిపోయింది)**

# అంబేద్కర్ చూపుడువేలే జీవనగీత

కోళ్లు మందంగా కూస్తున్నాయి.
ఢిల్లీ వాయుకాలుష్యంతో
నిండిపోయింది.
ఢిల్లీ నడిబొడ్డులో
జీవన సంక్షోభం.
వాయువు కాలుష్యం అయ్యాక
జీవశక్తి తగ్గదా?
నదుల పొరల్లో కూడా కల్మషం!
ఆ గులాబీతోట వాడిపోతోంది!
వాయుకాలుష్యాన్ని
మనిషికంటే ముందు
పువ్వులు గుర్తిస్తాయి.
నీరుకూడా స్వచ్ఛతను
కోల్పోతుంది.
సముద్రం అగ్గిసెగలు చిమ్ముతోంది.
నదులు మురికి వాసన వస్తున్నాయి.
రాజ్యాంగం
పాలకుల మాటల్లో ఆవిరైపోతోంది.
ఇప్పటికే యువత
మత్తు మాయావాదంలో
జీవిస్తోంది.
ప్రపంచ దేశాల్లోంచి ఓడల్లో
ఔషధాల కంటె
డ్రగ్స్ ఎక్కువగా వస్తున్నాయి.
మతోన్మాదం మెదడును
చిలుముతోంది.
ఛిద్రమైన మెదళ్లలోంచి
అనేకమంది దేవుళ్ళు
పుట్టుకొస్తున్నారు!
ముక్కోటి దేవతలు చాలక
పాలకుణ్ణి దేవుణ్ణి చేసి
పూజిస్తున్నారు!
మనిషి చేతులు చాచాక
అధినేత తప్పు ఏముంటుంది?
మనిషి బానిస అవుతున్నాడా?
ఎవరికో భజన చేసి
బతుకుతున్నాడా?
తన్ను తాను నిర్వీర్యుణ్ణి
చేసుకుంటున్నాడా?
జీవించడమంటే చైతన్యంతో
జీవించడం కాదా?
ప్రజ్వలనంతో జీవించడం కాదా?
ప్రశ్నలతో జీవించడం కాదా?
ఉనికితో జీవించడం కాదా?
ముందు జీవించడం నేర్చుకోండి.
అప్పుడు మీరు అంబేద్కర్ లా
రాజ్యాంగబద్ధులౌతారు.
మానవ సమాజ పరిణామాన్ని
అనుభూతం చేసుకుంటారు.
అప్పుడు మీకు గులాబీ తోట
ఎందుకు వాడిపోయిందో
తెలుస్తుంది.
పాలకుడు మాయావాదం
ఎందుకు చెబుతున్నాడో
అర్థమవుతుంది.
ఇది అంబేద్కర్ యుగం.
ఈ దేశ పునర్నిర్మాణానికి
ఆయన చూపుడు వేలే
జీవనగీత.

డా.కత్తి పద్మారావు
9948748812/9849741695.

హోసూరు తావు
నవల

అగరం వసంత్
094883 30209



**9**

“ఏం రా? ఓసూరోడా ఎట్లుండావు?” ఫోన్ ఎత్తతానే మాట్లాడె ముసలి.

“బాగుండాను ముసలి, నువ్వెంట్లుండావు?”

“ఎట్లుండానా, కాలంలా కలిసిపోయేకి సురువు అయితా వుండానురా”

“నువ్వు సురువయితే నీ చెయ్యి పట్టి పిలుచుకొనేకి అదేమన్నా నీ పెండ్లామా, కాలము ముసలి, కాలానికి గేణము వచ్చిందంటే నీకు గేణము వుండేలేదు అది తెలుసుకో”

“ఏం మాట మాట్లాడితివిరా, దాన్నింకానే నువ్వంటే నాకు ఇష్టము”

“ఈ పుంగు మాటలకేం కొదవలే. పోను చేసిన విషయము చెప్పు”

“ఈ నడమ మీ ఓసూరోళ్లు కట్టాయ తమిళ చట్టాన్ని ఎదురించి, ఓసూరులా, క్రిష్ణగిరిలా, మద్రాసులా ఊరేగింపులు పోరాటాలు చేస్తా వుండారు కదా. అట్లే పల్లిపట్టు, గుమ్మడిపూండి లాను ఇదే పోరాటాలు జరగతా వుండాయి. దీన్ని గురించి మాపక్క ఒగొగురు ఒగో మాదిరిగా మాట్లాడతా వుండారు. ఆ చట్టం గురించి నాకు సరిగ్గా తెలీదు రవంత చెప్పరా”

“ఇందాకంట తమిళనాడులా వుండే రెండుబాసల సూత్రం ప్రకారము తల్లిబాస-ఇంగ్లీషు, లేదా రాష్ట్రబాస-ఇంగ్లీషు చదవతా వుంటిమి కదా”

“అవునురా చెప్పు”

“2006లో కట్టాయ తమిళచట్టం తీసుకువచ్చిరి. దీని ప్రకారం తమిళనాడులా వుండే అందరూ, అన్ని మైనారిటీ బాసలవాళ్లు కూడా తమిళుని ఒగ బాసగా, ఇంగ్లీషును ఇంగో బాసగా తప్పకుండా చదవాల”

“మడి వాళ్లవాళ్ల అమ్మబాసలు”

“ఆడికే వస్తా వుండా”

“అమ్మబాసల్ని ఐచ్చికంగా చదవాల, దానికి మార్కులు వుండేలేదు”

“మార్కులు వుంటేనే చదివేలేదు. ఇంగ మార్కులు లేకుంటే ఎవరు చదువుతారురా”

‘మా బాధ కూడా అదే ముసలి. ఐచ్ఛికంగా చదివే మా బాసలకు మార్కులు ఇయ్యండా అనే మేము అడగతా వుండేది. తమిళము చదివేలేదని మేము చెప్పతా లేదు”

“ఇదా అసలు సమాచారము... అదేమో 50:50 జీ.వో. అని వచ్చినంటనే అదేమిరా”

“ఆ జీ.వో.ది ఒగ పెద్ద కత. ఇది వొద్దని కొందరు, అసలు ఇది జీ.వో. కాదని ఇంకొందరు, మా సమితిలా వాదాల పైన వాదాలు చేసిరి. దీని ప్రకారము ఏమంటే రాష్ట్రబాస తమిళానికి 50 మార్కులు వాళ్ల తల్లిబాసకి 50 మార్కులు అని”

“ఇది బాగానే వుందే. ఈ జీ.వో. ఎబుడు వేసిరి”

“కట్టాయ తమిళం జీ.వో.ని ఎదురిచ్చి తెలుగు/మైనారిటీ బాసల వాళ్లు గలాటాలు చేసిరి కదా! అబుడు, అప్ప సర్కారులా ఎలచన్లకి ముందర వేసిరి. ఆమీట ఆ ఎలచన్లలా అప్ప సోలి అమ్మ గెలిచె. వీళ్లు కూడా ఇబుడు కట్టాయ తమిళచట్టాన్ని పట్టుకొని వేలాడతా వుండారు.”

ఆ రెండు పార్టీల వాళ్లు కంతకి తగిన బొంతలురా. వాళ్లెట్ల మన బాసల్ని మనము చదివేకి విడస్తారు”

“కదా ముసలి, దాన్నింకానే నేను ఆ 50:50 జీ.వో. అయితే సరిపోతుంది. సర్కారుకి కావాల్సింది మనం తమిళం చదవాల. మనకి మన తల్లిబాస ఉండాల. తొందర లేకుండా వుంటుందని తెలుగుసంఘాల మీటింగుల్లా గొంతు చించుకొంటిని. కాని ఎవ్వరూ పట్టించుకోలే. అబుడొగ కిత పల్లిపట్టులా జరిగిన తెలుగు పోరాటముల్లా నేను కలుసుకొని కరపత్రాలు పంచి ఇదే విషయము మాట్లాడితిని. ఆడ కూడా నా మాటని పక్కలా పెట్టిరి. మాకు ముందర వున్నెట్లే వుండాలనె. తల్లిబాసకే మార్కులు వుండాలనె. దాన్నింకానే ఈ నడుమ తెలుగుసంఘాల పక్కకి కూడా పోయేలేదు” అంటా బేజారు పడితిని.

“అట్లంటే ఎట్లరా, శాన్నాళ్లనింకా పోరాటాలలా ఉండే వాళ్లకి ఏది మంచి ఏది చెడ్డ అనేది తెలీదా? అయినా నువ్వు చెప్పేది చూస్తే బాగానే అనిపిస్తుంది. వచ్చే నెల నవంబరు 1వ తారీకునాడు డి.యం.కే. పార్టీ అదినేత తళికి వస్తా వుండాడు. ఆపొద్దు మైనారిటీ బాసల వారికి వుండే తొందర్ల గురించి నేరుగా అడిగి తెలుసుకొనేకి

చిన్న మీటింగు పెట్టిండారు. ఆ మీటింగులా నువ్వు పోయి మాట్లాడు. అట్లే ఏడో తారీకు ఆంధ్రా సి.యం. మద్రాసుకి వస్తా వుండాడు. ఈ రెండు మీటింగుల్లా నువ్వు వాళ్లిద్దర్ని కలిసే ఏర్పాట్లు నేను చేస్తా" అని చెప్పి పోను పెట్టేసె ముసలి.

అన్ని జీ.వో.ల నకళ్లు, అబుడు విద్యా విదానము ఎట్లుండే, ఇబుడు ఎట్లుంది, తొందరలు ఏమి, ఎట్లుంటే సరిపోతుందని తెలుగు, తమిళం, ఇంగ్లీషు ఇట్లా మూడు బాసల్లానూ డి.టి.పి. చేసి పెట్టుకొని తయారుగా ఉండా.

తళి మీటింగుకు పోయేపొద్దు రానే వచ్చె. తళి అనేది ఓసూరు పక్కలా వుండే శాసనసభ నియోజకవర్గము. ఈడుండే పచ్చదనము, చల్లదనము చూసే ఇంగ్లీషువాడు దీనికి 'లిటిల్ఇంగ్లాడ్' అనే పేరు కూడా పెట్టిండాడు.

తల్లి అనే మాట వస్తా వస్తా తళిగా మారింది. ఈడ 'తంద్రి' అనే వూరు వుంది. అంతే కాదు ఓసూరు నింకా బేరికకి పోయే దోవలా పెండ్లాముల పల్లి, మొగుళ్ల పల్లెలు కూడా వుండాయి. పల్లెపేరు తెలుగు, ఇల్లుపేరు తెలుగు, కొండపేరు తెలుగు, బండపైన చెక్కిండేది తెలుగులా.

అదో అదో ఆ జాగాలా జనం గుంపులు గుంపులు వుండారే. పోలీసులు కావలి కాస్తా వుండారే, పార్టీ జెండాలు మెరస్తా వుండాయే, ఆడే ఆడే దళపతి మీటింగుకి వచ్చే జాగా.

ఆ హాలు సల్లగా శానా పద్దతిగా వుంది. నేను లోపల పోయి కూకొంటిని. మైనారిటీ బాసల గురించి మాట్లాడే మేము ఆరుగురమూ ముందు వరసలా కూకొంటిమి. ఒగరు అయినంక ఇంగొగరి పేరు పిలుస్తాము, వచ్చి మాట్లాడాలని ముందే చెప్పిరి.

జేజే దణుల మధ్య దళపతి లోపలికి వచ్చిరి. తెలుగులా ఒగరు, కన్నడంలా ఒగరు, తమిళంలా ఇంకొకరు మైనారిటీ బాసా బాదల గురించి చెప్పతా వుంటే దళపతి వింటా వుండారు.

నా పేరు పిలస్తానే పోయి జీ.వో.ల సమాచారం చెప్పాలని ఎదురు చూస్తా వుండా, కాని కడగంటా నా పేరు పిలవలే. కడకి మీటింగు అయిపోయె. అయిందేదో అయిపోయె అని, నాతావ వుండిన విన్నపాన్ని దళపతి పోయేతబుడు ఇస్తిని. నగతా తీసుకొనిరి. ఏదయితే ఏమి, ఎట్లయితే ఏమి మా బాధలు బాసాబాధలు దళపతికి తెలుస్తాయని సంబర పడితిని.

"మైనారిటీబాసలవాళ్లకి ఏమీ తొందర లేకుండా చూస్తానని దళపతి హామి ఇచ్చిరి" అని టీ.వీ.లా వచ్చిన సుద్ది చూసి శానా సంబరపడితిని. ముసలికి పోన్ చేసి "నేనూ మాట్లాడితిని" అని అబద్ధం చెప్పితిని. నేను మాట్లాడకున్నా నా మాటల్ని విన్నపములో పెట్టిండాను. అది చాలదా.

"మంచిపని చేస్తివిరా ఓసూరు, ఎవరు ఏది చేసినా అది జనాలకి మంచి కావాల. అంతే కదా కావాల్సింది. మొన్న పాతపేపర్లు తిప్పతా వుంటే, ఓసూరు నింకా వచ్చిన తెలుగు సంఘమోళ్లని, క్రిష్ణగిరిలా తమిళము వాళ్లు బాగా దంచిరి అని వేసిండారు ఏమది?" అంటా అడిగె.

"ఆ పేపర్ సుద్ది ఇదీ ముసలీ. క్రిష్ణగిరి జిల్లాలా తెలుగుని రెండవ అధికారబాసగా చేయాల లేదా రాయలసీమలా కలపాల అని ఓసూరు తెలుగుసంఘాలు అన్నీ కలిసి క్రిష్ణగిరిలా జరిపిన మౌనపోరాటము అది. దాంట్లో నేనూ వుండా. నన్నూ ఆపొద్దు లోపల వేసిరి(పోలీసుల నిర్బంధం)" అంటానే ముసలి "నిన్ను లోపల వేసిరా" అంటా నగి నగి పెడతా వుండాడు.

"ముసలిముండాకొడకా, నన్ను లోపల వేసిందానికి నీకు నగువొస్తుందా"

"నిన్ను లోపల వేసిందానికి కాదురా, మీరు అడిగిన కోరికకి"

"కోరరాని కోరిక ఆడ ఏముంది ముసలీ"

"ఏముందా, రాయలసీమ అంటే ఆంధ్రా కదా"

"ఊ"

"కాదురా మీకేమైనా బుద్ధి ఉందా, ఆడే తెలుగుకి టికాణి లేకుండా అయితావుంది. అట్లాతబుడు మీరేం చేస్తార్రా ఆడకుపోయి, అయినా మీకేమైనా సలిగెలు(వసతులు) కావాలంటే సర్కారుని అడగాల కానీ ఆంధ్రకి పోతాము అంటే ఎట్లరా? దాన్నింకానే ఆడ మీకు పూజ అయిండేది"

"పూజాలే, గీజాలే. మేము నూరుమందిమి, మాకు అనుమతి ఇచ్చిన జాగాలా బేనర్లు కట్టి మాపాటికి మౌనదీక్ష చేస్తా వుంటే, ఒగ మీసాలు లేని ముసలోడు, అయ్యప్పమాల వేసిండే వయసు చిన్నోడు వచ్చి, ఆ బేనర్లు పీకేసి మమ్మల్ని తిడతా మాపైకి వచ్చిరి. మా గుంపులా కొందరు చిన్నోళ్లు వాళ్లపైకి పోయిరి. అంతే ఆడ నడిచింది. పోలీసులు వాళ్లని విడచి మమ్మల్ని అరెస్టు చేసి దూరంగా తీసుకొని పోయి, మాపుసారి కంటా ఒక సత్రములా పెట్టి ఆమీట విడచిరి" అని జరిగింది చెప్పితిని.

"ఓ ఇదా సమాచారము"

"ఊ ముసలీ. అయినా అయ్యప్పసామిమాల వేసుకోని, ఆ తమిళచిన్నోడు ఆడ ఏమి రంగాటము చేసె అంటావు. మాల వేసినోళ్లు అట్లా చేయొచ్చా" అంటా అడిగితిని.

"అయ్యప్ప మాలాలే కయ్యప్ప మాలాలే, తమిళులకి వాళ్ల బాసే మొదలు, ఆమీటే అన్నీను" అనె.

"చూడు, నువ్వు వుండావు కదా తెలుగు ముసలోడివి. నగేకి మాత్రము లాయక్కు (ప్రయోజనం)" అంటిని.

"నగువు నాలుగు విదాల మంచిదిరా"

"అదే నగువు నాలుగు విదాల చేటు కూడా. నువ్వు పోను పెట్టు" అని అంటిని.

×××

వచ్చేవారము మద్రాసు విమానాశ్రయములా ఆంధ్రా సి.యం.ను కలిసి నా విన్నపాన్ని ఇయ్యాలని తయారవుతా వుండా.

పొద్దిన్న నాలుగుగంటల పొద్దుకి నేను, నా సావాసగాళ్లు నలుగురూ కలిసి ఓసూరు నింకా మద్రాసుకి కారులా పోతిమి. చేరాల్సిన జాగాకి 10 గంటల పొద్దుకి చేరుకొంటిమి.

"ముసలీ ఈడ వుండా" పోనులా అంటిని.

"ఈ నంబరుకి పోను చేయి. వాడంతా చూసుకొంటాడు" అనె. నేను అట్లే చేస్తిని. వాడు రమ్మన తావుకి పోతిని. అదొగ పెద్ద లాడ్జి.

"మీరేనా ఓసూరు నింకా వచ్చిండేది" ఓ నల్ల మొకమువాడు మాట్లాడిచ్చె. అవునని నేనూ ఎదురు మాట మాట్లాడితిని.

"సీ.ఎం. మూడుగంటలకి ప్లేను దిగతారు. ఆడనింకా ఒగ ప్రయివేటు కాలేజీ వోపెన్ చేసేకి పోతారు. ఆడ జనం జాస్తిగా

వుంటారని, ఈడ కలిసేకి ఏర్పాటు చేసిండా, అరగంట ముందర్నే ఆడకి వచ్చిడాల తయారుగా వుండండి" అని చెప్పి పోయె. నా మనసు అబుదు రవంత తాంశము (నెమ్మది) ఆయె.

సాంబారు ఇడ్లీ తిని బెడ్డు పైన పసుకొంటిని. సీ.యం. తావ ఏమేమి విషయాలు మాట్లాడాలా? ముఖ్యముగా మాట్లాడాల్సింది ఏమి? అని నాలా నేనే యోచన చేస్తా వుండా. నా యోచనకి అడ్డు పొద్దు లేకుండా వుంది. ఇది కాలానికి తెలిసినట్లుంది. నాకు గాలం వేసి నన్ను రూంలా నింకా ఎత్తి విమానాశ్రయము తావ తోసె. అబిటికే ఆడ నూరారు జనం తెలుగులో మాట్లాడతా నిలిచిండారు.

"ఆంధ్రా సీ.యం. వస్తారంట" తమిళంలా మాట్లాడతా ఇంకొందరు పోతా వుండారు.

"కరెక్టుగా 2.50 నిమిషాలకి నేను వచ్చి పిలుస్తాను, నువ్వు ఒగడివే లోపలికి రావాల" అని చెప్పి నల్లమొకమువాడు లోపలికి పోయె."సరే" అని నేను సంబరపడితిని.

రెండుగంటల యాభైనిమిషాల పొద్దు పోయి మూడుగంటల పదినిమిషాల పొద్దు వచ్చె. నల్లమొకము వాని జాడను కానమే అనుకొంటా పోన్ చేస్తిని. అది స్విచ్ఛాఫ్ వచ్చె.

ఎండ ఉడుకుకి నాలాని ఉడుకూ కలిసి నన్ను పిండి పిప్పిచేస్తా వుంది. అంతలానే పోలీసులు అడావుడిగా కనిపిచ్చిరి. సీయం. వచ్చెనా అని చూస్తిని. నల్ల కమాండోల కవచంలా సీ.యం. నడచి వస్తా వుండారు. ఆయన పక్కలా నల్లమొకమోడు మాట్లాడతా నడస్తా వుండాడు. ఈ పాపినాకొడుకు సీ.యం.ని చూసిన సంబరములా నన్ను మరచినట్లుండాడు కదప్పా అనుకొంటా వానికి సైగలు చేస్తా వుండా. వాడు నన్ను చూసీచూడనట్ల వుండాడు.

సీ.యం. కారు ఎక్కేతబుదు పత్రికల వాళ్లు, టీ.వీ.ల వాళ్లు మైకులు అడ్డం పెట్టిరి. నేను మెల్లగా వాళ్ల వెనక చేరిపోతిని. రెండు నిమిషాలు వాళ్ల తావ మాట్లాడి నమస్కారం పెట్టిరి. అబుదు నా విన్నపము కవరును సీ.యం. ముందుకి దూర్పితిని. నా మొకము చూడకుండానే సీ.యం. దాన్ని తీసుకొనిరి. అదేదో ఆనందములా 'జై తెలుగుతల్లి' అంటిని. ఆడుండే వాళ్లందరూ అట్లే అనిరి. మాకందరికి సీ.యం. దండాలు పెట్టి కారెక్కి కదలిరి.

నాకు శానా బేజారాయె. కారు వెనక సీట్లో పోయి కండ్లు మూసుకొని కదలకుండా కూకొంటిని. కారు అట్లా ఇట్లా రోడ్లలా తిరగతా ఓసూరు దోవని వెదకతా ముందరికి పోతా వుంది.

"అదేలరా అట్లుండావు. మన చేతిలా ఏముంది. అంతా మన కర్మ" అనె లోకేసుడు.

"ఆ నల్లమొకము నాయాలు, సీయంని కలిసేది కష్టము, విన్నపము ఇయ్యండా నేనే ఇస్తాను అని చెప్పింటే, మనము దానికి సిద్ధమే. కాని ఈడకి పిలచి కడకి ఇట్ల చేసె" వెతపడె రవి.

"ఆ నాకొడుకులదంతా రాజకీయము లేరా" గిరిగాడు రేగె.

"మొన్న తళిలానూ ఇట్లే ఆయె. ఇబుదు ఈడా ఇట్లే ఆయె" ఉసూరుమనె సురేసుడు.

కారు పోయి మా ఇంటి ముందర నిలిచింది.

"నాన్న వచ్చీసె" అంటా నా కొడుకు పారి వస్తా వుండాడు. వాన్ని ఎత్తుకొని ముద్దులు పెడతా నా సావాసగాళ్లకి మనసులానే మప్పిదాలు చెప్పుకొంటిని.

కడుపుకి అంత కూడు తిని పసుకొంటిని. తలనొప్పిగా వుందని కండ్లు తీస్తిని. అబిటికి కోడిగుజ్జాము అయింది.

నా పెండ్లాము అబిటికీ నిద్రపోకుండా నాకు కావలి కాస్తా రాత్రంతా జాగరణ చేసినట్లుంది.

నేను ఇల్లు విడచి అవతలికి వేరే తావులకి పోతే ఆ రాత్రంతా దానికి నిద్ర వచ్చేలేదు. నా తలంపుల్లానే మునిగి తేలతా వుంటుంది. మనిషి తన జీవితములో ఒగసారి బంధాలలా చిక్కుకొంటే వాటిని విడచి వచ్చేకి, తప్పించుకొనేకి అయ్యే పని కాదు.

పెండ్లికి ముందర ఆ రమేశప్ప అట్లా వాళ్ల సావాసము చేసింటే, నేనూ అట్లా బతుకే బతికే వాణ్నేమో, తెలుగుతల్లి సేవలా తరించే వాణ్ణి ఏమో, కానీ అన్నీ అయినంక ఇబుదు ఇట్లాయె. అంతా నా కర్మ, కర్మ, కర్మ అనుకొంటా కేకరిచ్చి ఉమిస్తిని.

"నువ్వూ నీ ఉడుగు బుద్ది, ఎవర్ని ఉమస్తావు? ఎంతని ఉమస్తావురా? మనిషి పెద్దతనము ఉమిసే దాంట్లో కాదురా, మనిషిని చూసి బెమిసే (ఇష్టపడే) దాంట్లో వుంటుంది" అనె గోడబల్లి.

"ఇట్లా మాటలు విని విని నాకు చాలయింది. నీ పుంగు మాటలు నిలుపు బల్లి" గట్టిగా అంటిని.

"చూద్రా! నేను పురుగూ, పుటరా తింటా, గోడలా, గూడులా, గుంగులా వుంటా. కానీ నా మాటంటే మీ జనాలకి వేదంరా. అది తెలుసుకోకుండా నన్ను తాశారము (తక్కువ) చేస్తావేం రా?" అనె.

"నువ్వాగ తిక్కలు ముందవి, నీ మాట వినే జనాలు ఇంగా తిక్కలోళ్లు. నన్ని రేగీయొద్దు, నాకు రేగిందంటే నిన్ను చెప్పులా కొట్టి చిప్పలా బెల్లం పెడతా" అంటిని.

"అదేలరా నన్ను అట్ల ఆడిపోసుకొంటావు? ఈ అనంత విశ్వములా మనిషిబతుకు ఎపుడూ చిప్పలా బెల్లమే, మిగిలిందంతా శూన్యమే, తాంశము కారా, నిదానముగా అందాజు చేయిరా, అనంతం నీ ముందర వుందిరా, అవకాశం నీకు అందిందిరా" అనె. బల్లి చెప్పింది నిజమే. అందాజు చేసే అవకాశం నాకు చిక్కింది.

"అమ్మా బల్లి, నీ పాదాలకి నా ముద్దులు దండాలు తల్లీ" అంటిని. నాకు ఇబుదు ఎవరిమిందా కోపము లేదు. అంతా నాదే, అంతా నేనే అన్నెంత ఆనందముగా వుంది. నేను వుండాను, నావాళ్లు వుండారు, నా తెలుగుతల్లి వుంది, నేను లేకున్నా, నా వాళ్లు లేకున్నా, నా తావులా తెలుగు వుంటుంది. కాలాన్ని తనదిగా చేసుకొంటూ కలకాలం వుంటుంది. నేను ఏమి చేయాల, ఎట్ల చేయాల, ఏఏ అవకాశాన్ని ఎట్ల ఉపయోగించుకోవాల, అందాజు చేస్తా, ఆచరణలాకి వస్తా వుండా. మీ అందాజు కన్నా ఆచరణ బాగుందనిరి కొందరు. ఏమీ బాగాలేదని ఇంకొందరు. అయినా నాకు కోపం రాలే, కుశాలు కాలే. అట్లే వుండా, ఇట్లే వుండా, నేను ఇంగమీట ఇట్లే వుంటా.

"ఉండు... ఉండు... నీ మాదిరిగా వుండేకి నీలా నేను మనిషినా" అంటా కాలం. ఏమి చేసిందో, ఎంతపని చేసిందో, తెలుసుకొంటారా? తెలిసి తడుసు(తట్టు)కొంటారా? మావూరినింకా రమేశప్పని తరిమేసింది. నా ధర్మపురి ముసలోన్ని తనలా కలిపేసుకుపోయింది.

ఇంగ, నా తిట్టులా కతని కనిబెట్టేది ఎవురు? ఓసూరోడా అంటా నన్ను పిలిచేది ఎవురు? వాళ్లు ఈడ లేకున్నా, వాళ్ల గేణం నాలా వుంది. "నువ్వు తెలుగోడివి" అని నాకు ఎవరో గేణం చేసే



పనిలేదు.ఆ గేణం లేనోడికి వాడిని తట్టి లేపతా, తిట్టి లేపతా వుండా నేను.

×××

"దిన దిన గండం దీర్గ ఆయుషు" మాట అనిందారు కదా, మీరూ వినిందారు కదా.నా బతుకు దోవలా అదెన్ని గండాలు దాటిండానో, ఎన్నెన్ని గుండాలలా దిగిండానో, బదుకు అంటే ఇదే, బదుకు అంటే అదే, తిప్పేసి, మల్లేసి, ఉదికి ఆరేసి,ఇబుడు నా బదుకులా, ఇవ్వన్నీ అయిపోయిండాయి. ఊరికి దూరంగా, మావూరికి దూరంగా, చిన్నేటి గడ్డలా నా పెండ్లాముతో కలిసి నా బదుకు నేను బతకతా వుండా.

"రేయ్! రేపు వూరి పండగరా, మన వీది వాళ్లంతా కలిసి మారెమ్మ తల్లికి పిల్ల కొడతాము. మీరు ఇద్దరూ రావాల" మా రాజన్న పిలిచె.

ఒగబుడు నాకు నా వూరంటే ఇష్టం. ఊరి బదుకంటే ఇంగా ఇష్టం. కాని కొన్ని కారణాలు, ఇష్టం కష్టమనిపిస్తుంది, కష్టం ఇష్టమనిపిస్తుంది, ఈడ కన్నా ఆడ, ఆ గడ్డ, ఏటిగడ్డ ఇష్టమనిపిచ్చె. ఆడికి వెల్లేస్తిని. పెంచిన అమ్మ, పెరిగిన వూరి బందం, అంత బిరాన విరిగి పోతుందా! మా అన్న వాళ్ల ఇంట్లో నంజరచారు అన్నము తిని గుడితావుకి పోతిని.

గుడిగోపురము పైనింకా అరవపాట వినబడతా వుంది. తెలుగుపాటకి ఏమైందని గౌని కొడుకుని అడిగితే ఆ పాటలు వినేవారు కరువయిందారనె.

గుడిలోపల బజన గుంపోళ్లు అరకొర కూతలు కూస్తా వుండారు. "మీకేం వచ్చిందిరా పొద్దు" అంటా వాళ్లని గద్దిస్తిని.

'కైవారం తాతగారి తత్వాలు, ఆంజనప్ప సామి తత్వాలు మీ కాలానికి మిగిలిపోయె, ఇబుడు కొత్తవి తగులుకొని వుండాయి" మోటప్ప కొడుకు అంటానే ఆడికి ఒగ చిన్నోడు పారొచ్చె.

"నా కొడుకన్నా వీడు" అంటా చూపిచ్చె.

"ఒగ వేమన పద్యం చెప్పుపా" ఆశగా అంటిని.

"హూ ఈజ్ వేమన" అనె వాడు.

నాకు తల తిరిగిపాయె. కదలకుండా గుడి మెట్లమింద కూకొంటిని.

నేను ఇంతకాలం నావూరికి దూరమైతిని అనుకొంటినే కాని, నావూరికి తెలుగుతల్లి దూరం అయింది అనుకోలేదు.

నాతావు తెలుగు కళాకారులు, భాషాభిమానులు, బాషకోసం పోరాటము చేసినోళ్లు, ఊపిరి ఇచ్చినోళ్లు ఒగొగరే నా కండ్ల ముందర కనిపిచ్చి పోతా వుండారు.

తెలుగుపద్యం, పాట, ఆట, జానపదం, జ్ఞానపదం వినిబిచ్చి, వినబడనట్ల అయితా వుంది నాకు.

"తప్పెక్కడుంది. తప్పెవరు చేసిరి" వూరు ఎగిరిపోయే మాదిరిగా కిర్లితిని. నా కిర్లుకి ఎవరూ అదరలే బెదరలే. అసలు నన్నెవురూ పట్టించుకోలే.

అబుడు బల్లి గుడిగోడపైనింకా మెల్లగా "తాంశము కాప్పా

అంతా చేసింది చేసి ఎవరినో అడగతావా" అనె.

"అంటే నేను ఇట్ల చేస్తినా?నావూరు ఇట్ల అయ్యేకి కారణం నేనా? నా తెలుగుతల్లికి చెదులు పట్టించింది నేనా" ఆత్రముగా అంటిని.

అదే యోచనలా నావూరు విడచి ఏటిగడ్డకి పయనమయితిని. ఇంటికి పోయి పనుకొంటిని. నిద్ర రాలే, ఆకలి కాలే, నాకు ఏమీ కాలే, అయినా నాలా ఏమేమో అయితా వుంది. ఆ బల్లి ఎట్లా మాటనె? దానికెంత సొక్కు, దాని మొకము మండా, అది ఎగిరిపడి నిగురుకొనా, తిట్టుపైన తిట్టు తిట్టుకొంటా వుండా. ఆపొద్దు మా ఇంట్లో నాకు మంచిమాటలు చెప్పిన బల్లి గేణానికి వచ్చె. ఆ బల్లికీ ఈ బల్లికీ ఏమి వ్యత్యాసం. యోచన చేస్తిని. ఆపొద్దు నింకా ఈపొద్దుకి వాటి మాటలు అవి మాట్లాడతా వుండాయి. యిరివికి (బడాయి) పోయి యిచిత్రంగా మాట్లాడేకి అవేం మనుషులు కాదు కదా. ఆ బుద్ధి నాకు అట్లే తట్టె.

అవును కదా అకలాయముగా బల్లిని తిట్టితినే అంటా చింత చేస్తిని. ఆ చింత నాకు మానం, ఈనం, సూదు, సొరణ, చీము, నెత్తురు వుంటే నేను ఇంగ మీట గతకకూడదు, బతకగూడదు అనిపిచ్చె.

తెలుగంటే ఏమి? అనే తరం తయారు కాకముందే నేను నిగురుకోవాల, అంటా లేస్తిని, నడిస్తిని. ఊరికి దూరంగా, శానా వూర్లకి దూరంగా, చావుకి దగ్గరగా, చావుని చేరుకొనే జీవము నింకా, జీవశవం అయ్యేకి. చల్లనిగాలి, పచ్చటిచెట్లు, చంద్రోదయం కాని సాయంకాలం. చెరువుకట్టపై నడస్తా నేను.

"మా తెలుగుతల్లికి మల్లెపూదండ" నా సెల్ మోగె. ఎవరని చూస్తిని. నా కొడుకు. నేను వద్దన్నా వినకుండా పెండ్లాం బిడ్డలతో బెంగళూరులా బతకతా వుండే నా కొడుకు. అయిష్టముగానే పోన్ ఆన్ చేస్తిని.

"నాన్నా నువ్వు ఒగ అద్భుతం చూస్తావు, నెట్ ఆన్ చేయి" అని కట్ చేసె.

చావే శరణం అనుకొన్న నేను ఇబుడేమి అద్భుతం చూస్తాను. చూసి ఏమి చేస్తాను అనుకొంటానే నెట్ ఆన్ చేస్తిని. నా కొడుకు అట్లే ఫోన్ చేసె. నేను నా ఫోన్ తీస్తిని. అది వాట్సాప్ కాల్.

"అన్నా, గిన్నా, గులుగులు గున్నా, తారం తన్నా నీ పేరు అన్నా" అంటా నా మనమడు.

"అక్కా గిక్కా గులుగులు గుక్కా తారం తక్కా నీపేరు అక్కా" అంటా నా మనమరాలు.

"వేమన పద్యమునకు ఎదురు పద్యము లేదు" కెంచనవాళ్ల మునిగాని మనమడు.

"ఎవ్వని చే జనించు ఈ జగమెవ్వని" అంటా రాగం తీస్తా ఎర్రన్న మనమరాలు.

"ఒకరి సొమ్ముకు నేను ఆశపడలేదు ఆంజనేయ, చెయ్యెత్తి ఇస్తేను చేతులొడ్డినాను ఆంజనేయ'' అంటా కాటినాయనదొడ్డి రామకిష్టుని మనమడు, ఆంజనప్ప సామికి వారసుడయిండాడు.

"దేవుడనగ వేరే యే దేశమున లేదు దేవుడుండు తనలో దండిగాను దరణి నిండుగాను'' అంటా తాతగారి తత్వంలా లీనమయిండాడు అగ్గురారం నారాయణ మనమడు.

"ఏడవుంటే ఏమి, ఎట్ల వుంటే ఏమి, నీ తెలుగు వినబడాల కనబడాల, అట్లా బతుకు బతకాల, వాళ్ల బతుకులా తెలుగుండాల వెలుగుండాల" కట్టపైన వుండే చిన్నగంగమ్మ గుడిపైనింకా నగతా ఇంగో రాయప్రోలు సుబ్బారావులా మాట్లాడతా వుంది బుల్లి బల్లి.

నా కండ్లలా నీళ్లు కారతా వుండాయి.

"చచ్చేగంటా నీ కూడా వుంటానని పెండ్లిలా నాకు బాస ఇచ్చి ఇబుడు ఒగడివే ఇట్లా" అంటా నా పెండ్లాము కండ్లు వుజ్జతా వుంది.

పెండ్లాం, మొగుడు బంధమంటే ఇట్లుండాల. మానవ సంబంధాలు బాగుపడాలంటే, మనిషితత్వం తెలుసుకోవాలంటే, అమ్మనుడిలా చదివిండాల. చదువంటే నక్కేకి, నాకేకి, పనికి పోయేకి మాత్రం కాదు, కాదు కాదు, కానే కాదు. చదువంటే బతుకు, చదువంటే కళాచారం. చదువంటే ఉనికి, మన ఉనికి. ఈ గేణం, నాకు నావూరు ఇచ్చింది. తెలుగులా చెప్పింది.

నా ఉనికి ఇది అని నేను ఇపుడు చెప్పే పనిలేదు. ఏలంటే అది నా కొడుకు అందుకొనిండాడు. నా వూరు అందుకొనింది.

దాన్నింకానే నాకు వూరంటే... మా వూరంటే... ఓసూరంటే... అంత ఇష్టం.

జై తెలుగుతల్లి.

**(అయిపోయింది)**

## నూతన జాతీయ విద్యావిధానం సంగతులు

❖ జాతీయ విద్యావిధానాన్ని అస్సాం, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో అమలు చేసేందుకు పలు అడ్డంకులున్నట్టు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వాస్ అన్నారు. ఆయన ప్రకారం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న జనాభా లెక్కల ప్రకారం ఒక్క అస్సాం రాష్ట్రంలోనే 180 మాతృభాషల్లో పాఠ్యపుస్తకాలు రూపొందించాలి. ఢిల్లీ, లఖ్నో లాంటి ప్రదేశాల్లో జాతీయ విద్యావిధానం అమలు సులువవుతుంది కానీ అస్సాంలో కష్టమని ఆయన వాపోయారు.

❖ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో భారత కేంద్ర ప్రభుత్వం దేశంలో పలు కార్యక్రమాలు చేపట్టనుంది. 75 ఏళ్ళ స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశ సంస్కృతి-సంప్రదాయాలను పెంపొందించే కార్యక్రమాలతో జరుపుకోవాలని ప్రభుత్వ ఉద్దేశ్యం. జాతీయ విద్యావిధానం ప్రకారం పాఠ్య సామగ్రి, బోధనాంశాలు ఆయా రాష్ట్రాల ప్రజల మాతృభాషల్లో అందుబాటులోకి రావటం ఒక ముఖ్య విషయం. ఆ విషయాన్ని ఈ అమృత్ ఉత్సవ్‌తో ముడి పెడుతూ దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాలు తమ పాఠ్య సామగ్రిని ఆ రాష్ట్ర అధికార భాషల్లోకి అనువదించుకోవాలని. అది ఒక ప్రణాళిక ప్రకారం జరపాలని, ఆ ప్రణాళికను నవంబర్ 20, 2021 నాటికి ప్రభుత్వానికి తెలియపరచాలని నవంబరు 2 నాటి ఒక ప్రకటనలో కేంద్ర విద్యాశాఖ తెలిపింది.



**రత్నమ్మ గారి కోడలు**
**సుబ్బమ్మ గారి అల్లుళ్ళు**
రచన : రంగనాయకమ్మ
పుటలు: 288, వెల :80/-
ప్రతులకు :అరుణా పబ్లిషింగ్‌హౌస్,
ఏలూరు రోడ్డు, విజయవాడ - 520 002
ఫోన్: 94406 30378



**రక్తతిలకం** (ముఖ్యమైన మూడు బుర్రకథలు)
సంపాదకులు : ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు
పుటలు : 134, వెల:120/-
ప్రచురణ : ఆచార్య టి.వి. సుబ్బారావు
శ్రీకృష్ణదేవరాయ రసజ్ఞ సమాఖ్య, నెం.1708,
11వ క్రాస్, 1వ 'జి' మేయిన్, కంగేరి సాటిలైట్ టౌన్,
బెంగళూరు-560 060, సెల్: 99454 22742




**లేఖా సాహిత్యం**
సంపాదకత్వం: కాత్యాయనీ విద్మహే
పుటలు: 39, వెల: 30/-



**కాషాయ ఫాసిజం**
**హిందుత్వ తీవ్ర జాతీయవాదం...**
రచన: అశోక్ కుంబము
పుటలు: 32; వెల: 25/-




**తెహ్‌జీబ్**
(హిందుత్వ ఫాసిజంపై లౌకికవాద విశ్లేషణ)
రచయిత: వరవరరావు
పుటలు: 160, వెల :120/-




**బ్రాహ్మణవాదం**
(మార్క్సిస్టు విమర్శ)
రచన : మురళి
పుటలు : 133, వెల:100/-

ప్రతులకు: డి.వి.రామకృష్ణారావు ఎం.ఐ.జి.-14, ఎ.పి.ఐ.సి.కాలనీ, కార్బైడ్‌కంపనీ ఎదురుగా, మౌలాలి హైదరాబాద్-40 సెల్: 9989189250




**శ్రీకృష్ణదేవరాయలు ఎవరివాడు..?**
(శాసన, గ్రంథాధార పరిశోధన)
రచయిత: ధూపం అభిమన్యుడు
పుటలు:124, వెల: రు.200/-
ప్రతులకు: ధూపం అభిమన్యుడు
వెలుగోడు, కర్నూలు జిల్లా-518 533 ఆం.ప్ర
ఫోన్: 94904 83744



**ఔకు సీమ** (సంగ్రహ చరిత్ర)
రచయిత: డా॥ కురుమేటి కిశోర్ కుమార్
పుటలు: 160, వెల :150/-
ప్రతులకు : డా.కె.కిశోర్ కుమార్,
దంత వైద్యులు, మోడల్ దంతవైద్యశాల,
25-555, శ్రీనివాసనగర్, నంద్యాల-518 501
సెల్: 94402 44340

**బౌద్ధం-వైజ్ఞానిక మార్గం**
రచన: బొర్రా గోవర్ధన్
పుటలు: 248, వెల: రు.200/-
ప్రతులకు: ఆర్ట్స్ & లెటర్స్
హైదరాబాద్-500 029
ఫోన్: 040-27635654



**వేదావలోకనం**
రచన :బొర్రా గోవర్ధన్
పుటలు:278 వెల: 200/-
ప్రతులకు :ఆర్ట్స్ & లెటర్స్
హైదరాబాద్-500 029
ఫోన్: 040-27635654






**రాణిగారి కథలు** (బాలల బొమ్మల కథలు)
రచన: ఆర్.సి.కృష్ణస్వామిరాజు
పుటలు: 120 వెల: 140/-
ప్రతులకు:
ఫోన్: 9393662821
emai: rcksrajulic@gmail.com



**సముద్రమంత**(కవిత్వం)
రచయిత :కెంగర మోహన్
పుటలు: 64, వెల :50/-
ప్రతులకు : యస్. అరుణ,
ఇ.నెం. 43-238, ఫ్లాట్ నెం 102, ఎన్వీఆర్
ప్లాజా, రోడ్ నెం.8, నర్సింగరావు పేట,
కర్నూలు-518 003 సెల్: 9493375447

**వేళ్ళని వెదికే చెట్లు** (కవితాసంపుటి)
రచన: డా॥ సి.భవానీదేవి
పుటలు: 138 వెల: 150/-
ప్రతులకు: డా॥ సి.భవానీదేవి
హిమబిందు పబ్లికేషన్స్ 102,
గగన్‌మహల్‌అపార్ట్‌మెంట్స్, దోమల్‌గూడ,
హైదరాబాద్-29 ఫోన్: 040-2763 6172



**ఖయాల్** (సుభాని పొయెట్రీ)
రచన :సయ్యద్ మహబూబ్ సుభాని
పుటలు:66 వెల: 60/-
ప్రతులకు :సయ్యద్ మహబూబ్ సుభాని
డోర్.నెం. 7-525, టిప్పర్స్ వీధి,
పెద్దబావి బజార్‌వద్ద , మంగళగిరి
ఫోన్: 9963833942




Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# కృష్ణాజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ వేడుకలు

## నవంబరు 2021 ఆదివారం -పింగళి వెంకయ్య సభాప్రాంగణం, మచిలీపట్నం



ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి
గౌ॥ జస్టిస్ ఎ.వి.శేషసాయి, ఆం.ప్ర.హైకోర్టు న్యాయమూర్తి



ప్రసంగిస్తున్న సభాధ్యక్షులు:
డా॥ మండలి బుద్ధప్రసాద్

## ప్రతిభాపురస్కార ప్రదానాలు 2020, 2021


సాహిత్యప్రతిభ:ఆచార్యమాడభూషిసంపత్‌కుమార్


సాహిత్యసేవ: శ్రీ రసరాజు


సాహిత్యసేవ: శ్రీ శిఖామణి


పాత్రికేయప్రతిభ:శ్రీయాబలూరి సీతారామశర్మ


పాత్రికేయప్రతిభ: డా॥ సామల రమేష్‌బాబు


సాహిత్యప్రతిభ: ఆచార్య ఈమని శివనాగిరెడ్డి


సాహిత్యప్రతిభ: శ్రీమతి వాడ్రేవు వీరలక్ష్మీదేవి


అనువాదప్రతిభ: శ్రీ ఎల్.ఆర్. స్వామి


అనువాదప్రతిభ: శ్రీమతి గౌరీ కృపానందన్

50 ఏళ్లుగా నిరంతర సాహితీ సేవలను అందిస్తున్న ప్రతిష్టను సొంతం చేసుకొన్న కృష్ణాజిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవ వేడుకను 21 నవంబరు 2021 ఆదివారం మచిలీపట్నంలోని 'వేడుక' ఎ.సి. ఫంక్షన్ హాలులో ఉ॥ 10.30 గం॥ నుండి సా॥ 7 గం వరకు ఉత్సాహంగా విజయవంతంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి గౌ॥ జస్టిస్ ఎ.వి.శేషసాయి విచ్చేసి తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకొన్నారు. కృష్ణా జిల్లా జెడ్జి గౌ॥ నరసింహమూర్తి, లోక్ అదాలత్ జెడ్జి రామకృష్ణ ప్రారంభ సభలో పాల్గొన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు డా॥ మండలి బుద్ధప్రసాద్, అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డా॥ జి.వి.పూర్ణచంద్ సారథ్యంలో సర్వశ్రీ భవిష్య, కరెడ్ల సుశీల, డా॥గుమ్మా సాంబశివరావు, భమిడిపాటి బాలాత్రిపురసుందరి, తదితర కార్యనిర్వాహకవర్గ సభ్యులు కార్యక్రమాలను నిర్వహించారు. వివరాలు 39వ పుటలో చూడండి.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
DECEMBER 2021 Vol :7, Issue 7 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/14/2021-23

Bommidala
International

బొమ్మిడాల
ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు–522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244